www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 11-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 86 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి ఉ. 10.04 తదుపరి షష్ఠి; నక్షత్రం: పుబ్బ మ. 1.04 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 9.11-10.59; దుర్ముహూర్తం: ఉ. 10.10-11.02, మ. 3.22-4.14; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఏ సమస్యకైనా చర్చలే పరిష్కారం



ఆస్ట్రియా చాన్స్‌లర్ నెహామర్‌తో కలిసి సంయుక్త ప్రకటన చేస్తున్న ప్రధాని మోదీ

2

శాంతిస్థాపనకు మేం సహకరిస్తాం

ఆస్ట్రియా చాన్స్‌లర్ నెహామర్, ప్రధాని మోదీ సంయుక్త ప్రకటన

ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి పటిష్ఠ ప్రణాళిక: మోదీ

రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి స్థాపనలో భారత్ కీలకం: నెహామర్

'టికెట్ ధరల పెంపు'పై తేలుస్తాం

ఆ అధికారం సర్కారుకు ఉందా? లేదా?

దీనిపై లోతైన విచారణ జరుపుతాం

'కల్కి'పై దాఖలైన వ్యాజ్యంలో హైకోర్టు స్పష్టీకరణ



12



ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే

సెక్షన్ 125 వారికీ వర్తిస్తుంది.. ఈ చట్టం మతాలకు అతీతం

భరణం దయతో ఇచ్చేది కాదు.. అది వివాహిత మహిళల హక్కు

విడాకుల కేసులో ముస్లిం పర్సనల్ లాను పక్కనపెట్టి సుప్రీంకోర్టు సంచలన తీర్పు

భార్య ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలి.. ఆ బాధ్యత భర్తదే

తన ఆర్థిక వనరులను ఆమెకు అందుబాటులో ఉంచాలి

భార్యకు ఏటీఎం కార్డు ఇచ్చే భర్తలు అభినందనీయులు

తీర్పులో జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మహిళలు భరణానికి అర్హులేనని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. విడాకుల తర్వాత కూడా వారు ఈ అర్హత కలిగి ఉంటారని తెలిపింది. భర్త నుంచి భరణం కోరే హక్కును భార్యకు ఇచ్చే సీఆర్‌పీసీ సెక్షన్ 125 దేశంలోని మహిళలందరికీ మతాతీతంగా వర్తిస్తుందని పేర్కొంది. మహ్మద్ అబ్దుల్ సమద్ అనే వ్యక్తి తన భార్యకు 2017లో ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు ఇచ్చారు. ఆయన మాజీ భార్య తనకు సీఆర్‌పీసీ సెక్షన్ 125 కింద భరణం చెల్లించేలా సమద్‌ను ఆదేశించాలని ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు నెలకు రూ.20 వేలు భరణం కింద చెల్లించాలని సమద్‌ను ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. దీనిని సమద్ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేశారు. ముస్లిం పర్సనల్ చట్టం ప్రకారం తాను భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఆ విషయాన్ని ఫ్యామిలీ కోర్టు పట్టించుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఫ్యామిలీ కోర్టు తీర్పును రద్దు చేయటానికి హైకోర్టు నిరాకరించింది. నెలకు చెల్లించాల్సిన భరణాన్ని

మిగతా 2వ పేజీలో...





సీఎం చంద్రబాబుతో బీపీసీఎల్ ప్రతినిధులు

విన్ ఫాస్ట్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో పరిశ్రమల మంత్రి టీజీ భరత్, సీఎస్ నీరబ్ కుమార్ తదితరులు

రాష్ట్రంలో భారీ రిఫైనరీ!

75 వేల కోట్ల పెట్టుబడికి బీపీసీఎల్ రెడీ

సచివాలయంలో సీఎం చంద్రబాబుతో సంస్థ సీఎండీ, ప్రతినిధుల భేటీ

చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు 5 వేల ఎకరాలు అవసరమని వినతి

ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సమ్మతి

90 రోజుల్లో సమగ్ర ప్రణాళికతో రావాలని కంపెనీకి సూచన

అక్టోబరుకల్లా పూర్తి ఫీజిబులిటీ రిపోర్టుతో వస్తామన్న ప్రతినిధులు

రిఫైనరీకి బందరు అనువైన ప్రాంతం!

ఇది సాకారమైతే 25 వేల మందికి ఉపాధి



అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ పారిశ్రామిక సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. దాదాపు రూ.75 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు దిగ్గజ ప్రభుత్వ రంగ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ముందుకొచ్చింది. చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు

మిగతా 11వ పేజీలో...

4 వేల కోట్ల పెట్టుబడికి విన్‌ఫాస్ట్ సై

ఆ సంస్థ ప్రతినిధులతోనూ బాబు చర్చలు

ఓర్వకల్లు లేదా కృష్ణపట్నంలో ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల ప్లాంట్!

లక్ష కోట్లు పెట్టేందుకూ చమురు సంస్థ సిద్ధం

మంత్రి భరత్ వెల్లడి



ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయకుమార్‌రెడ్డిపై

విజిలెన్స్ విచారణ!

ఆయనకు సహకరించిన అధికారులపైనా..

రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సమాచార-పౌరసంబంధాల శాఖలో గత ఐదేళ్లలో జరిగిన అవకతవకలు, వాటిలో ఐ అండ్ పీఆర్ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి పాత్రపై విజిలెన్స్ విచారణ జరపాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకు సహకరించిన ఒకరిద్దరు అధికారులపైనా ఈ విచారణ జరగనుంది. గత ఐదేళ్లలో ఐ అండ్ పీఆర్ కార్యాలయాన్ని కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి వైసీపీ కార్యాలయంగా మార్చేశారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసు (ఐఐఎస్)కు చెందిన ఆయన జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. నిబంధనలన్నీ తుంగలో తొక్కి జగన్ రోత పత్రికకు ప్రభుత్వ ప్రకటనల రూపంలో రూ.వందల కోట్లు దోచిపెట్టారు. తన శాఖ బడ్జెట్ ఖర్చు చేయడంలో కనీస ప్రమాణాలు కూడా పాటించలేదు. వందల సంఖ్యలో ఉద్యోగులను అనధికారికంగా

మిగతా 2వ పేజీలో...

అలా వచ్చి.. ఇలా వాలిపోతున్నారు!

మంత్రుల పేషీల్లోకి వైసీపీ వీరభక్తులు

పీఎస్‌లు, ఓఎస్డీలుగా కీలకశాఖల్లో పాగా

'గనుల దొంగ'కు ఏకంగా పట్టాభిషేకం

మైనింగ్ మంత్రి ఓఎస్డీగా రాజాబాబు

నియామకానికి కదులుతున్న పావులు

గనులశాఖలో పనులు చక్కబెట్టుకునేందుకు

తెర వెనుక కాకినాడకు చెందిన నేత చక్రం

విషయం తెలిసి అప్రమత్తమైన ప్రభుత్వం

ఆ నేత వ్యవహారంపై మొదలైన విచారణ!

రామతీర్థం ఘటనలో బాబును అరెస్టుచేసిన అనిల్

హోంమంత్రి అనిత పేషీలో ఓఎస్డీగా చేరిన వైనం

జగన్ భక్తుడిగా ఉద్యోగ సంఘం నడిపిన వెంకట్రామిరెడ్డి

ఆయన అనుచరుల్లో కొందరికి చాన్స్ ఇచ్చిన మంత్రులు

అదే బాటలో గొట్టిపాటి రవి, నిమ్మల రామానాయుడు

ఉలిక్కిపడ్డ సర్కారు.. వారందరిపైనా ఇంటెలిజెన్స్ నివేదికకు ఆదేశం

అయితే, ఆ నివేదికనూ ప్రభావితం చేస్తున్న కొందరు ఘనులు

భూతానికి భయపడి ఎవరూ రావడంలేదనీ, భయం వద్దు.. దాన్ని భూస్థాపితం చేస్తానని తాను చెబుతున్నానని చంద్రబాబు పదేపదే పేర్కొంటున్నారు. కానీ, ఆ భూతం ఏకంగా పేషీల్లోకి చొరబడి, కీలక ఫైళ్లు తిరగేసే పరిస్థితి వస్తే..!?

ఇంతకీ వాళ్లంతా ఎలా వస్తున్నారు?

లోపం ఎక్కడుంది?

ఇదంతా వ్యవస్థల విధ్వంస ఫలితమేనా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'గత జగన్ ప్రభుత్వంలో మంత్రుల వద్ద పనిచేసినవారిని 'పేషీల్లోకి తీసుకోవద్దు' అని కొత్త మంత్రులతో జరిగిన తొలి భేటీలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా స్పష్టంగా చెప్పారు. 'గత ప్రభుత్వంలో ఎన్ని కేసులు ఉంటే అంత ప్రయారిటీ' ఇస్తామని ఎన్నికల సందర్భంలో అప్పటి విపక్ష నేత లోకేశ్ వ్యాఖ్యానించారు. కానీ, వారి మాటలకు భిన్నంగా కొందరు కొత్త మంత్రుల పేషీల్లోకి వైసీపీ పీఎస్‌లు, ఓఎస్డీలు వాలిపోతున్నారు. గత ఐదేళ్లూ వైసీపీ హయాంలో జరిగిన అన్ని అరాచకాలూ, అక్రమాలూ, దౌర్జన్యాల్లో భాగస్వామ్యం ఉన్న అధికారులే ఇప్పుడు కొత్త ప్రభుత్వంలోనూ మంత్రుల వద్ద పాగా వేస్తున్న తీరు ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అందులోనూ.. అత్యంత వివాదాస్పద అధికారిగా వైసీపీ హయాంలో పనిచేసిన రిటైర్డు ఐఏఎస్ రాజాబాబు ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి

మిగతా 12వ పేజీలో...



2

యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు

అరెస్ట్

బెంగళూరులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం పోలీసుల గాలింపు



12

1000 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్

ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైన భారీ ఫైల్

సైబర్ దాడులు జరిగే ప్రమాదం

సైబర్‌న్యూస్ నివేదిక హెచ్చరిక

అతిపెద్ద లీక్ అంటున్న నిపుణులు

ఇప్పుడూ అన్యాయమేనా?

ఇంజనీరింగ్ కాలేజీల ఆవేదన

వైసీపీ హయాంలో కమిషన్ ఇచ్చిన సిఫారసులకే బాబు మొగ్గు

కనిష్ఠ ఫీజు 40 వేలకే సిఫారసు

కొన్ని కాలేజీలకే రూ.లక్షలు పైగా

గతంలోనే తప్పుబట్టిన కళాశాలలు

హైకోర్టుకూ వెళ్లిన యాజమాన్యాలు

జగన్ అనుకూల కాలేజీలకు ఎక్కువ ఫీజులు సిఫారసు చేశారని ఆరోపణ

దీనిని బాబు కూడా సరిదిద్దలేదని

ఇలా అయితే.. ఇబ్బందులేనని వెల్లడి

విచారణ కోరుతూ నారా లోకేశ్‌కు లేఖ



అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వంలో అన్యాయం జరిగింది. కూటమి ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశించాం. కానీ, ఇప్పుడు కూడా అన్యాయానికే గురవుతున్నాం. గత ప్రభుత్వంలో ఎవరికైతే అయాచిత లబ్ధి చేకూరిందో ఇప్పుడు కూడా వారికే మేలు కొనసాగుతోంది" అంటూ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఖరారు చేసిన ఫీజులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా కొన్ని యాజమాన్యాలు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాశాయి. గత ప్రభుత్వంలో ప్రమాణాలకు మించి ఫీజులు ఖరారు చేసిన పది కాలేజీల వివరాలను ఆ లేఖలో పేర్కొన్నాయి. ఆయా కాలేజీల్లో ప్రమాణాలు ఎలా ఉన్నాయనే విషయంపై విచారణ చేయిస్తే అసలు విషయం

మిగతా 12వ పేజీలో...

డిగ్రీ అస్తవ్యస్తం



ఇంజనీరింగ్‌తో సమాంతరంగా కౌన్సెలింగ్

గత ప్రభుత్వ నిర్ణయం అమలుతో చిక్కులు

50 వేలకుపైగా తగ్గిపోయిన దరఖాస్తులు

బీసీఏ, బీబీఏ కోర్సులకు విడిగా అడ్మిషన్లు

ప్రత్యేకంగా ఇవ్వాలని ప్రభుత్వం యోచన

కాలేజీలకు 30 ఏళ్ల లీజుకు నిర్ణయం

12



విశాంత్‌రెడ్డి

బాధితుడికే బెదిరింపులు

తిరుపతి ఆర్డీఓ నిర్వాకం

2

ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి.. బాధితుడి ఇంటికి తహసీల్దార్

గతంలో వెనకేసుకొచ్చిన జేసీ.. ఆర్డీఓపై అవినీతి ఆరోపణలు

సర్కారు చర్యలు తీసుకోకపోవడంతో రెచ్చిపోతున్న అధికారి

3


కాఫర్ డ్యాంల వద్ద.. ఎక్కువ బోర్‌వెల్స్ తవ్వొద్దు

ఎగువ డ్యాం వద్ద 3-4 మాత్రమే వేయాలి.. ఎక్కువ ఫిజియోమీటర్లను పెట్టండి

సీపేజీ జలాలు గ్రావిటీ ద్వారా తరలించండి.. పంపులు అధికంగా వినియోగించండి

అంతర్జాతీయ నిపుణుల సూచనలు.. పీపీఏ ద్వారా కేంద్ర జలసంఘానికి!

పాటించాలని జలవనరుల శాఖకు సలహా.. 16వ తేదీన ప్రాథమిక నివేదిక వచ్చే చాన్స్



లక్ష్మీపార్వతికి ఏయూలో ప్రొఫెసర్‌షిప్

తెలుగు పరిశోధకులకు గైడ్‌గా నియామకం

మూడేళ్లనాడే ఉత్తర్వులు.. ఆలస్యంగా వెలుగులోకి

ఆమె అమరావతిలో.. విద్యార్థులు విశాఖలో

ఇదీ మాజీ వీసీ ప్రసాదరెడ్డి బాగోతం

టీడీఆర్ హబ్ కేంద్రంగా అడ్డగోలు వ్యవహారాలు

12

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి..

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు సజ్జల, ఆళ్ల

12

కేటీఆర్ X సత్యకుమార్

కేటీఆర్, వైసీపీ ఓటమిపై కేటీఆర్ ఆశ్చర్యం

మీరు ధరణిలో.. కేటీఆర్ గుడ్‌మార్నింగ్‌లో దోచుకున్నారు: మంత్రి సత్య కౌంటర్

11

అనుసూయ.. ఇక అనుకతిర్ సూర్య

» తన పేరును, లింగాన్ని పురుషుడిగా మార్చుకున్న ఐఆర్ఎస్ ఆఫీసర్

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): దేశ సివిల్ సర్వీసెస్ చరిత్రలో తొలిసారిగా.. ఓ ఐఆర్ఎస్ ఆఫీసర్ ప్రభుత్వ రికార్డుల్లో తన పేరును, లింగాన్ని మార్పించుకున్నారు. తమిళనాడులోని చెన్నైకి చెందిన 2013 బ్యాచ్ ఐఆర్ఎస్ ఆఫీసర్ ఎం.అనుసూయ.. కొంతకాలంగా హైదరాబాద్‌లోని 'కస్టమ్స్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ (సీఈఎస్‌టీఏటీ)' చీఫ్ కమిషనర్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఇకపై తనను పురుషుడిగా గుర్తించాలని.. ఎం.అనసూయకు బదులుగా తన పేరును ఎం.అనుకతిర్ సూర్యగా మార్చుకోవడానికి, రికార్డుల్లో తన లింగాన్ని మార్చుకోవడానికి అనుమతించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖలోని రెవెన్యూ విభాగానికి చెందిన 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్'ను అభ్యర్థించారు. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ అనుమతించింది. ఈ మేరకు ఆ శాఖ అండర్ సెక్రటరీ శిరీష్ కుమార్ గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. చెన్నైలోని మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పట్టా పొందిన అనుకతిర్ సూర్య.. 2013 డిసెంబరులో చెన్నైలో అసిస్టెంట్ కమిషనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. 2018లో డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొంది.. గత సంవత్సరమే బదిలీపై హైదరాబాద్‌కు వచ్చి జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు అరెస్ట్

హైదరాబాద్, జూలై 10(ఆంధ్రజ్యోతి): తండ్రీకూతుళ్ల బంధంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హన్మంతు అరెస్ట్ అయ్యాడు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు ప్రణీత్‌ను బెంగళూరులో బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అక్కడి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్ తరలించారు. ప్రణీత్ హన్మంతుపై ఐటీ యాక్ట్, బీఎస్ఎస్‌లోని వివిధ సెక్షన్లతోపాటు పోక్సో యాక్ట్ ప్రకారం కేసులు నమోదయ్యాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న మిగిలిన నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలిస్తున్నామని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయెల్ తెలిపారు. కాగా, ప్రణీత్ హన్మంతు మరొకొందరితో కలిసి తండ్రీకూతుళ్ల బంధంపై సోషల్ మీడియాలో చేసిన తప్పుడు వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. సినీనటులు సాయిధరమ్ తేజ్, మంచు మనోజ్ స్పందించి ప్రణీత్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పోలీసులను కోరారు. దీనిపై స్పందించిన టి-సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, పోలీసు ఉన్నతాధికారులు నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీంతో సోషల్ మీడియా వేదికగా క్షమాపణ చెప్పిన ప్రణీత్ హన్మంతు అజ్ఞాతంలోకి వెళ్లాడు. కానీ, దర్యాప్తు చేపట్టిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు అతన్ని పట్టుకుని కటకటాల్లోకి నెట్టారు.

గంజాయి జోలికి పోవద్దు

» దండంపెట్టి వేడుకుంటున్నా: మంత్రి సంధ్యారాణి


గంజాయి జోలికి వెళ్లవద్దని దండం పెడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

పాడేరు (అల్లూరి సీతారామ రాజు), జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'దండం పెట్టి మరీ వేడుకుంటున్నాను. గంజాయి జోలికి పోవద్దు, మన పిల్లల్ని ఆ ఉచ్చులో దించొద్దు. మరీ ముఖ్యంగా గంజాయి సాగు వద్దే వద్దు' అని మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రజలను కోరారు. మన్యంలో గంజాయి నిర్మూలనపై బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఏ అరాచకం జరిగినా గంజాయి ప్రభావమే కారణంగా, దానికి మన జిల్లాయే మూలమనే ప్రచారం జరగడం ఆవేదన కలిగిస్తోందన్నారు. యువత డబ్బు కోసం గంజాయి ఉచ్చులో చిక్కుకోవద్దని, మరీ ముఖ్యంగా గిరిజనులు అసలు గంజాయి సాగు జోలికి వెళ్లొద్దని అభ్యర్థించారు. ఎవరైనా డబ్బు ఆశచూపి గంజాయి సాగు చేయాలని గిరిజనులను ప్రోత్సహిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అందులో భాగంగా వంద రోజుల్లో గంజాయిని నిర్మూలించాలనే ఆలోచనతో సీఎం చంద్రబాబు ఉన్నారని, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందిస్తున్నారని తెలిపారు.

ముస్లిం మహిళలూ భరణానికి అర్హులే




(మొదటి పేజీ తరువాయి)

మాత్రం రూ.10 వేలకు తగ్గించింది. పిటిషన్ వేసినప్పటి నాటి నుంచీ భరణం చెల్లించాలని ఆదేశించింది. దీనిని సమద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది వసీం ఖాద్రి వాదనలు వినిపించారు. విడాకులు తీసుకున్న ముస్లిం మహిళలకు 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986' వర్తిస్తుందిగానీ, సీఆర్‌పీసీ సెక్షన్ 125 వర్తించదని.. కాబట్టి, భరణం చెల్లించాల్సిన అవసరం లేదని వాదించారు. ముస్లిం మహిళలకు సీఆర్‌పీసీ సెక్షన్ 125 కన్నా, 1986 నాటి చట్టమే అధిక ప్రయోజనం కలిగిస్తుందన్నారు. కాగా, ఈ కేసులో గౌరవ్ అగర్వాల్ అనే న్యాయవాదిని అమికస్ క్యూరీగా (కోర్టు సహాయకుడిగా) న్యాయస్థానం నియమించింది. వాదనలు విన్న సుప్రీంకోర్టు తీర్పును ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన రిజర్వు చేసింది. తాజాగా బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించింది. 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986', సీఆర్‌పీసీ 125 సెక్షన్.. ఈ రెండింటిలో 125 సెక్షనే ఈ కేసులో వర్తిస్తుందని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. దేశంలోని వివాహిత మహిళందరికీ మతాలతో సంబంధం లేకుండా ఈ సెక్షన్ వర్తిస్తుందని పేర్కొంది. భరణం అనేది భర్త భార్యకు దయతో ఇచ్చేది కాదని, అది వివాహిత మహిళలందరికీ ఉన్న ప్రాథమిక హక్కు అని తెలిపింది. 'మతాల సరిహద్దులకు అతీతంగా వివాహిత మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే, లింగ సమానత్వాన్ని బలోపేతం చేసే హక్కు ఇది' అని స్పష్టం చేసింది. మరోవైపు, ముస్లిం మహిళలు 'ముస్లిం మహిళల విడాకుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986', సీఆర్‌పీసీ 125 సెక్షన్.. రెండింటినీ ఉపయోగించుకోవచ్చని, ఇవి పరస్పర ఆధారితాలేగానీ పోటీ కావని తెలిపింది. ఈ మేరకు హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సమద్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. న్యాయమూర్తులిద్దరూ వేర్వేరుగా తీర్పులు వెలువరించినప్పటికీ ఒకే విధమైన తీర్పు ఇచ్చారు.

కుటుంబం కోసం భార్యల త్యాగం

జస్టిస్ బీవీ నాగరత్న తన తీర్పులో.. భార్య ఆర్థికంగా ఎవరి మీదా ఆధారపడకుండా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత భర్తదేనని హితవు పలికారు. 'సొంతంగా ఆదాయం అంటూ లేని భార్యకు భర్త తన ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచాలి. కుటుంబ అవసరాలతోపాటు ఆమె వ్యక్తిగత అవసరాలు తీరేలా చర్యలు తీసుకోవాలి. ఈ చైతన్యాన్ని భర్త కలిగి ఉండాలి. ఈ విధంగా ఆర్థికంగా సమృద్ధిపరిచినప్పుడే కుటుంబంలో భార్య స్థానం ఎవరి మీదా ఆధారపడే పరిస్థితి లేకుండా సుస్థిరంగా ఉంటుంది. ఈ విధమైన చైతన్యాన్ని కలిగి ఉండి తన ఏటీఎం కార్డును ఇవ్వటం ద్వారా, బ్యాంకులో ఖాతాను ఇద్దరి పేరు మీద తీసుకోవటం ద్వారా భార్యను ఆర్థికంగా ఆత్మవిశ్వాసంతో ఉంచేలా వ్యవహరిస్తున్న భర్తలను అభినందించాలి' అని పేర్కొన్నారు. మన దేశంలో వివాహం తర్వాత మహిళలు.. ఇల్లు, పిల్లలు, పెద్దవాళ్లను చూసుకోవటానికి తమ ఉద్యోగావకాశాలను వదులుకోవటం సాధారణమైన విషయమని గుర్తు చేశారు. ఆర్థికంగా భర్త మీదే ఆధారపడే భార్యకు ఆర్థికపరమైన ఒత్తిడి లేకుండా చూడటానికే భరణం అని స్పష్టం చేశారు. విడాకులు తీసుకున్న వారేగాక వివాహిత మహిళలందరికీ ఈ అవకాశం రాజ్యాంగం కల్పించిందన్నారు.

లోకం తీరు



30 వేల కోట్లు ఇవ్వండి

» కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన బిహార్ సీఎం నీతీశ్ కుమార్

న్యూఢిల్లీ, జూలై 10: బిహార్‌కు ప్రత్యేక హోదాతో పాటు కేంద్ర బడ్జెట్‌లో రూ.30వేల కోట్ల నిధులను కేటాయించాలని ఆ రాష్ట్ర సీఎం, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ కోరారు. అలాగే రాష్ట్ర రుణపరిమితిని కూడా పెంచాలన్నారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో భాగస్వామి అయిన జేడీయూ అధినేత తమ కోరికల జాబితాను గత నెలలో జరిగిన 'బడ్జెట్ ముందు సమావేశం'లోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు అందించినట్లు సమాచారం. బిహార్‌లో 9 విమానాశ్రయాలు నిర్మించాలని, 4 కొత్త మెట్రో లైన్లు నిర్మించాలని జాబితాలో పేర్కొన్నారు. 7 వైద్య కళాశాలలు మంజూరు చేయాలన్నారు. భారీ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు నిధులు సమకూర్చాలని కోరారు.

నీతీశ్ రాజకీయ వారసుడు మనీశ్!



పట్నా, జూలై 10: నీతీశ్ కుమార్ రాజకీయ వారసుడు ఎవరంటూ జరుగుతున్న చర్చకు దాదాపుగా తెర పడినట్టే! ఆయన సలహాదారు, మాజీ ఐఏఎస్ మనీశ్ వర్మ అధికారికంగా జేడీయూలో చేరారు. మనీశ్ చేరికతో నీతీశ్ వారసుడి విషయంలో స్పష్టత వచ్చేసినట్టేనని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఆయనను త్వరలోనే పార్టీ జాతీయ ప్రధాని కార్యదర్శిగా నీతీశ్‌కుమార్ నియమిస్తారని ఈ వర్గాలు చెబుతున్నాయి. మనీశ్ 2000 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐఏఎస్ అధికారి. 2018లో నీతీశ్ సూచనతో స్వచ్ఛంద పదవీవిరమణ పొందారు. అప్పటినుంచి నీతీశ్‌కు బాగా సన్నిహితంగా ఉంటున్నారు. జేడీయూ సామాజిక పునాది వర్గం అయిన కుర్మీలకు చెందిన వ్యక్తి కావడం మనీశ్ వర్మకు కలిసివచ్చిందని విశ్లేషకులు అంటున్నారు.

'సీబీఐ దుర్వినియోగం' పిటిషన్ విచారణార్హమే

» బెంగాల్ సర్కారుకు సుప్రీంలో ఊరట

» ఆగస్టు 13వ తేదీకి విచారణ వాయిదా



న్యూఢిల్లీ, జూలై 10: పశ్చిమ బెంగాల్ సర్కారుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. సీబీఐని దుర్వినియోగం చేస్తున్నారని కేంద్రానికి వ్యతిరేకంగా బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హమైందేనని బుధవారం కోర్టు స్పష్టం చేసింది. బెంగాల్‌లో సీబీఐ చేపట్టిన కేసుల దర్యాప్తును సవాల్ చేసే అధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొంది. బెంగాల్ సర్కారు వ్యతిరేకిస్తున్నప్పటికీ సందేశ్‌ఖాలీ లైంగిక వేధింపులు, భూకబ్జాలు తదితర కేసులపై సీబీఐ విచారణకు అనుమతినిస్తూ కోల్‌కత్తా హైకోర్టు ఇటీవలే తీర్పునిచ్చిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు దాన్ని వ్యతిరేకించింది. 2018లోనే రాష్ట్రంలో సీబీఐకి సమ్మతిని ఉపసంహరించుకున్నప్పటికీ కేసులు నమోదు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్ సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. మే 8వ తేదీన తీర్పు రిజర్వు చేసింది. 'బెంగాల్ పిటిషన్‌ను కొనసాగించడం సరికాదు. సీబీఐ నియంత్రణ మా పరిధిలో లేదు' అంటూ కేంద్రం చేసిన వాదనలను జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసు సమాఖ్య భావనపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. 'ఢిల్లీ ప్రత్యేక పోలీసు చట్టం (డీఎస్‌పీఈ) నిబంధనల మేరకు సీబీఐ తమ అధికార పరిధిలో దర్యాప్తు నిర్వహించడానికి సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి. మా దృష్టిలో డీఎస్‌పీఈ చట్టం మేరకు కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన సంస్థే సీబీఐ.. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి లేకుండా డీసీపీఈ చట్టం కింద సీబీఐ కేసు నమోదు చేయొచ్చా లేదా అనే చట్టపరమైన సమస్య ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించాం' అని వ్యాఖ్యానించింది. విచారణను ఆగస్టు 13వ తేదీకి వాయిదా వేసింది.

ఆగస్టు 30లోగా అన్ని జిల్లాల్లో

ప్రత్యేక దత్తత ఏజెన్సీలు

» ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, యూటీలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 30వ తేదీలోగా అన్ని జిల్లాల్లో ప్రత్యేక దత్తత ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశంలో ప్రత్యేక దత్తత ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని కోరుతూ 'ది టెంపుల్ ఆఫ్ హీలింగ్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టింది. దేశంలోని 760 జిల్లాలకు గాను 390 జిల్లాల్లోనే ప్రత్యేక దత్తత ఏజెన్సీలు ఉన్నాయంటూ కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ అందించిన వివరాలపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. మిగిలిన రాష్ట్రాలు ఈ విషయంలో జాప్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆగస్టు 30వ తేదీలోపు అన్ని జిల్లాల్లో ప్రత్యేక దత్తత ఏజెన్సీలను ఏర్పాటు చేయాలని ఆయా రాష్ట్రాలను ఆదేశించింది.





స్లీపర్ బస్సు పాల ట్యాంకర్ ఢీ.. 18 మంది మృతి

ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా- లఖ్‌నవూ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు- పాలట్యాంకర్ ఢీకొన్నాయి. ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు సహా 18 మంది దుర్మరణం పాలవ్వగా, మరో 19 మంది గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు బస్సు ఇలా నుజ్జునుజ్జు అయ్యింది.

ఐ అండ్ పీఆర్ కమిషనర్ విజయకుమార్‌రెడ్డిపై విచారణ!

(మొదటి పేజీ తరువాయి)

నియమించుకున్నారు. బడ్జెట్‌కు మించి ఖర్చుచేశారని.. నిధులు దారి మళ్లించారని.. జగన్ రోతపత్రిక ఉద్యోగులను ప్రభుత్వంలోకి తీసుకుని భారీగా జీతాలు దోచిపెట్టారని జర్నలిస్టు సంఘాలు ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. వైసీపీ సోషల్ మీడియా వర్కర్లను డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులుగా చూపిస్తూ రూ.వేల కోట్లు జీతాల కింద సమర్పించారని కూడా ఆరోపించాయి. వీటిని పరిశీలించిన ప్రభుత్వం వాస్తవాలు ఉన్నాయని భావించింది. ఒకట్రెండు రోజుల్లో విజిలెన్స్ విచారణకు ఆదేశించనున్నట్లు సమాచారం. వాస్తవానికి మళ్లీ జగనే అధికారంలోకి వస్తారని జగన్ కంటే విజయ్‌కుమార్‌రెడ్డే ఎక్కువగా నమ్మారు. అందుకే తన డిప్యుటేషన్ పొడిగించాలని ఎన్నికల ఫలితాలకు ముందు కేంద్రానికి లేఖ రాశారు. అయితే వైసీపీ ఘోరంగా ఓడిపోవడం.. ఇదే సమయంలో ఆయన డిప్యుటేషన్ జూన్ 9వ తేదీతో ముగిసిపోవడంతో తిరిగి మాతృశాఖకు వెళ్లిపోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అక్రమాలు తేలేవరకు ఆయన్ను ఇక్కడే ఉంచాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది.

ఏ సమస్యకైనా చర్చలే పరిష్కారం

యుద్ధాలకు ఇది సమయం కాదు.. శాంతిస్థాపనకు మేం సహకరిస్తాం

» ఆస్ట్రియా చాన్స్‌లర్ నెహామర్‌తో కలిసి ప్రధాని మోదీ ప్రకటన


ప్రధాని మోదీతో కర్ల్ నెహామర్ సెల్ఫీ

వియన్నా, జూలై 10: ఆస్ట్రియా చాన్స్‌లర్ కర్ల్ నెహామర్‌తో ఫలప్రదమైన చర్చలు జరిగాయని ప్రధాని మోదీ బుధవారం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు సహా ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న వివాదాలపై తాము విస్తృతంగా చర్చలు జరిపినట్లు తెలిపారు. "ఇది యుద్ధానికి సమయం కాదు" అని మోదీ పునరుద్ఘాటించారు. ఏ సమస్యలనైనా చర్చలతోనే పరిష్కరించుకోవాలని, యుద్ధాలతో కాదని స్పష్టం చేశారు. రష్యాలో రెండు రోజుల పర్యటన ముగించుకున్న మోదీ.. మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్నారు. ఒక భారత ప్రధాని ఆస్ట్రియాకు వెళ్లడం 41 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1983లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ అక్కడ పర్యటించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు మోదీ వెళ్లారు. ఆస్ట్రియా విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ స్కాలెన్‌బర్గ్ ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. తర్వాత చాన్స్‌లర్ నెహామర్ మోదీకి విందు ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన చర్చల్లో భారత్-ఆస్ట్రియా దేశాల మధ్య ద్వైపాక్షిక బంధాలను మరింత బలోపేతం చేయడానికి సంబంధించిన ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. "చాన్స్‌లర్ నెహామర్, నేను ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణం, ఇతర సమస్యలపై చర్చించాం. ఇది యుద్ధానికి సమయం కాదని నేను ఇప్పటికే చెప్పాను. యుద్ధం ద్వారా సమస్యలను పరిష్కరించుకోలేం. ఎక్కడైనా సరే అమాయకులు ప్రాణాలు కోల్పోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు" అని నెహామర్‌తో కలిసి సంయుక్త మీడియా ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. శాంతిస్థాపనకు చర్చలు, దౌత్యపరమైన మార్గాలే శరణ్యమని ఇరువురు నేతలు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి సహకారం అందించేందుకైనా తాము సిద్ధమని ప్రకటించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి స్థాపన ప్రక్రియలో భారత్‌ది కీలక పాత్ర అని నెహామర్ చెప్పారు. తటస్థ దేశంగా ఉన్న ఆస్ట్రియా శాంతి చర్చలకు సరైన ప్రాంతమని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నవకల్పనలు, పునరుత్పాదక ఇంధనం, హైడ్రోజన్, నీరు, వ్యర్థాల నిర్వహణ, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ రంగాల్లో ఇరుదేశాలు కలిసి పనిచేసి, ఆయా రంగాల్లో బలోపేతం కావాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. ఇరుదేశాల మధ్య యువత ఆలోచనలను పంచుకునేందుకు స్టార్టప్ వ్యవస్థ వారధిగా నిలుస్తుందన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఆస్ట్రియా కంపెనీలను మోదీ ఆహ్వానించారు. మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల్లో అవకాశాలున్నాయని తెలిపారు. కాగా, మంగళవారం రాత్రి వియన్నా చేరుకున్న మోదీకి 'వందేమాతరం' ఆలపిస్తూ స్వాగతం పలికారు.

భారత్ మాకు వ్యూహాత్మక భాగస్వామే!

» రష్యాతో బంధం ఆందోళనకరం

» అమెరికా అధ్యక్ష భవనం

వాషింగ్టన్, జూలై 10: భారత్-రష్యా భాగస్వామ్య ఒప్పందాలు, ఇరు దేశాల మధ్య స్నేహం వంటి కీలక విషయాలపై అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. రష్యాతో భారత్ బంధంపై తాము ఆందోళన చెందుతున్నామని చెబుతూనే.. భారత్‌ను తాము వ్యూహాత్మక భాగస్వామ్య దేశంగానే పరిగణిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు అమెరికా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నారు. ద్వైపాక్షిక అంశాలపైనా సమగ్రంగా చర్చించారు. ఇదే సమయంలో ఉక్రెయిన్-రష్యా యుద్ధంపైనా మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి, మీడియా కార్యదర్శి మేజర్ జనరల్ పాట్ రైడెర్ మాట్లాడుతూ..రష్యాతో భారత్ సంబంధాలు కొనసాగించినా.. భారత్ విషయంలో తమ వైఖరి మారబోదన్నారు. అయితే, మోదీతో భేటీని పుతిన్ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉందన్నారు.

పీసీబీలో పోలీసుల విచారణ ముమ్మరం

» ఫైళ్ల దహనంపై వివరాలు ఆరా.. నగరం దాటిన ఓఎస్డీ రామారావు

అమరావతి, విజయవాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో ఈనెల రెండో తేదీన పీసీబీ ఫైళ్లను అవనిగడ్డ కరకట్టపై దహనం చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై చంద్రబాబు ప్రభుత్వం సీరియస్ అవడంతో ఈ కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. నాడు ఘటనా స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న కాగితాలను, సగం కాలిపోయి ఉన్న ఫైళ్లను తీసుకుని పెనమలూరు పోలీసులు ఏపీఐఐసీ కాలనీలో ఉన్న కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయానికి వెళ్లారు. 'మీ కార్యాలయంలో రికార్డులకు కస్టోడియన్ ఎవరు? ఆఫీసు నుంచి ఏదైనా ఫైలు బయటికి తీసుకెళ్లాలంటే ఎలాంటి రికార్డులు నిర్వహిస్తారు? ఎవరి ఆదేశాలతో ఫైళ్లను ఒక చోట నుంచి మరో చోటకు పంపుతారు?' అంటూ సుదీర్ఘంగా వివరాలు కూపీ లాగారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు కొంతమంది అధికారులు తెల్లముఖాలు వేసినట్లు తెలిసింది. అనంతరం ఎల్‌బీసీ కాలనీలోని ఓఎస్డీ రామారావు ఇంటికి వెళ్లారు. ఆయన ఇంట్లో లేరని కుటుంబీకులు తెలిపారు. పోలీసులు ఆయనకు ఫోన్ చేయగా అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ఉన్నానని చెప్పారు. ఆసుపత్రి నుంచి రాగానే విచారణకు వస్తానని చెప్పినట్లు తెలిసింది. రామారావు ఉన్నానని చెబుతున్న ఆసుపత్రి వివరాలను పోలీసులు సేకరించారని సమాచారం.

బాధితుడికే బెదిరింపులు

» తిరుపతి ఆర్డీఓ నిర్వాకం

» ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి

» బాధితుడి ఇంటికి తహసీల్దార్

» ఆర్డీఓపై అవినీతి ఆరోపణల ఎఫెక్ట్

» సర్కారు చర్యలు తీసుకోకపోవడంతో రెచ్చిపోతున్న అధికారి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేయాల్సిన ఓ ఆర్డీఓ తీవ్ర అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయారు. తనపై ప్రభుత్వ పెద్దలకు ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని బాధితుడినే బెదిరిస్తున్నారు. జగన్ ప్రభుత్వంలో ఆయన చెలరేగిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఏ మార్పులేదు. ఆయనే తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి. తన కింద పనిచేసే తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులను బాధితుడి నివాసానికి పంపించి ఫిర్యాదుపై వెనక్కి తగ్గాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఆర్డీఓ అవినీతి వ్యవహారంపై గతంలో విచారణ చేసిన తిరుపతి జేసీ ఆయన్ను కాపాడారు. ఆ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో మరోసారి విచారణకు సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్ ఆదేశించారు.

ఎన్ఓసీకి లంచం డిమాండ్

ఓ ప్రభుత్వ సాంకేతిక నిపుణుడి అల్లుడికి ఉమ్మడి చిత్తూరు జిల్లా పుత్తూరు సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంక్ మంజూరైంది. బంక్ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల అనుమతులు లభించాయి. చివరకు ఫైలు తిరుపతి కలెక్టరేట్‌కు వచ్చింది. రెవెన్యూ శాఖ ఆ భూమిని తనిఖీ చేసి నిరభ్యంతర పత్రం ఇవ్వాలి. ఎన్ఓసీ జారీకి తిరుపతి కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయంలోని ఇద్దరు అధికారులు భారీగా సొమ్ము డిమాండ్ చేశారు. నేరుగా ఆర్డీఓ తరఫున ఓ జూనియర్ అధికారి మంత్రాంగం నడిపి డబ్బు డిమాండ్ చేశారు. ముడుపులు ఇచ్చిన వెంటనే ఎన్ఓసీకి అవసరమైన పత్రాలపై ఆర్డీఓ సంతకాలు చేశారు. ఆ తర్వాత మరి కొంత డిమాండ్ చేసి కొన్ని కొర్రీలు వేశారు. దీంతో బాధితుడు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికలకు ముందు అప్పటి సీఎస్ జవహర్‌రెడ్డి, సీసీఎల్ఏ సాయిప్రసాద్‌లకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో తిరుపతి జేసీగా ఉన్న శుభం బన్సల్‌తో విచారణ చేయించారు. లంచం తీసుకోవడమే కాదు ఇవ్వడం కూడా నేరమేనని, అందుకు మీపై కూడా కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, అందుకు సిద్ధమేనా అని బాధితుడిని బెదరగొట్టారు. దీంతో ఆయన స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు వెనక్కి తగ్గారు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' ఏప్రిల్ 12, 13 తేదీల్లో ఆర్డీఓ కోసం దారితప్పిన విచారణ అంటూ వార్తను ప్రచురించింది. ఈ వార్తపై సీసీఎల్ఏ సాయిప్రసాద్ స్పందిస్తూ ఆర్డీఓ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విచారణ చేయాల్సిందిగా జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు.

బాధితుడి ఇంటికెళ్లి...

ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చింది. తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డిపై విచారణ మొదలైంది. దీంతో ఆయనలో కలవరం మొదలైంది. తనపై ఫిర్యాదు చేసిన బాధితుడిని ఒప్పించి దాన్ని వెనక్కి తీసుకునే ప్రయత్నాలు చేశారు. అది వర్కవుట్ కాకపోవడంతో ఓ తహసిల్దార్, మరో ఇద్దరు రెవెన్యూ అధికారులను బాధితుడి ఇంటికి పంపించారు. రోజంతా అక్కడే మకాం వేసి.. ఆర్డీఓ పంపిస్తేనే తాము వచ్చామని, కేసు వెనక్కి తీసుకోవాలంటూ వారు పట్టుబట్టినట్లు తెలిసింది. ఈ పరిణామంపై బాధితుడు మరోసారి సీసీఎల్ఏ సాయిప్రసాద్‌కు లిఖితపూర్వకంగా తెలియజేశారు. తొలుత విచారణను దారి తప్పించినప్పుడు అప్పటి జేసీ, ఆర్డీఓపై చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని అధికార వర్గాలు చెబుతున్నాయి. జేసీ అడ్డగోలు విచారణ చేసి ఆర్డీఓను కాపాడటం వల్లే ఇప్పటికీ ఆయన ఆ పోస్టులో కొనసాగుతున్నారని చెబుతున్నాయి.

ఎన్నికల సమయంలోనూ...

పోలింగ్ అనంతరం తిరుపతిలో జరిగిన గొడవలపై ఆర్డీఓగా నిశాంత్‌రెడ్డి ఇచ్చిన నివేదికనే నాటి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిగణనలోకి తీసుకున్నారు. ఆ నివేదికనే ఈసీకి నివేదించారు. గొడవల్లో వైసీపీది ఏం తప్పు లేనట్లుగా ఆ నివేదికలో ఉంది. ఆ సమయంలో కూడా ఆర్డీఓ చర్య తీవ్ర చర్చనీయాంశమైంది. ఇప్పుడు మరోసారి ఆయన వ్యవహారం రచ్చకెక్కింది.



తల్లికి వందనం పథకానికి

ఆధార్ తప్పనిసరి

» పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం, స్టూడెంట్ కిట్ పథకాలకు ఆధార్ తప్పనిసరి అని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. కొత్త ప్రభుత్వంలో పథకాల పేర్లు మారిన నేపథ్యంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. ఆధార్ తప్పనిసరిగా ఉండాలని లేనిపక్షంలో ఆధార్ కార్డు కోసం నమోదు చేసుకుని ఉండాలని వివరించింది. ఆధార్ నంబరుతో పాటు పాన్, పాస్‌పోర్ట్, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ కార్డు లాంటి మొత్తం పది గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి ఉండాలని పేర్కొంది. తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు, స్టూడెంట్ కిట్ పథకంలో విద్యార్థులకు బ్యాగు, బెల్టు, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం ఇస్తున్నట్లు తెలిపింది.

గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాలకు తక్షణమే 5 టీఎంసీల నీటిని నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి విడుదల చేయాలని జలవనరుల శాఖ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి కృష్ణా నదీయాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్‌కు లేఖ రాశారు. నాలుగు జిల్లాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని నివేదించారు.

కాఫర్ డ్యాంల వద్ద.. ఎక్కువ బోర్‌వెల్స్ తవ్వొద్దు!

- ఎగువ డ్యాం వద్ద 3-4 మాత్రమే వేయాలి
- ఎక్కువ ఫిజియో మీటర్లను పెట్టండి
- సీపేజీ జలాలు గ్రావిటీ ద్వారా తరలించాలి
- పంపులు అధికంగా వినియోగించండి
- అంతర్జాతీయ నిపుణుల సూచనలు
- పోలవరం ప్రాజెక్టు అథారిటీ ద్వారా కేంద్ర జలసంఘానికి!
- పాటించాలని జలవనరుల శాఖకు సలహా
- 16వ తేదీన ప్రాథమిక నివేదిక వచ్చే చాన్సు



అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కాఫర్ డ్యాంల పటిష్ఠత తెలుసుకోవడం కోసం వాటికి మూడు మీటర్ల దూరం వరకు భారీలోతులో బోర్‌వెల్స్‌ను వేయవద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి అంతర్జాతీయ నిపుణులు సూచించారు. ప్రాజెక్టు నిర్మాణాల సామర్థ్యం, డయాఫ్రం వాల్ మరమ్మతులు, కాఫర్ డ్యాంలలో సీపేజీ నివారణ మొదలైనవి పరిశీలించి తగు సూచనలు చేసేందుకు కేంద్ర జలశక్తి శాఖ అమెరికాకు చెందిన ప్రాజెక్టు నిర్మాణ నిపుణులు జియాన్ ఫ్రాంకో డి సిక్కో, డేవిడ్ బి పాల్.. కెనడా నిపుణులు సీన్ హించ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీని నియమించిన సంగతి తెలిసిందే. గత నెల 30వ తేదీన పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి వచ్చిన వీరు.. దెబ్బతిన్న కట్టడాలను ఈ నెల మూడో తేదీ దాకా క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర అధికారులతో సమీక్షించారు. ఈ నెల నాలుగో తేదీన తమ దేశాలకు వెళ్లారు. ఈ నెల 8వ తేదీన పీపీఏకి తమ ప్రాథమిక పరిశీలనలను పంపారు. ఆ అభిప్రాయాలను కేంద్ర జల సంఘానికి పీపీఏ పంపింది. వాటిని పరిశీలించిన జలసంఘం.. ఈ సూచనలను పాటించాల్సిందిగా రాష్ట్ర జల వనరుల శాఖకు తెలియజేయాలని బుధవారం పీపీఏని ఆదేశించింది. నిపుణులు తమ ప్రాథమిక నివేదికను ఈ నెల 16వ తేదీన పంపే వీలుందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 16 తేదీ నాటికి మొదటి ప్రాథమిక నివేదికను పంపేలా ప్రయత్నిస్తామని నిపుణుల కమిటీ పేర్కొంది. ఈ సలహాలు ఆధారంగా కాఫర్ డ్యాం మరమ్మతు పనులకు, సీపేజీని తగ్గించేందుకు ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు సమాయత్తమవుతున్నారు.

నిపుణుల అభిప్రాయాలివీ..

- ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల భూమి పొరల్లో పటిష్ఠతను పరిశీలించేందుకు చానల్ 250 మీటర్లు, 290 మీటర్లు, 470 మీటర్లు, 550 మీటర్ల వద్ద నాలుగు బోర్‌వెల్స్ వేసినట్లుగా గుర్తించాం. ఇవిగాక.. చానల్ 870 మీటర్లు, 1000 మీటర్లు, 1100 మీటర్ల వద్ద కూడా లోతైన బోర్‌వెల్స్‌ను వేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గమనించాం. కాఫర్ డ్యాంలకు మూడు మీటర్ల సమీపం వరకు ఎలాంటి గుంతలు తవ్వొద్దు.
- కాఫర్ డ్యాం వద్ద 17 చొప్పున బోర్‌వెల్స్ వేయాలని అధికారులు భావిస్తున్నారు. అయితే పదేసి చొప్పున వేయడమే మేలు. ఈ బోర్‌వెల్స్ నుంచి సేకరించిన మట్టి నమూనాలతోనే పటిష్ఠతను తెలుసుకోవచ్చు. ఎగువ కాఫర్ డ్యాం వద్ద 3-4 బోర్‌వెల్స్‌కే పరిమితం కావాలి.
- ఫిజియో మీటర్లను వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేయాలి. వైబ్రో స్టోన్ కాలమ్స్ వద్ద వీటిని అమర్చాలి.
- కొత్తగా తవ్వాల్సిన పది బోర్‌వెల్స్‌పై ప్రత్యామ్నాయ ప్రణాళికలను జల వనరుల శాఖ అమలు చేయాలి.
- బోర్‌వెల్స్ తీసిన గోతులు ఎలా పూడ్చాలో మెథడాలజీని తెలియజేస్తాం.
- గ్యాప్-1 వద్ద వైబ్రో కంపాక్షన్‌ను మల్టీ చానల్ అనాలిసిస్ ఆఫ్ సర్ఫేస్ వేవ్స్ (ఎంఏఎస్‌డబ్ల్యూ) విధానంలో చేయాలి.
- జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్, జియోలాజికల్ పరీక్షలు పునఃసమీక్షించాలి.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల మధ్య నిలిచిపోయిన సీపేజీ జలాలను గ్రావిటీ ద్వారా నదిలోకి పంపేయాలి. ఇందుకోసం పంపులను అధికంగా వినియోగించాలి. కేంద్ర జల సంఘంతో సంప్రదింపులు జరుపుతూ.. పీపీఏ పర్యవేక్షణలో సీపేజీని తగ్గించే పనులు చేపట్టాలి.

పదోన్నతులపై ఏటూ తేలని నిర్ణయం

- విజయవాడలో జలవనరుల శాఖ ఇంజనీర్ల సమావేశం

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖలో 2018 నుంచి నిలిచిపోయిన ఇంజనీర్ల పదోన్నతుల వ్యవహారంపై ఇంజనీరింగ్ అధికారులు ఎటూ తేల్చుకోలేకపోయారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం దాకా ఆ శాఖలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నుంచి సూపరింటెండింగ్ ఇంజనీరు వరకు బుధవారం విజయవాడ జల వనరుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. సంఘం అధ్యక్షుడు తిరుమలరావు, జాయింట్ సెక్రటరీ రాజేశ్వరరావు తదితరుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో జల వనరుల శాఖలో పదవీ విరమణ చేసే ఉద్యోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుందన్న ఆందోళన వ్యక్తమైంది. ఖాళీలు పెరుగుతుంటే పూర్తి అదనపు బాధ్యతలతో పోస్టులను వెల్లదీయడం మినహా, పదోన్నతులు మాత్రం కల్పించకపోవడం ఏమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. 2018లో పదోన్నతులు ఇచ్చాక, తర్వాత న్యాయస్థానంలో కేసుల పేరిట ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం లేదన్న ఆగ్రహం వ్యక్తమైంది. ఈ అంశంపై న్యాయం కోరుతూ కోర్టులకు వెళదామని కొందరు ఇంజనీర్లు చేసిన ప్రతిపాదనకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన జోన్-1 ఇంజనీరింగ్ అధికారులు వ్యతిరేకించారు. దీంతో.. ఏ నిర్ణయం తేలకుండానే ఇంజనీర్ల సంఘం సమావేశం ముగిసింది. కాగా.. బుధవారం నాడు ఇన్‌చార్జి ఈఎన్‌సీ (పరిపాలన)గా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

ప్రత్యేకాధికారుల పదవీ కాలం పొడిగింపు

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 10 పట్టణ స్థానిక సంస్థల్లో ఉన్న ప్రత్యేకాధికారుల పదవీకాలాన్ని మరో ఆర్నెల్లు పొడిగిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కందుకూరు, అముదాలవలస, నరసారావుపేట, పొన్నూరు, కావలి, చింతలపూడి నగరపంచాయతీ, వైఎస్ఆర్ తాడిగడప, పొదిలి, అల్లూరు నగర పంచాయతీ, కొత్తకోటలో ప్రత్యేకాధికారుల పదవీ కాలం గడువు జూన్30-జూలై 11వ తేదీ మధ్య ముగియడంతో మరో ఆర్నెల్లు లేక మళ్లీ ఎన్నికల జరిగే వరకు పొడిగించారు. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేను సచ్ఛీలుడిని... నాపై కేసులే లేవు

నాకు నేరచరిత్ర లేదు... అనుచరులు కూడా లేరు

- పోలింగ్ తర్వాత రోజు ఇంటినుంచి బయటకు పోలేదు
- కారంపూడిలో హింసాత్మక ఘటనలతో సంబంధం లేదు
- మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సమాధానాలు... కంగుతిన్న పోలీసులు



ఆ రోజు పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లోకే వెళ్లలేదు

గుంటూరు, జూలై 10: తాను సచ్ఛీలుడిని, తనపై కేసులే లేవని మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనకు తాను సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. తనకు అనుచరులే లేరని, తనకు ఎటువంటి నేరచరిత్ర లేదని చెప్పుకొచ్చారు. తనపై ఒక తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసు మాత్రమే ఉందని, అంతకుమించి ఎటువంటి కేసులు లేవని చెప్పడంతో పోలీస్ అధికారులు విస్మయానికి గురయ్యారు. తాను చెప్పిందే వేదం... తాను రాసిందే శాసనం అన్నట్లుగా మాచర్ల నియోజకవర్గాన్ని తన గుప్పెట్లో పెట్టుకుని అరాచక పాలన సాగించిన పిన్నెల్లి ప్రస్తుతం ప్రజలను పిచ్చోళ్లను చేసినట్లు వ్యవహరిస్తుండటం సర్వత్రా విస్మయాన్ని కలిగిస్తోంది. ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తరువాత నియోజకవర్గంలో రామకృష్ణారెడ్డితో పాటు ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి సాగించిన దౌర్జన్యం, అరాచకాలు, హింసత్మక ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి. ఆయా కేసుల్లో నిందితుడైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన నెల్లూరు సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పోలింగ్ రోజున, ఆ తరువాత మాచర్ల నియోజకవర్గంలో చోటుచేసుకున్న హింసాకాండపై పూర్తి ఆధారాలు, వివరాలు సేకరించేందుకు రామకృష్ణారెడ్డిని పోలీసులు రెండు రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్లోనే ఆయనను గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విచారించారు. కస్టడీలో అడిగిన ప్రశ్నలకు ఆయన చెప్పిన సమాధానాలతో పోలీసు అధికారులు కంగుతిన్నారు. పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లో పిన్నెల్లి ఈవీఎంను ధ్వంసం చేసిన ఘటనను యావత్ ప్రపంచం చూసింది. తాజాగా వైసీపీ అధినేత జగన్ నెల్లూరు సెంట్రల్ జైల్‌లో పిన్నెల్లిని పరామర్శించి అక్కడ మీడియాతో మాట్లాడుతూ 'పాల్వాయి గేటు పోలింగ్ బూత్‌లో ఏకపక్ష ఎన్నిక జరుగుతుండటంతో అడ్డుకునేందుకు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం చేశారు, అందులో తప్పేముంది' అంటూ కితాబిచ్చారు. ఇదిలా ఉంటే పోలీస్ కస్టడీలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాత్రం తాను ఆరోజు పోలింగ్ బూత్‌లోకి వెళ్లనేలేదని చెప్పుకొచ్చారు. సీసీ ఫుటేజీలో మీరు కనిపించారు కదా, ఈవీఎం ధ్వంసం చేయడం స్పష్టంగా కనిపిస్తోందంటూ పోలీసు అధికారులు వేసిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ 'నేను అసలు పోలింగ్ బూత్‌లోకే వెళ్లలేదు.. నేను ఈవీఎం ధ్వంసం చేయడం ఏమిటి.. ఏం మాట్లాడుతున్నారు?' అంటూ పోలీసులను ఎదురు ప్రశ్నించడంతో వారు అవాక్కయ్యారు. ఆ తర్వాత రోజు కారంపూడిలో జరిగిన హింసాత్మక ఘటనలతో తనకు గానీ తన సోదరుడు వెంకటరామిరెడ్డికి గాని ఎటువంటి సంబంధం లేదని పిన్నెల్లి స్పష్టం చేశారు. ఆరోజు గన్‌మన్లు లేకపోవడంతో తాను ఇంటికే పరిమితమయ్యానని, అటువంటప్పుడు కారంపూడి ఎలా వెళ్తానని ఎదురు ప్రశ్నించారు. పోలింగ్ రోజున, ఆ తరువాత మాచర్ల నియోజకవర్గంలో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి సీసీ టీవీ ఫుటేజీతో పాటు ప్రత్యక్ష సాక్షులు, నేరాలకు సంబంధించిన బాధితులు ఉన్నప్పటికీ పిన్నెల్లి చెప్పిన సమాధానాలు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై 18న తీర్పు

- గురజాల అదనపు జిల్లా కోర్టులో ముగిసిన వాదనలు

గుంటూరు(లీగల్), జూలై 10: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసం, కారంపూడి సీఐ నారాయణస్వామిపై దాడి సంఘటనలపై దాఖలైన కేసుల్లో ప్రస్తుతం నెల్లూరు జైలులో రిమాండ్‌లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై ఈ నెల 18న కోర్టు తీర్పు ఇవ్వనుంది. ఈ పిటిషన్లపై గురజాల అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న గుంటూరు నాలుగో అదనపు జిల్లా కోర్టు జడ్జి రుద్రపాటి శరత్‌బాబు వద్ద బుధవారం మధ్యాహ్నం ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. దీంతో తీర్పు వెలువరించేందుకు ఈ నెల 18కి వాయిదా వేశారు. పిన్నెల్లి తరఫున మాజీ ఏపీపీ, జగన్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన సిట్ స్పెషల్ లీగల్ అడ్వైజర్‌గా పనిచేసిన ఇనకొల్లు వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. పాల్వాయిగేటు సంఘటన నుంచి కౌంటింగ్ తేదీ వరకు పోలీసులు ఈ కేసుల్లో స్తబ్ధుగా వ్యవహరించారని.. తొలుత ఎఫ్ఐఆర్‌లో లేకపోయినా తర్వాత దురుద్దేశపూర్వకంగా పిన్నెల్లిని నిందితుడిగా చేర్చారని తెలిపారు. సీఐ నారాయణస్వామిపై దాడి జరిగి ఉంటే ఆయన పోలీసు అధికారిగా ఉండి వెంటనే మెడికో లీగల్ కేసుగా ఎందుకు నమోదు చేయించలేదని, గాయంపై కూడా పోలీసులు అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో జరిగిన చిన్న చిన్న ఘటనలతోనే ఆయనపై పోలీసులు రౌడీషీట్ తెరిచారని చెప్పగా.. రౌడీషీట్ రద్దుకు హైకోర్టుకు వెళ్లవచ్చు కదా అని న్యాయమూర్తి సూచించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఈ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన హైకోర్టు న్యాయవాది అశ్వినీకుమార్ వాదనలు వినిపించారు. పోలీసు అధికారులు ఎన్నికల తేదీన జరిగిన హింసలో కొంతకాలం స్తబ్ధుగా వ్యవహరించిన మాట వాస్తవమేనని, అయితే పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో పిన్నెల్లి ఈవీఎంను పగలగొట్టడం ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయిందని.. దీనిని మీడియా ద్వారా అందరూ చూశారని తెలిపారు. సిటింగ్ ఎమ్మెల్యేగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని పోలీసు అధికారిపై దాడి చేయడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు. పోలీసుల దర్యాప్తునకు పిన్నెల్లి ఏమాత్రం సహకరించడం లేదని, ఎన్నికల రోజు తాను ఆ పోలింగ్ బూత్ వద్దకే వెళ్లలేదని అసత్యమాడుతున్నారని తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు అధికారులు పిన్నెల్లిని విచారించే సమయంలో రికార్డు చేసిన ప్రశ్నావళిని, ఆయన ఇచ్చిన సమాధానాలను కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో మరి కొంతమంది నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారని, వారిని కూడా అరెస్టు చేయాల్సి ఉందన్నారు. పిన్నెల్లికి బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు అవరోధం కలిగిస్తారని.. సాక్షులను ప్రభావితం చేస్తారని తెలిపారు. ఆయన బెయిల్ పిటిషన్లను కొట్టివేయాలని కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈ నెల 18కి వాయిదా వేశారు.

అనంతలో టీడీపీ కార్యకర్త హత్య దుర్మార్గం: పల్లా

అమరావతి, జూలై10(ఆంధ్రజ్యోతి): యథా లీడర్, తథా క్యాడర్ అన్నట్లు జగన్‌రెడ్డి బాటలోనే వైసీపీ మూకలు పయనిస్తున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ ధ్వజమెత్తారు. వైసీపీ అరాచక పాలనను భరించలేక ప్రజలు ఛీకొట్టినా జగన్‌రెడ్డి మరణశాసననం రాస్తూనే ఉన్నాడని మండిపడ్డారు. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 9 మంది టీడీపీ కార్యకర్తలను వైసీపీ రౌడీ మూకలు పొట్టన పెట్టుకున్నాయని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం మెచ్చిరిలో టీడీపీ కార్యకర్త గొల్ల ఆదెప్ప హత్యాఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. మృతుని కుటుంబ సభ్యులకు పల్లా ప్రగాఢసానుభూతిని తెలుపుతూ, ఎల్లవేళలా టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ముగిసిన ఆదికేశవులు అంత్యక్రియలు

రాయదుర్గం, జూలై 10: ప్రత్యర్థుల చేతుల్లో దారుణహత్యకు గురైన టీడీపీ నాయకుడు ఆదికేశవులు(48) పాడెను అనంతపురం జిల్లా పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మోశారు. బుధవారం మెచ్చిరి గ్రామానికి వెళ్లిన వెంకటశివుడు.. ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

మాస్కోలో మోదీ

ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారం చేపట్టాక, తన తొలివిదేశీ పర్యటనకు ఇరుగుపొరుగుదేశాలను కాక, రష్యాను ఎంచుకున్నారు. ఈమారు ఆయన మన చిరకాల ఆప్తమిత్రదేశంలో తొలిగా కాలూనడం బాగున్నది కానీ, అందుకు ఆయన ఎంచుకున్న సమయం కొన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. ప్రధాని మోదీపర్యటన ఉభయ దేశాల సంబంధాలను మరో దశకు తీసుకుపోయిన మాట వాస్తవం. ప్రపంచరాజకీయాలను ప్రభావితం చేసే పర్యటనగా దీనిని అభివర్ణిస్తూ, రష్యా విడుదల చేసిన సుదీర్ఘ ప్రకటన చూసినప్పుడు ఆ దేశం ఎంత సంతోషించిందో అర్థమవుతుంది.

రష్యాలో భారతప్రధాని ఉన్న సమయంలో, ఉక్రెయిన్ రాజధాని కీవ్ మీద రష్యా అమానుషమైన దాడి చేసింది. జూన్ 8న జరిగిన దాడుల్లో నలభైఐదుమందికి పైగా మరణించారు. ఓ పిల్లల ఆస్పత్రిమీద జరిగిన దాడి రష్యాను అప్రదిష్టపాల్జేసింది. ఈ అకృత్యానికి తాను కారణం కాదని, ఉక్రెయిన్ మిసైల్ విఫలం చెందినందువల్లే ఈ దారుణం జరిగిందని రష్యా దబాయించింది కానీ, రెండేళ్ళుగా రష్యా యుద్ధరీతులను గమనిస్తున్నవారికి అందులో నిజానిజాలు తెలియకపోవు. డెబ్బయ్ ఐదేళ్ళక్రితం అమెరికా ప్రోద్బలం మేరకు ఆవిర్భవించిన 'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ (నాటో)' కూటమి వజ్రోత్సవ సమావేశాలు వాషింగ్టన్‌లో మొదలవుతున్న నేపథ్యంలో, రష్యా అంత తీవ్రస్థాయిలో ఈ జూన్ 8 దాడులకు తెగబడిందని అంటారు. ఆ సమావేశంలో సభ్యదేశాలన్నీ ఉక్రెయిన్‌కు అందించాల్సిన దీర్ఘకాలిక సాయం, చేయాల్సిన న్యాయం గురించి చర్చించడంతో పాటు, ఏటా నలభైబిలియన్ డాలర్ల మిలటరీ సాయం గురించి నిర్ణయం తీసుకోవలసి ఉంది. మరోపక్కన అదేరోజు, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ వార్సాలో పర్యటిస్తూ, పోలెండ్‌తో ఒక మహత్తర రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఉక్రెయిన్ గగనతలంలోకి వచ్చిన రష్యా డ్రోన్లను, క్షిపణులకు కూల్చివేసేందుకు నాటో సభ్యదేశంగా పోలెండ్‌కు ఈ ఒప్పందం అధికారాన్నిస్తోంది. ఈ రెండు పరిణామాలమీదా రష్యా తన ఆగ్రహాన్ని, నిరసనను ఈ వైమానికదాడుల ద్వారా ప్రకటించిన సందర్భంలోనే ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశంలో పర్యటించడం విశేషం. పౌర స్థావరాలమీద దాడులతో రష్యా తన దుర్మార్గాన్ని ప్రదర్శించిన ఈ సందర్భాన్ని, మోదీ పర్యటనను కలగలిపి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఎంతో తెలివిగా వాడుకున్నారు. ధ్వంసమైన ఆస్పత్రి ఫోటోలను ట్విటర్‌లో పోస్టుచేస్తూ అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాధినేత ఓ అత్యంత క్రూరుడైన నేరగాడిని ఆలింగనం చేసుకున్న ఆ ఘటన అంటూ పుతిన్–మోదీ ఆలింగనం దృశ్యాన్ని ఉటంకించారు. రష్యా– ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడానికి తెరవెనుక ఎటువంటి యత్నాలు జరుగుతున్నాయో తెలియదు కానీ, మోదీ పర్యటన ఆ శాంతియత్నాలకు తీవ్ర విఘాతమని జెలెన్‌స్కీ ఆక్షేపించారు.

రష్యాతో యుద్ధం మొదలైన తరువాత జెలెన్‌స్కీ భారతదేశాన్ని నేరుగా తప్పుబట్టడం ఇదే తొలిసారి. గతనెలలో స్విట్జర్లాండ్ ఆధ్వర్యంలో ఒక శాంతి సదస్సు జరిగినప్పుడు భారతదేశం నామమాత్రంగా ఓ చిన్న స్థాయి అధికారిని పంపి సంయుక్త ప్రకటనమీద సంతకం చేయడానికి కూడా నిరాకరించిన విషయం తెలిసిందే. ఆదినుంచీ ఈ యుద్ధం విషయంలో రష్యాను విమర్శించేందుకు భారతదేశం ఎన్నడూ సిద్ధపడలేదు. ఐక్యరాజ్యసమితిలో రష్యా వ్యతిరేక తీర్మానాల సందర్భంలో కూడా ఓటింగ్‌కు గైర్హాజరైంది. కానీ, అమెరికా తదితర పాశ్చాత్యదేశాల అహాన్ని సంతృప్తిపరచాల్సి వచ్చినప్పుడల్లా యుద్ధనీతి గురించి, సామాన్యుల ప్రాణాలపరిరక్షణగురించి, దేశ సార్వభౌమత్వం గురించి నాలుగుమాటలు అంటూండటం ఉన్నదే.

ఇప్పుడు పుతిన్–మోదీ గాఢాలింగనంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చిన నేపథ్యంలో, రష్యా అధ్యక్షుడితో మోదీ మరో నాలుగుమాటలు గట్టిగా చెప్పినట్టుగా భారతవిదేశాంగశాఖ కార్యదర్శి ప్రకటన తెలియచేస్తోంది. పిల్లల ఆస్పత్రిపై జరిగిన దాడిని ఖండించడం, పసిపిల్లలు బలికావడంమీద ఆవేదన వెలిబుచ్చడం, సమస్యకు పరిష్కారం చర్చలే తప్ప యుద్ధక్షేత్రం కాదని పునరుద్ఘాటించడం ఇత్యాదివి అనేకం అందులో ఉన్నాయి. సమస్యకు చర్చల ద్వారానే ముగింపు పలకాలి, అందుకు భారతదేశం తనవంతు సాయం చేయడానికి సిద్ధంగా ఉంది అని మోదీ అన్నప్పుడు పుతిన్ ఎంతో శ్రద్ధగా విన్నారట. యుద్ధానికి తెరదించేందుకు వీలుకల్పించే కొన్ని ఆసక్తికరమైన మార్గాలు ఈ చర్చల సందర్భంగా ముందుకు వచ్చాయనీ, సంక్షోభ నివారణకు మోదీ చేస్తున్న ప్రయత్నాలపట్ల పుతిన్ కృతజ్ఞతలు తెలియచేశారని కూడా వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైన తరువాత రష్యాలో మోదీ కాలూనడం ఇదే తొలిసారి. ఈ పర్యటన ఆ యుద్ధం ముగింపు దిశగా ఉపకరిస్తే అంతకంటే సంతోషించాల్సిందేమీ లేదు.

రాహుల్ అన్నట్టు రామాలయ ఉద్యమం ఓడిందా?

సొంత ప్రతాపం కొంత ఉంటే, జబ్బలు ఎంత చరుచుకున్నా ఒక అందం. అరువు బలం మీద ఆధారపడి, అంతా తమ ప్రతాపం అంటేనే వికారం. మొదటికే మోసం వచ్చినా, మూడోసారి మహాప్రసాదమని మురిసిపోతున్న ప్రధాని మోదీ గురించి కాదు. ఉట్టిని మాత్రమే కొట్టి, స్వర్గం దక్కిందని సంబరపడుతున్న 'బాలక్' రాహుల్ గురించి. పొత్తు ఉంటే ఉండొచ్చు కానీ, అయోధ్యలో గెలిచింది తను కాదు, తన పార్టీ కాదు. అయినా, అద్వాణీ ఆరంభించిన రామాలయ ఉద్యమాన్ని తాము అయోధ్యలో ఓడించామని రాహుల్ గాంధీ చెబుతున్నారు. అదే మాదిరిగా, ఇంకో మూడేళ్లలో గుజరాత్‌లో కూడా బీజేపీని ఓడిస్తామని సవాల్ చేస్తున్నారు. ఉద్యమ స్థలంలో గెలిచినట్టే, మోదీ స్వరాష్ట్రంలోనూ గెలుస్తామని ఆయన ఉద్దేశం కావచ్చు. గుజరాత్‌లో ఆ కర్తవ్యం నెరవేర్చే మిత్రపక్షమేదో?

అయోధ్యలో సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి అవదేశ్ సింగ్ పాసీ విజయం నిస్సందేహంగా ఒక విశేషమే. ఉధృతంగా ఉన్న భావావేశాన్ని కాదని, నిత్యజీవన సమస్యలు పైచేయి అయిన ఎన్నిక అది. ఒక వైచిత్రి, జనరల్ సీటులో ఒక దళిత అభ్యర్థి, సవర్ణ ప్రత్యర్థులను ఓడించి గెలవడంలో ఒక కవితా న్యాయం కూడా ఉండవచ్చు. కానీ, అయోధ్య అన్నది రామాలయ ఉద్యమంలో కీలకమయిన స్థలం, గమ్యం తప్ప, అదే సర్వస్వం కాదు. రామజన్మభూమి ఉద్యమం అన్నది ఒక ప్రయాణం. సుమారు నాలుగుదశాబ్దాల ప్రయాణం. దాదాపు దేశమంతటా, ఆ ప్రయాణం సాగింది. దాని ప్రభావాలు, పర్యవసానాలు దేశమంతటికీ వ్యాపించి ఉన్నాయి. అయోధ్యలో బీజేపీ ఓడిపోయినంత మాత్రాన, ఆ ఉద్యమం ఓడినట్టు కాదు.

ఆ ఉద్యమ ప్రభావం రాజకీయరంగంలో ఇంతకు మునుపులా ఉండకపోవచ్చు. క్షీణించవచ్చు. లేదా, అది సాధించదలచుకున్న ఫలితాలు సాధించుకున్నది కనుక, అందులో నుంచి రాగలిగిన ఫలసాయం అందింది కనుక, ఇకపై అది ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోవచ్చు. భావావేశాలు ఉపశమించవచ్చును కానీ, భావాలు మిగిలే ఉంటాయి, లోలోపలికి ఇంకి ఉంటాయి. సమాజం ఆలోచనల్లో, ఎంపికల్లో, వ్యవహారసరళిలో అవి పనిచేస్తూనే ఉంటాయి. రేపు, మధుర, కాశీ స్థలాల్లో అదే రకమైన ప్రయత్నాలు మొదలయితే, అయోధ్య జ్ఞాపకం కూడా దానికి ప్రేరణ అవుతుంది.

ఒకనాటి ఘనభారతం మధ్యయుగాలలో విదేశీయుల, ముఖ్యంగా ముస్లిముల, ఆక్రమణలకు లోనై భంగపడిందని, ఆ కుంగుబాటు నుంచి హిందువులను ఆత్మవిశ్వాసంలోకి ఉద్ధరించాలని, స్వాతంత్ర్యానంతరం పాలించిన ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు విమత, విజాతి శ్రేణులను బుజ్జగిస్తూ వచ్చాయని, మతజాతీయత నిర్మాణం ద్వారా ధర్మాన్ని, దేశాన్ని పటిష్టం చేయాలని విశ్వసించే ఆలోచనల, ఆచరణలలో భాగమే రామమందిర ఉద్యమం. బాబ్రీమసీదు విధ్వంసం కానీ, ఆ స్థలంలో నిర్మితమైన నూతన రామాలయం కానీ గాయపడిన జాతిగౌరవానికి జరిగిన ప్రతిన్యాయంగా ఆ ఉద్యమ శ్రేణులు భావిస్తాయి. బాబర్ ద్వారా ఒకనాటి రామజన్మభూమి ఆలయం ధ్వంసమైందన్న వివాదం చరిత్రకు, పురాతత్వ శాస్త్రానికి సంబంధించినది. కాగా, ఆధునిక కాలంలో వలస ఆలోచనావిధానం, సామ్యవాదులు, ఉదారవాదుల వల్ల భారతీయ భావధార, సంస్కృతి అణగారిపోతున్నాయని, విమతస్థుల నుంచి మెజారిటీ మతస్థులకు ప్రమాదం పొంచి ఉన్నదని తీవ్ర జాతీయవాదం అనుకుంటుంది. ఈ చారిత్రక, సమకాలిక కథనాలు సమన్వయంతో సాగి, ఆ ఆలోచనలకు విస్తృతమైన మద్దతు కూడగట్టాయి. ఇంకా అనేక ఇతర అనుబంధ కారణాలు కూడా పనిచేసి, 1984లో రెండు లోక్‌సభ స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీజేపీని, 2014లో 282 స్థానాల విజయానికి చేర్చింది. ఇప్పుడు ఈ స్థానాలు దిగువకు పడిపోయినంత మాత్రాన, దేశమంతటా ప్రజలలో జీర్ణించుకుపోయిన ఆలోచనలు పలచబడినట్టు కాదు.



బీజేపీ సొంతంగా మెజారిటీ దక్కించుకోలేకపోయిందన్న విషయానికి రాహుల్ కొంతకాలం విశ్రాంతి ఇవ్వడం మంచిది. దాని మీద ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇక చాలు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పక్షాలు, ఈ ఎన్నికల్లో నిరూపించిన విషయమేమిటంటే, నరేంద్రమోదీని బలహీనపరచడం అసాధ్యమేమీ కాదని. తన విజయం బేషరతుదేమీ కాదని, తాను అజేయుడేమీ కాదని నరేంద్రమోదీ కూడా తెలుసుకునే ఉంటారు. తమ విజయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రతిపక్ష కూటమి, తన అపజయాన్ని అధిగమించడానికి మోదీ ప్రయత్నించాలి.

లౌకిక వాదం అంటే చెరో బుజ్జగింపు, చెరొక బెదిరింపు అని కాంగ్రెస్ అప్పటికీ ఇప్పటికీ నమ్ముతుంది. షాబానో కేసులో ముస్లిం మతవాద, సామాజిక ఛాందసులను మెప్పించడానికి చట్టసవరణ చేసిన రాజీవ్ గాంధీ, దానికి సమతూకం కింద నిద్రావస్థలో ఉన్న అయోధ్య వివాదాన్ని నిద్రలేపారు. రామాలయ ఉద్యమానికి ఘనతను అద్వాణీకి ఇచ్చారు కానీ, రాహుల్ తండ్రికి కూడా ఆ కీర్తిలో వాటా ఉంది. 1986 నుంచి మొదలై, కరసేవలు, రథయాత్రలు, ప్రభుత్వ పతనాలు, కూల్చివేతలు, కోర్టు కేసులు, పేలుళ్లు, ఘర్షణలు, రైలుబోగీ దగ్ధాలు, దారుణ ఊచకోతలు, ఈ వివాదం దారిలో మైలురాళ్లుగా ఉన్నాయి. సుమారు నాలుగువేల మంది సంబంధిత హింసాకాండలో చనిపోయారు. ఇంతటి తగవునూ న్యాయస్థానాలు భూమి తగాదాగా భావించి, తోచిన విధంగా పరిష్కరించాయి. ఈ కల్లోల ప్రయాణం చివర రామాలయ నిర్మాణం ఒక పక్షానికి ఘన విజయమే. ఒక ఆరాటం నెరవేరింది. పోరాటం ముగిసింది. ఫైజాబాద్ ఎన్నికలో బీజేపీ గెలవనంత మాత్రాన, ఉద్యమమే ఓడిపోయిందని ఎట్లా అంటారు?

రాహుల్ గాంధీ ఏదో పొరపాటు మాట్లాడాడని కాదు, పొరపాటు అవగాహనతో ఉన్నారన్నది సమస్య. ఎన్నికల విజయాలు, సైద్ధాంతిక విజయాలని, తాము అధికారంలోకి రావడమే ప్రజలకు విముక్తి అని ఆయన అనుకుంటే, ఇప్పుడు పెరుగుతున్న జనాభిమానం ఎంతో కాలం నిలవదు. కొద్దిపాటి విజయాలనే, అతిగా ఊహించుకుని ప్రగల్భించడం రాజకీయాలలో వివేకం అనిపించుకోదు. మోదీ పరివారం తనను 'పప్పు' అని గేలిచేసినప్పుడు, 'పప్పు' లాగా, ఇప్పుడు 'బాలకుడ'ని తీసిపారేస్తున్నప్పుడు, నిజంగానే బాల్యచాపల్యంతోను రాహుల్ గాంధీ ఉన్నారేమో అనిపిస్తోంది. పిల్లవాడేమీ కాదు, సాంకేతికంగా చూస్తే యువకుడూ కాదు, కానీ, రాహుల్ గాంధీలో పరవళ్లు తొక్కే ఉత్సాహం ఉన్నమాట నిజం. ఆ ఉత్సాహం కొన్నిసార్లు అత్యుత్సాహంగా వ్యక్తమై, వెక్కిరింతలకు ఆస్కారం ఇస్తోంది. బీజేపీ హేళనలు వినోదం కోసం రూపొందించినవి కావు. వాటి వెనుక చాలా అర్థముంది. అసమర్థుడని చెప్పడానికి పప్పు అన్న మాటను ఉపయోగించారు. ఇటీవలి రాహుల్‌ను చూశాక, ఆ మాటకు కాలం చెల్లిందని అర్థమైంది. అందుకని, కొత్తగా అపరిపక్వుడనే అర్థంలో 'బాలక్'ను ప్రయోగిస్తున్నారు. ఆయన ఆలోచనలు, మాటలు ఇట్లాగే కొనసాగితే, మోదీ కాదు, ప్రజలు కూడా ఆయనను బాలకుడనే అనుకుంటారు.

లోక్‌సభలో మాట్లాడుతూ, శివుడి బొమ్మను ప్రదర్శిస్తూ, సర్వమతాల్లోని అభయముద్ర గురించి వివరిస్తున్నప్పుడు, రాహుల్ గాంధీ ప్రయత్నం, తపన నచ్చినట్టుగా, అందులోని విషయం ఆకట్టుకోలేదు. మతాలకు, ముఖ్యంగా హిందూ మతానికి తాను వ్యతిరేకిని కాదని చెప్పుకోవడంతో పాటు, మతబోధనలలో నుంచి హింసాద్వేషాలను వ్యతిరేకించడమనే చట్రంలో ఆయన మాట్లాడారు. ఇంతగా ప్రయాసపడీ, ప్రసంగం చివరలో మాట్లాడిన మాటలు ప్రభుత్వపక్షానికి ఆయుధాలు అందించాయి. రాహుల్ తప్పుగా మాట్లాడారని కాదు. ప్రత్యక్ష ప్రసారాలు చూసినవారందరికీ తెలుసు, ఆయన హిందువులందరినీ హింసావాదులు అనలేదు. హిందువులమని చెప్పుకునే వారు, హింసను ఆచరిస్తున్నారంటూ, తాను ఆ మాటలను బీజేపీని, ఆర్ఎస్ఎస్‌ను దృష్టిలో పెట్టుకుని అంటున్నానని చెప్పారు. ప్రకటనలో వివాదం తొంగిచూస్తున్నప్పుడు, ఆ మాటల చివరలో ఉన్న వివరణను ఎవరు పట్టించుకుంటారు? రాహుల్ హిందువులను అందరినీ ఉద్దేశించి ఆ మాటలు అన్నారన్న వాదన బిగ్గరగా వినిపించసాగింది. అనుభవజ్ఞుడైన, పరిపక్వత కలిగిన నాయకుడు తప్పుగా మాట్లాడకపోవడమే కాదు, తప్పుగా వ్యాఖ్యానించడానికి ఆస్కారం కూడా ఇవ్వకూడదు. ఆ నాటి రాహుల్ ప్రసంగం దేశ వ్యాప్తంగా చాలామందిని ఆకట్టుకుంది, కానీ, ఆ ఆకర్షణ ముందు తాము చిన్నబోకుండా, ఈ హింసావివాదం బీజేపీని రక్షించింది.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

బీజేపీ సొంతంగా మెజారిటీ దక్కించుకోలేకపోయిందన్న విషయానికి రాహుల్ కొంతకాలం విశ్రాంతి ఇవ్వడం మంచిది. దాని మీద ఇప్పటికే చాలా మాట్లాడారు. ఇక

> అయోధ్య అన్నది రామాలయ ఉద్యమంలో కీలకమయిన స్థలం, గమ్యం తప్ప, అదే సర్వస్వం కాదు. రామజన్మభూమి ఉద్యమం అన్నది ఒక ప్రయాణం. సుమారు నాలుగుదశాబ్దాల ప్రయాణం. దాదాపు దేశమంతటా, ఆ ప్రయాణం సాగింది. దాని ప్రభావాలు, పర్యవసానాలు దేశమంతటికీ వ్యాపించి ఉన్నాయి. అయోధ్యలో బీజేపీ ఓడిపోయినంత మాత్రాన, ఆ ఉద్యమం ఓడినట్టు కాదు.

చాలు. కాంగ్రెస్, ఇండియా కూటమిలోని ఇతర పక్షాలు, ఈ ఎన్నికల్లో నిరూపించిన విషయమేమిటంటే, నరేంద్రమోదీని బలహీనపరచడం అసాధ్యమేమీ కాదని. తన విజయం బేషరతుదేమీ కాదని, తాను అజేయుడేమీ కాదని నరేంద్ర మోదీ కూడా తెలుసుకునే ఉంటారు. తమ విజయాలను మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రతిపక్ష కూటమి, తన అపజయాన్ని అధిగమించడానికి మోదీ ప్రయత్నించాలి. ఎవరు పొరపాట్లు చేసినా, అవి వారి అవకాశాలను దెబ్బతీస్తూ పోతాయి. ద్వేషపు సంతలో ప్రేమ దుకాణాన్ని తెరుస్తున్నామని చెప్పిన రాహుల్ గాంధీ, జోడో యాత్రలలోను, పార్లమెంటులోను, ఎన్నికల ప్రచారంలోను మెరుపు ప్రచారం కాకుండా, క్షేత్రస్థాయిలో తమ పార్టీ యంత్రాంగం చేత సామరస్య, సోదరత్వ కృషి చేయించాలి. రాహుల్ నీతివచనాలు ఒక తీరుగా, కాంగ్రెస్ నేతల ఆచరణలు మరొక రీతిగా ఉంటే, బాలక బిరుదు పోయి, ద్వంద్వత్వ విమర్శలు ఎదురవుతాయి. ఇప్పటికే, రాహుల్ మాట, కాంగ్రెస్ చేత గురించిన ప్రచారం ఢిల్లీలో బలంగానే మొదలయింది.

జనాభాతో పేదరికమా, పేదరికం వల్ల జనాభానా?

1951లో భారతదేశ జననాల రేటు వెయ్యికి 47 శాతం ఉండగా మరణాల రేటు 44 శాతంగా ఉన్నది. క్రమంగా ప్రస్తుతానికి ఈ జననాల రేటు 16.1 శాతానికి మాత్రమే తగ్గగా మరణాల రేటు ఆరు శాతానికి తగ్గింది. ఫలితంగా 1956లో 36 కోట్లుగా ఉన్న జనాభా 2023 ఏప్రిల్ నాటికి నూట నలభై రెండు కోట్లకు చేరుకున్నది. చైనా జనాభాను సైతం మించిపోయిందని అనేక భయాలు కలుగుతున్నాయి.

బ్రిటిష్ వారు అనుసరించిన విధానాల వలన ఈ దేశం ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ఎంతో కృశించిపోయింది. 1834లో విలియం బెంటింగ్ బ్రిటిష్ వారి పాలన చూసి "ప్రపంచ వాణిజ్య చరిత్రలో ఇంతటి విషాదమైనది మరేదీ కానరాదు" అని వ్యాఖ్యానించారు. అందుకే స్వాతంత్ర్యం వచ్చే నాటికి 70 శాతం ప్రజలు నిరుద్యోగులుగా ఉండిపోవడమే గాక పేదరికం, ఆకలి చావులతో దేశం సతమతమవుతున్నది.



> ప్రపంచ అభివృద్ధి నివేదిక ప్రకారం– ఉత్పత్తి చేసే సంతానానికి ఖర్చు ఉండదు కానీ ఉత్పత్తి చేసిన సంతానం సంపాదించి పెడుతుంది అనే భావన ప్రజల్లో ప్రబలంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ భావనలో మార్పు రావాలి. నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా లాంటి నమ్మకాల నుండి ప్రజలు బయటపడేందుకు ప్రభుత్వం జనాభా విద్యను అందించాలి.

సగటు మనిషి రోజుకు తీసుకునే ఆహార పదార్థాల వలన ఎంత శక్తి లభించాలో అన్ని క్యాలరీల శక్తి లభించనప్పుడు వారు పేదరికంలో ఉన్నారని ఒక నిర్వచనం ఉన్నది. కానీ యుఎన్‌ఓ నిర్వచనం ప్రకారం ఎంతైతే విద్య, వైద్యం, మంచి నీటి సదుపాయాలు, ఆహార పదార్థాలు, సాంఘిక సౌకర్యాలు, సమాచార సదుపాయాలు లభించాలో అంతమేరకు పొందని వాళ్ళు కూడా పేదరికంలో ఉన్నట్టే. ఈ నేపథ్యంలో 2023 CMIE (సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ) నివేదిక ప్రకారం పారిశ్రామిక దేశాలు విద్యకు 5.6 శాతం కేటాయిస్తే ఇండియాలో ఆ కేటాయింపు 2.2 శాతం మాత్రమే ఉంది. పారిశ్రామిక దేశాల్లో అక్షరాస్యత 97.11 శాతం ఉండగా ప్రస్తుతం మనదేశంలో అక్షరాస్యత శాతం 76.32 శాతం మాత్రమే. పారిశ్రామిక దేశాలలో డాక్టర్ – పేషెంట్ నిష్పత్తి, ఉదాహరణకు, ఆస్ట్రియాలో 1:196, చిలీలో 1:176 గా ఉన్నది. కానీ ఇండియాలో ఇది 1:834 గా ఉన్నది. సామాజిక భద్రతా సౌకర్యాల పైన కొరియా తన జీడీపీలో 13.5 శాతం ఖర్చు చేస్తుండగా, మన దేశం ప్రస్తుతం 8.2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నది. పారిశ్రామిక దేశాలలో తలసరిగా తీసుకునే ఆహార పదార్థాల ద్వారా రోజుకు 3400 కేలరీల శక్తి లభిస్తుండగా మన దేశంలో 2029 క్యాలరీల శక్తి మాత్రమే లభిస్తున్నది. అంతేగాక పారిశ్రామిక దేశాలలో నూటికి 95 మంది మహిళలు అక్షరాస్యులుగా ఉండగా, స్వాతంత్ర సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ మన దేశంలో 70.3 శాతం మంది మహిళలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్నారు. మొత్తమ్మీద అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకున్నప్పుడు భారతదేశంలో ఇప్పటికీ పేదరికమే తాండవిస్తున్నది.

'ది మిత్ ఆఫ్ పాపులేషన్ కంట్రోల్ ' అనే పుస్తకంలో దాని రచయిత మహమూద్ మందాని "జనాభా వల్ల ప్రజలు పేదరికంలో లేరు, పేదరికం వల్ల జనాభా ఎక్కువ ఉన్నది" అంటారు ("People are not poor because they are many. They are many because they are poor"). వర్ధమాన దేశాలలో జనాభా ఎక్కువగా ఎందుకు పెరుగుతుందన్న అంశాన్ని తీసుకుని ఇద్దరు అమెరికన్ పరిశోధకులు దక్షిణ కొరియా, శ్రీలంక, కొలంబోలలో పరిశీలించగా ఈ దేశాలలో ఆదాయ అసమానతలు ఎక్కువగా ఉండడం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, భూమి సక్రమంగా పంపిణీ కాకపోవడం, మహిళల స్థితిగతుల్లో మార్పు లేకపోవడం, ఆరోగ్య శిశు సంరక్షణ చర్యలు ఎక్కువగా అందకపోవడమే జనాభా పెరుగుదలకు కారణమవుతున్నదని వెల్లడైంది.

జనాభాను తగ్గించాలంటే విద్య, వైద్యం తదితర రంగాల్లో ఉన్న వెనుకబాటుతనాన్ని పారిశ్రామిక దేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా తగ్గించాలి. వ్యవసాయ రంగంలో 1969లో భారతీయ శాస్త్రవేత్త ప్రశాంత చంద్ర మహలనోబీస్ పరిశీలన ప్రకారం ఆరు కోట్ల ఎకరాల మిగులు భూమి ఉన్నట్లు అంచనా. అయితే భూసంస్కరణ చట్టాలు రూపొందించి డెభై ఏళ్ళు అవుతున్నప్పటికీ ప్రభుత్వాలు ఇప్పటివరకు పంచిన భూమి కేవలం 44.45 లక్షల ఎకరాలు మాత్రమే. ప్రపంచ అభివృద్ధి నివేదిక ప్రకారం– ఉత్పత్తి చేసే సంతానానికి ఖర్చు ఉండదు కానీ ఉత్పత్తి చేసిన సంతానం సంపాదించి పెడుతుంది అనే భావన ప్రజల్లో ప్రబలంగా ఉన్నట్లు వెల్లడైంది. ఈ భావనలో మార్పు రావాలి. నారు పోసిన వాడు నీరు పోయక పోతాడా లాంటి నమ్మకాల నుంచి ప్రజలు బయటపడేందుకు ప్రభుత్వం జనాభా విద్యను అందించాలి.

ఒక విధంగా చూసినప్పుడు జనాభాను గురించి అంతగా బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ప్రపంచీకరణ వల్ల ప్రపంచ దేశాలకు సాంకేతిక జనాభా అవసరం పెరుగుతున్నది. మన దేశంలో 29 సంవత్సరాల సగటు వయసు ఉన్నవారు 47 కోట్ల మంది ఉన్నారు. వారు ఎక్కడైనా పనిచేయవచ్చు. మన దేశానికి నిధులు తరలించవచ్చు. కొన్ని లెక్కల ప్రకారం ప్రస్తుతం ఎన్నారై యువకులు సంవత్సరానికి 7 లక్షల కోట్ల రూపాయలు భారతదేశానికి పంపుతున్నారు. అందుకే భవిష్యత్తులో జనాభా ఒక వరంగానూ మారవచ్చు. ముందుగా పేదరికం తగ్గించే అంశాన్ని మన ప్రభుత్వాలు గమనంలోకి తీసుకుంటే అన్ని సమస్యలూ చక్కబడతాయి.

○ పొందూరు ప్రభాకర్ రావు

అర్థశాస్త్ర నిపుణులు

(నేడు ప్రపంచ జనాభా దినోత్సవం)

జీవో 117 రద్దుతోనే ప్రాథమిక విద్యకు ప్రాణం

విద్యా సంస్కరణల్లో భాగంగా ఏర్పాటయిన విద్య కమిషన్‌ల నివేదికలలో ప్రాథమిక విద్య ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు ప్రతి పల్లెలోనూ; మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత; ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాలలు అనతికాలం నుంచి నడుస్తున్నాయి. కానీ విద్యా సంస్కరణల పేరుతో తెచ్చిన జీవో 117తో ప్రాథమిక విద్య నిట్టనిలువుగా చీలింది. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా సబ్జెక్టు నిపుణుల బోధన ఉండాలని, ఆంగ్ల విద్యను బలోపేతం చేయాలని విలీన విధానాన్ని తీసుకొచ్చి ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతుల విలీనం చేశారు. అక్కడి నుంచే ప్రాథమిక విద్య విచ్ఛిన్నానికి దారితీసింది. ఈ ప్రక్రియను నిరసిస్తూ పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులు ధర్నాలు, నిరసనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రజలు చేసేదేమీ లేక తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేటుకు మళ్ళించాల్సిన పరిస్థితి వచ్చింది.

ప్రాథమిక స్థాయి విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్ల స్థాయి ఉపాధ్యాయులు బోధించడంతో ఆశించిన స్థాయిలో విద్యా లక్ష్యాలను చేరలేదు. దీంతోపాటు ఇతర గ్రామాల నుంచి వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో డ్రాపౌట్లు పెరగడంతో పాటు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. సంస్కరణలు అంటే ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి వెళ్ళాలి తప్ప, తిరోగమనం చెందకూడదన్న ప్రాథమిక సిద్ధాంతం పాఠశాలల విలీనంతో కనుమరుగయ్యింది.

117 జీవో ఉన్నత పాఠశాలలపై కూడా ప్రభావం చూపింది. ఉపాధ్యాయులపై 42 పీరియడ్ల తీవ్రమైన పని భారం పెరగడం వల్ల ఉన్నత తరగతుల విద్యార్థులకు కూడా న్యాయం జరగలేదు. అంతేకాకుండా ఉన్నత పాఠశాలల విద్యార్థుల నమోదు 93 కంటే తక్కువ ఉంటే ప్రధానోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు రద్దు, 137 మంది కంటే తక్కువ ఉంటే విలీన ఉన్నత పాఠశాలలో సైతం వ్యాయామ, ప్రధానోపాధ్యాయ పోస్టులను తీసేయడంతో ఉన్నత పాఠశాల విద్య అతలాకుతలమయింది. పీజీ, బీఈడీ స్థాయి అర్హతలు ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు 3,4,5 తరగతులకు బోధించడంలో తికమకకు గురికావడం వల్ల సాధించాలన్న లక్ష్యాలు అధః పాతాళంలోకి వెళ్లాయి.

ఇప్పుడు ప్రభుత్వం మారింది. దీంతో జీవో 117 రద్దు చేసి పాఠశాలల విలీనం విధానాన్ని ఆపివేసి, ప్రాథమిక విద్య 5వ తరగతి వరకు ఉన్న ఊరిలోనే చదువుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. కొత్త విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల్లోనే 3వ తరగతి కొనసాగేందుకు వెంటనే ఆదేశాలు ఇవ్వాలి. ప్రాథమిక స్థాయిలో టీటీసీ స్థాయి ఉపాధ్యాయులే బోధించేలా, స్కూల్ అసిస్టెంట్ బోధన పీరియడ్లు వారానికి 32 గరిష్ఠంగా ఉండేలా, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,3,5 కిలోమీటర్ల పరిధిలో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలి. రేషనలైజేషన్ విధానాన్ని కూడా సమీక్షించాలి. గతంలాగా ఉన్నత పాఠశాలల్లో పనివేళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4:30 వరకు ఉండేలా మార్పు చేయాలి. ఈ చర్యలన్నీ అమలు అయితే ప్రాథమిక, ఉన్నత విద్య గాడిన పడుతుంది.

– సివి ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఏపీటీఎఫ్

విశ్వవిద్యాలయాల్లో తక్షణ ప్రక్షాళన అవసరం

ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం అధోగతిపాలయింది. ఉన్నత విద్యామండలి మితిమీరిన ప్రమేయంతో విశ్వవిద్యాలయాలన్నీ పతనావస్థలోకి చేరిపోయాయి. ప్రవేశాల నుంచి బోధన, పరిశోధనల వరకు అన్ని స్థాయిల్లోను వెనుకబడిపోయాయి. జాతీయస్థాయిలో గర్వించదగ్గ ర్యాంకులు రాకపోగా అప్పటివరకు వున్న స్థాయిలు సైతం దిగజారిపోయాయి. కేంద్రప్రభుత్వం నుంచి విడుదలైన రూసా నిధులను రాష్ట్ర విశ్వవిద్యాలయాలు తమ ఇష్టానుసారం వాడేశాయి. ఉన్నత విద్యామండలి అధికారులు డిగ్రీ, పీజీ తదితర అన్ని ప్రవేశాలను కష్టతరంగా మార్చేశారు. ఫీజుల నిర్ణయాన్ని పేదలకు మరింత భారంగా మార్చేశారు. ఉపకార వేతనాలతో చదువులు సాగించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల పరిస్థితి మరింత అధ్వానంగా మారిపోయింది. విశ్వవిద్యాలయాల పాలకమండళ్ల నియామకాల్లోను కనీస అర్హతలు లేనివారిని నియమించారు. దీంతో వర్శిటీ ఉపకులపతులు ఆడింది ఆట, పాడింది పాటగా ఐదేళ్ళూ సాగిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ మంత్రికి ప్రాధాన్యత ఏమీ లేకపోయింది. ఆ శాఖను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి మొత్తంగా గుత్తకు తీసుకొని నిర్వహించారు. అన్ని విశ్వవిద్యాలయాల పాలక మండళ్లలో ఆయన ఎక్స్‌అఫీషియో సభ్యుడు కావడంతో ఉపకులపతుల్ని పార్టీ కార్యకర్తలుగా మార్చేశారనే ప్రచారం జరిగింది. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతుల చేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను నిర్మింపజేశారు. చివరికి చరిత్ర కలిగిన విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును కూడా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చేసి దురభిమానాన్ని చాటుకున్నారు. ఇలాంటి ఘటనలన్నీ గత వైసీపీ ప్రభుత్వం విద్యారంగం మీద నిర్లక్ష్య వైఖరి వహించిందని తేటతెల్లం చేశాయి. అంతేగాక బ్యాంకుల్లో విశ్వవిద్యాలయాల కార్పస్‌ఫండ్ బాండ్లను సైతం ఖర్చు చేసేశారు. వర్శిటీ భవనాలు, స్థలాలు కూడా వివిధ రూపాల్లో అన్యాక్రాంతమైపోయాయి.

వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో చేపట్టిన అడ్డగోలు నియామకాలు విద్యావేత్తలను, అధికారులను ఆశ్చర్యపరిచాయి. స్వయంగా ముఖ్యమంత్రి అండదండలతో యూజీసీ నిబంధనలకు, డాక్టర్ అంబేద్కర్ మిషన్ లక్ష్యాలకు భిన్నంగా రెండేళ్ళ కిందట ఆంధ్రా యూనివర్శిటీ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఉద్యోగంలో క్రైస్తవ మిషనరీలకు చెందిన వ్యక్తిని నియమించారు. ఈయన కోసం విద్య, అనుభవ అర్హతల్నీ మార్చేసి కంప్యూటర్ సైన్స్ విభాగంలో పిహెచ్.డి చేసిన వ్యక్తిని సామాజికశాస్త్రాల సంబంధిత ఉద్యోగంలో నియమించారు. అంతకు ముందే ఈ జేమ్స్ స్టీఫెన్‌ని ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యునిగా నియమించారు. ఉద్యోగంలో చేరి ఏడాది కూడా గడవకుండానే సీనియర్ ప్రొఫెసర్లను పక్కనపెట్టి ఇదే స్టీఫెన్‌ని అప్పటి ఉపకులపతి ప్రసాదరెడ్డి... వర్శిటీకి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఆంధ్రప్రదేశ్ యూనివర్శిటీల చరిత్రలో ఈ ఘట్టం చాలా అరుదైనది. అలాగే కృష్ణా విశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకుల్ని ఉన్నతాధికారులు లంచం తీసుకొని బదిలీ చేశారు.

రాష్ట్ర విభజన వివాదాల్లో చిక్కుకుపోయిన డాక్టర్ అంబేద్కర్ సారస్వత విశ్వవిద్యాలయం, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీల సమస్య పరిష్కారానికి, ఆస్తుల వాటాల సాధనకు గత ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదు. తెలుగు విశ్వవిద్యాలయం బొమ్మూరు ప్రాంగణం భూమి రోజురోజుకి తరిగిపోయింది. ఈ ఉమ్మడి సంస్థల వివాదాలు న్యాయస్థానాల్లో అపరిష్కృతంగానే మిగిలిపోయాయి. తెలుగు అకాడమీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేసి లక్ష్మీపార్వతితో గత ప్రభుత్వం ఐదేళ్ళూ కాలం గడిపేసింది. విశ్వవిద్యాలయాల్లో కాలానికి తగిన కొత్త కోర్సులు ప్రవేశపెట్టకపోగా, మనుగడలో వున్న కొన్ని కోర్సులు మూసేశారు. ప్రతిష్ఠాత్మక చరిత్ర కలిగిన ఎయిడెడ్ వ్యవస్థను నాశనం చేసి అక్కడి అధ్యాపకుల్ని వైసీపీ ప్రభుత్వం విలీనం చేసుకుంది. వీరినే తిరిగి ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు బోధకులుగా డిప్యుటేషన్ మీద నియమించుకుంది. వీరిలో చాలామంది తెలుగు మాధ్యమంలో బోధనకు అలవాటుపడినవారే. పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయాలి. ఈ ప్రాథమిక అంశాన్ని కూడా పక్కనబెట్టి కేవలం నాక్ కమిటీకి అధ్యాపకుల లెక్కలు చూపించడం కోసం, యూజీసీని మోసం చేయడం కోసం వర్శిటీ పాలకులు తప్పుల మీద తప్పులు చేశారు.


ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ప్రసాదరెడ్డి 2020–21 విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఏడాదికి 600 మందికి పైగా ప్రవేశాలు కల్పించారు. పన్నెండు సెక్షన్లు నడుపుతున్నారు. దామాషా సంఖ్యలో అధ్యాపకులు లేరు. ఏఐసీటీఈ అనుమతుల్లేవు. ఐనా ప్రమాణాలకు పాతరవేసి ప్రజల్ని మోసగించారు. ఇటువంటి అక్రమ విద్యావ్యాపారానికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి పూర్తి మద్దతుగా నిలిచారు. ఈ క్రమంలో ఆర్థిక దోపిడీ, అవినీతి భారీఎత్తునే జరిగినట్టు కొత్త ప్రభుత్వం ముందు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ లోసుగులన్నింటికీ గత ప్రభుత్వం మద్దతు పలికింది. ఏయూ ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్ పరిస్థితి అదే. మాతృవిభాగంతో సంబంధం లేదు. బోధనాసిబ్బంది అంతా ఉద్యోగవిరమణ చేసినవారే. విశ్వవిద్యాలయాల చట్టాలను, యూజీసీ, ఏఐసీటీ, ఎన్‌సీటీఈ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చి విశ్వవిద్యాలయాల్ని నడిపించారు. విశ్వవిద్యాలయాల్లో పదవీ విరమణ పొందిన ఆచార్యులను హానరరీ ప్రొఫెసర్లగా నియమించి, గెస్ట్ ఫ్యాకల్టీలను తొలగించారు. ఉపకులపతులు తమకు ఇష్టమైన వ్యక్తులను వేరే విశ్వవిద్యాలయాల నుంచి డిప్యుటేషన్ మీద తెచ్చుకున్నారు. ఎడ్జంట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ ఇన్ ప్రాక్టీస్ నియామకాల్లో ఉపకులపతులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. కనీసం యూనివర్శిటీ వెబ్‌సైట్లలో కూడా ప్రకటనలు విడుదల చేయలేదు. సామాజిక న్యాయాన్ని, ప్రతిభాప్రమాణాల్నీ పాటించకుండా తమ బంధువుల్ని, తమ సామాజికవర్గానికి చెందినవారిని, రాజకీయ సంబంధాలు కలిగిన వారిని నియమించుకున్నారు. ఉపకులపతులు ఓఎస్డీల నియామకంలోనూ అదే తంతును పాటించారు. ద్రవిడ విశ్వవిద్యాలయంలో నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు అధ్యాపకులుగా ప్రమోషన్ ఇచ్చారు.

> విశ్వవిద్యాలయాల్ని రాజకీయ కేంద్రాలుగా మార్చిన గత ప్రభుత్వం వాటి స్వతంత్రప్రతిపత్తిని పక్కనబెట్టి విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల సంస్థకు పనులు అప్పగించి అసంపూర్తిగా మిగిల్చేసింది. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టకుండా తాత్సారం చేసి ఎన్నికల ముందు తప్పులతడకలతో ప్రకటన విడుదల చేసింది. దీనిని ఉన్నత న్యాయస్థానం నిలిపేసింది. ఇన్ని అవలక్షణాలకు ఆలవాలంగా మారిన విశ్వవిద్యాలయాలకు తక్షణ ప్రక్షాళన అవసరమని మేధోవర్గం భావిస్తున్నది.



కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల సామర్థ్యాలు, మౌలిక సదుపాయాలు పెంచడం కోసం ప్రత్యేకంగా కేటాయించిన రూసా నిధుల వినియోగ లక్ష్యాలను మార్చేసి కమీషన్లు దండుకున్నారు. కొన్ని విశ్వవిద్యాలయాలు ప్రాజెక్టు పూర్తి వివరాలను సమర్పించలేక నిధులు మురగబెట్టేశాయి. మరికొన్ని విశ్వవిద్యాలయాలు పనులు సగంలో నిలిపేశాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం మరో అడుగుముందుకేసి రూ. కోటికి పైగా సొమ్ము చెల్లించి సేవలు పొందింది. విశ్వవిద్యాలయాల్ని రాజకీయ కేంద్రాలుగా మార్చిన గత ప్రభుత్వం వాటి స్వతంత్రప్రతిపత్తిని పక్కనబెట్టి విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల సంస్థకు ఈ పనులు అప్పగించి అసంపూర్తిగా మిగిల్చేసింది. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టకుండా తాత్సారం చేసి ఎన్నికల ముందు తప్పులతడకలతో ప్రకటన విడుదల చేసింది. దీనిని ఉన్నత న్యాయస్థానం నిలిపేసింది. ఇన్ని అవలక్షణాలకు ఆలవాలంగా మారిన విశ్వవిద్యాలయాలకు తక్షణ ప్రక్షాళన అవసరమని మేధోవర్గం భావిస్తున్నది. చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వీటన్నింటిని వేగంగా చక్కదిద్ది యువతకు మంచి భవితను అందిస్తుందని ఏపీ ప్రజలు విశ్వసిస్తున్నారు.

◆ డాక్టర్ జీకేడీ ప్రసాద్







బందరుకు మహార్దశ!


5వేల ఎకరాల్లో బీపీసీఎల్ రిఫైనరీ

రూ.70 వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు

- 12 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యం
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

ఉమ్మడి కృష్ణాజిల్లా కేంద్రమైన, పురాతన చరిత్ర కలిగిన మచిలీపట్నం దశ తిరగనుంది. సిటీకి మరో భారీ పరిశ్రమ వస్తోంది. ఆయిల్ శుద్ధి కర్మాగారమైన భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) రిఫైనరీ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. సంస్థ సీఎండీ కృష్ణకుమార్, ఫైనాన్స్ డైరెక్టర్ గుప్తా, రిఫైనరీ హెడ్ రవి తేజతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రూ.70వేల కోట్లతో 5వేల ఎకరాల్లో రిఫైనరీ ఏర్పాటుకు ప్రాథమికంగా ఆమోదముద్ర పడింది. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఫీజిబిలిటీ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని బీపీసీఎల్ అధికారులు వెల్లడించారు.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ఓవైపు బందరు పోర్టు.. మరోవైపు బీపీసీఎల్ రిఫైనరీతో మచిలీపట్నానికి మహర్దశ పట్టనుంది. రిఫైనరీతో సుమారు 10వేల మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి లభించనుంది. దీంతోపాటు రిఫైనరీ అనుబంధ కార్యకలాపాలతో కొన్ని వేల మందికి ఉపాధి లభించనుంది. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ఏడాదికి 12 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో మచిలీపట్నం రిఫైనరీని ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. దీనికోసం సుమారు రూ.70 వేల కోట్ల వరకు బీపీసీఎల్ వ్యయం చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 5వేల ఎకరాల భూమిని రిఫైనరీ కోసం కేటాయించనుంది. బందరు పోర్టుకు తవిసపూడి, గోపువానిపాలెం, కరగ్రహారం, గిలకదిండి, చిలకలపూడి ప్రాంతాల్లో సుమారు 2వేల ఎకరాలు సేకరించారు. పోలాటితిప్ప, పల్లెతుమ్మలపాలెంలో సుమారు 7వేల ఎకరాల్లో సాల్ట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నాయి. మరో 7వేల ఎకరాలు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఇక్కడ రిఫైనరీకి భూములు కేటాయించే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. ఫీజిబిలిటీ రిపోర్టు అందిన వెంటనే భూకేటాయింపులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ రిఫైనరీని నాలుగేళ్లలో పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు (ఫైల్)


పోర్టు పనులూ గాడిన పడితే..

బందరు పోర్టు నిర్మాణాన్ని 2019, ఫిబ్రవరి 7న అప్పటి సీఎం చంద్రబాబు తపసిపూడి వద్ద శంకుస్థాపన చేసి ప్రారంభించారు. నవయుగ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో వైసీపీ అధికారంలోకి రావడంతో బందరు పోర్టు పనులు అటకెక్కాయి. గద్దె దిగే ముందు వైసీపీ ప్రభుత్వం నిర్మాణ వ్యయాన్ని అమాంతం పెంచేసి నిర్మాణ బాధ్యతలను మెఘా సంస్థకు అప్పగించింది. దీంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగడం మొదలైంది. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో పోర్టు పనులపై దృష్టి సారిస్తోంది. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యల దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పోర్టు పనులు కూడా గాడిన పడితే మచిలీపట్నానికి ఇక తిరుగుండదు.

బందరువాసుల కల నిజమవుతోంది

ఏపీ విభజన చట్టంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు ఇటీవల కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం ప్రతిపాదనపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి సానుకూలంగా స్పందించారు. యూపీ, గుజరాత్ రాష్ట్రాలు పోటీకి వచ్చినా మన రాష్ట్రం వైపే బీపీసీఎల్ మొగ్గుచూపేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహకారంతో మచిలీపట్నంలో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు జరగడం ఖాయం. బందరువాసుల కలను సాకారం చేయడంలో నా వంతు బాధ్యత నెరవేర్చాను. బందరు పోర్టు, రిఫైనరీ ఏర్పాటుతో మచిలీపట్నం దశ తిరుగుతుందనడంలో సందేహం లేదు.

- బాలశౌరి, మచిలీపట్నం ఎంపీ



దిగువకు ప్రవహిస్తున్న పట్టిసీమ నీరు (ఇన్‌సెట్‌లో) బ్యారేజీ వద్ద నదీమతల్లికి చీర, పూలు సమర్పిస్తున్న మంత్రులు

జలజలా..

కాల్వలకు పట్టిసీమ జలాలు విడుదల

- తూర్పు కాల్వకు 1500, పశ్చిమ కాల్వకు 1000 క్యూసెక్కులు
- మొత్తం తాగునీటి అవసరాలకే..
- ప్రకాశం బ్యారేజీ వద్ద పండుగ వాతావరణం
- నీటి విడుదలలో పాల్గొన్న ముగ్గురు మంత్రులు

కృష్ణా-గోదావరి పరుగులు పెట్టాయి.. కాల్వలు కళకళలాడాయి.. రైతుల మోముల్లో ఆశలు చిగురించాయి.. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కాల్వలకు నీటి విడుదల కార్యక్రమం బుధవారం కనులపండువగా జరిగింది. పట్టిసీమ, తాతపూడి నుంచి వచ్చిన గోదావరి నీరు ప్రకాశం బ్యారేజీ వద్దకు చేరడంతో దిగువకు వదిలారు.

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టిసీమ, తాతపూడి ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న గోదావరి నీటిని బుధవారం కాల్వలకు విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజీ వద్ద తూర్పు ప్రధాన కాల్వ లాక్ స్విచ్ ఆన్ చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు నీటిని దిగువకు వదిలారు. తూర్పు కాల్వలకు 1500, పశ్చిమ కాల్వలకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

తాతపూడిని కృష్ణాకే ఇస్తున్నాం : నిమ్మల రామానాయుడు, జలవనరుల శాఖ మంత్రి

'కృష్ణానదికి గోదావరి నీటిని పట్టిసీమ ద్వారానే కాకుండా తాతపూడి నుంచి ఇస్తున్నాం. తమకు ఇప్పట్లో నీరు అవసరం లేదని ఆ ప్రాంత రైతులు చెప్పడంతో తాతపూడి ఎత్తిపోతల పథకం నుంచి 500-600 క్యూసెక్కుల నీటిని కృష్ణానదికి తరలిస్తున్నాం. జలవనరుల శాఖ ద్వారా ఆదాయాన్ని సృష్టించవచ్చు. ప్రస్తుతం ఉన్న ఆయకట్టుతో పాటు కొత్త ఆయకట్టును సాగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాం. గోదావరి నీటిని తరలించడం ద్వారా

- మిగతా 6లో



మృతుడి కుమారులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

మరో కార్మికుడి మృతి

- అల్ట్రాటెక్ ప్రమాదంలో రెండుకు చేరిన మృతుల సంఖ్య
- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల చెక్కు అందజేత



బాణావత్ స్వామి (ఫైల్)

జగ్గయ్యపేట రూరల్, జూలై 10 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగార ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు బాణావత్ స్వామి (27) మంగళవారం రాత్రి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఆర్డీవో రవీంద్ర, తహసీల్దార్ బుధవారం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుమారులకు రూ.50 లక్షల చెక్కు అందించారు. కాగా, ఈ ప్రమాదంలో గాయపడిన మరో నలుగురి పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది.

కూలి చేసుకుంటూ..

బాణావత్ స్వామికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కూలిపని చేసుకుని జీవిస్తున్నాడు. గ్రామంలో సిమెంట్ కర్మాగారం ఏర్పాటు చేయటంతో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బతికి వస్తాడని ఆశగా ఎదురుచూసిన ఆ కుటుంబ స్వామి మరణంతో హృదయవిదారకంగా విలపించింది. చిన్న వయసులో తండ్రిని కోల్పోయిన చిన్నారులు నాగేశ్వరరావు, లక్యా అమాయకంగా అలాగే నిలబడిపోయారు. అంతిమయాత్రలో గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జీవనాధారాన్ని కోల్పోయాం : మృతుడి భార్య

'నా ఇద్దరు పిల్లలు, నేను నా భర్తపైనే ఆధారపడి ఉన్నాం. సిమెంట్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నా భర్త తిరిగి వస్తాడని ఎంతో ఎదురుచూశాం. ఇద్దరు చిన్నారులతో మా జీవనం ఎలా సాగుతుందో..' అని స్వామి భార్య శైలజ ఆవేదన వ్యక్తం చేశారు.

పీఠముడి

నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎవరు..?

- టీడీపీలో కొనసాగుతున్న ఉత్కంఠ
- పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో కౌన్సిలర్లు
- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య నిర్ణయమే ఫైనల్

నందిగామ మున్సిపల్ పీఠం ఎవరికి దక్కుతుంది..? ఎవరి మద్దతు ఎవరికి ఉంది..? అనే అంశంపై టీడీపీలో ఉత్కంఠ నెలకొంది. ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారుండగా, నిర్ణయాధికారి అయిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఎవరికి పట్టం కడతారోనన్న చర్చ జరుగుతోంది.



నందిగామలో కౌన్సిలర్లతో సమావేశమైన ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ : 20 వార్డులున్న నందిగామ మున్సిపాలిటీలో మొదట్లో టీడీపీ బలం ఆరుకే పరిమితమైంది. ఆ తర్వాత ఆరో వార్డు కౌన్సిలర్ యాకూబ్ ఆలీ వైసీపీలో చేరడంతో ఐదుకు తగ్గింది. చైర్‌పర్సన్ పీఠం జనరల్ మహిళకు కేటాయించడంతో వైసీపీ తరఫున మండవ వరలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా మాడుగుల నాగరత్నం ఎన్నికయ్యారు. ఆ తర్వాత కొంతకాలానికి వారిద్దరూ కన్నుమూశారు. ఇప్పుడు ఈ రెండు ఎన్నికలకు ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, వైసీపీకి చెందిన ఓర్సు లక్ష్మిని ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమించారు. ఈ దశలో సాధారణ ఎన్నికలు రావడం, టీడీపీ తరఫున తంగిరాల సౌమ్య ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలవడం జరిగాయి. అలాగే, ఎన్నికల సమయంలో ముగ్గురు, తర్వాత మరో ఇద్దరు కౌన్సిలర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. దీంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు, జనసేనకు ఉన్న ఒక సభ్యుడి ఓటు కూడా తోడవడంతో టీడీపీకి బలం పెరిగింది. ఖాళీగా ఉన్న 7, 11 వార్డుల ఎన్నికలు జరగ్గానే, పీఠంపై టీడీపీ సభ్యురాలిని కూర్చోబెట్టాలని ఆ పార్టీ తహతహలాడుతోంది. ఇప్పటికే సరిపడా మెజారిటీ ఉండటంతో చైర్‌పర్సన్ ఎన్నిక లాంఛనం కానుంది.

ఆశావహుల్లో ఉత్కంఠ

నందిగామ చైరపర్సన్ పదవి కోసం టీడీపీ తరఫున గెలిచిన ఐదుగురిలో నలుగురు పోటీ పడుతున్నారు. 8వ వార్డు నుంచి శాఖమూరి స్వర్ణలత, 5వ వార్డు నుంచి ఏచూరి లక్ష్మి, 10వ వార్డు నుంచి మండవ కృష్ణకుమారి, 14వ వార్డు నుంచి కామసాని సత్యవతి పోటీ పడుతున్నారు. వారి మనోగతాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు తెలిపారు. వారివారి మద్దతుదారులతో సౌమ్యపై ఒత్తిడి తెస్తున్నారు. ఆశావహులు పార్టీ కీలక నేతలను కూడా ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎంపీ కేశినేని చిన్ని, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పార్టీ విజయవాడ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ను కలిసి మద్దతు అడుగుతున్నారు. ఒకరైతే ఏకంగా మంత్రి నారా లోకేశ్‌ను కలిసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలిసింది. అయితే, తమను కలిసే ఆశావహులకు సదరు నేతలు స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని తెలిసింది. చైర్‌పర్సన్ పీఠంపై నిర్ణయాధికారం ఎమ్మెల్యే సౌమ్యకే ఉందని, ఈ విషయంలో తామేమీ చేయలేమంటూ దాటవేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల్లో నందిగామ పట్టణంలో సౌమ్యకు ఎనిమిది వేల ఓట్ల భారీ ఆధిక్యం లభించింది. దీంతో పట్టణానికి సమర్థ నాయకత్వం అందించి రుణం తీర్చుకోవాలన్న ఆలోచనలో సౌమ్య ఉన్నారు. ప్రజాభిప్రాయాన్ని, పార్టీ పెద్దల ఆలోచనలు సమీకరించి నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. మరోవైపు వైసీపీలో మిగిలి ఉన్న ఏడుగురు సభ్యుల్లో ఐదుగురు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. అదే జరిగితే మున్సిపల్ కౌన్సిల్‌లో వైసీపీ ఉనికిలేకుండా పోతుంది.

అందరూ కలిసి పనిచేయండి : కేశినేని చిన్ని, ఎంపీ

చైర్‌పర్సన్‌గా ఎవరిని నియమించాలన్న విషయం ఎమ్మెల్యే సౌమ్య నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. రెండు రోజులుగా ఆశావహులు విజయవాడలో ఆయన్ను కలుస్తూ వచ్చారు. ఈ క్రమంలో బుధవారం నందిగామ వచ్చిన చిన్ని కౌన్సిలర్లతో మాట్లాడారు. చైర్‌పర్సన్ ఎంపిక నిర్ణయం పూర్తిగా సౌమ్యదేనని, ఆమె నిర్ణయం ప్రకారం అందరూ నడుచుకోవాలని సూచించారు.

మాదకద్రవ్యాలకు కట్టడి

యాంటీ నార్కోటిక్ సెల్ ఏర్పాటు

- ఏసీపీ పార్థసారథి సారథ్యంలో ప్రత్యేక టీమ్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మన్యం దాటి వస్తున్న గంజాయి, బెంగళూరు నుంచి బస్సుల్లో వస్తున్న ఎండీఎంఏ వంటి మాదకద్రవ్యాలకు చెక్ పెట్టడానికి పోలీస్ కమిషనరేట్ అధికారులు సిద్ధమయ్యారు. మాదకద్రవ్యాల మరకలను విజయవాడ పై నుంచి తుడిచేయడానికి కొత్తగా యాంటీ నార్కోటిక్ సెల్‌ను ఏర్పాటు చేశారు. పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఈ సెల్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తొలిసారిగా ఈ సెల్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు విజయవాడ పోలీస్ కమిషనర్‌గా వ్యవహరించిన సమయంలో ఇటువంటి సెల్ ఏర్పాటు చేయాలని భావించారు. ఈ విభాగానికి అధిపతిగా ఏసీపీ బి.పార్థసారథిని నియమించారు. ఇన్‌స్పెక్టర్లు ఐవీ నాగేంద్రకుమార్, రమేశ్‌కుమార్‌తో పాటు ఐదుగురు ఎస్ఐలను ఈ విభాగానికి కేటాయించారు. విజయవాడ తూర్పు, పశ్చిమ, రూరల్ మండలాలు ఉన్నాయి. ఈ యాంటీ నార్కోటిక్ సెల్‌కు అనుబంధంగా ఆయా మండలాల్లో ఒక ఎస్ఐ, సిబ్బందితో సబ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇంటెలిజెన్స్, ఆపరేషన్స్, డేటా ఎనాలిసిస్, అవేర్‌నెస్ క్రియేషన్ విభాగాలను అనుసంధానం చేశారు. మాదకద్రవ్యాల రవాణా, సరఫరాకు సంబంధించిన సమాచారం ఇవ్వడానికి 9121162475 టోల్‌ఫ్రీ నెంబరును కేటాయించారు. ntinarcoticcell@vza.appolice.gov.in ఈ-మెయిల్‌కు కూడా సమాచారం ఇవ్వొచ్చని పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు.



నేతల ఫొటోలతో కౌన్సిల్‌కు..

వీఎంసీ కౌన్సిల్ సమావేశానికి టీడీపీ కార్పొరేటర్లు బుధవారం రెట్టింపు ఉత్సాహంతో కదిలివచ్చారు. ఎన్నికల్లో గెలిచాక జరిగిన మొదటి సమావేశాలు కావడంతో తమ నాయకులు సీఎం చంద్రబాబు, పీఎం నరేంద్రమోదీ, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలతో కౌన్సిల్‌కు హాజరయ్యారు.



విజయ కాంప్లెక్సులో చెలరేగుతున్న మంటలు

విజయ కాంప్లెక్సులో అగ్నిప్రమాదం

బూడిదైన మూడు ఫ్యాన్సీ వస్తువుల గోడౌన్లు

- దెబ్బతిన్న మరో నాలుగు గోడౌన్లు
- రూ.40 లక్షల మేర ఆస్తినష్టం
- షార్ట్ సర్క్యూట్ వల్లేనని ప్రాథమిక అంచనా



వన్‌టౌన్, జూలై 10 : వన్‌టౌన్‌లోని చిట్టూరి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న విజయ కాంప్లెక్సులోని ఫ్యాన్సీ వస్తువుల గోడౌన్లలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు గోడౌన్లు మంటలకు ఆహుతయ్యాయి. మరో నాలుగు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ గోడౌన్లలో అగ్నికి సులభంగా ఆహుతయ్యే వస్తువులు ఉండటంతో ఒక్కసారిగా మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. కిక్కిరిసిన ఈ ప్రదేశంలో అగ్ని ప్రమాదం జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్లాస్టిక్ సామాన్లు, ఫ్యాన్సీ వస్తువులు, విద్యుత్ లైట్ల షాపులు, గోడౌన్లు ఒకదానికొకటి ఆనుకుని ఉన్నాయి. వన్‌టౌన్‌కు చెందిన గౌతంచంద్.. కేబీఎన్ కాంప్లెక్స్ ఎదురుగా మహవీర్ గిఫ్ట్ ఆర్టికల్స్ షాపును నిర్వహిస్తున్నాడు. ఇతనికి విజయ కాంప్లెక్సులో మూడు గోడౌన్లు ఉన్నాయి. అలాగే, మరో ఏడుగురు వ్యాపారులకు గోడౌన్లు ఉన్నాయి. ఇవన్నీ ఒకదానికొకటి ఆనుకుని ఉంటాయి. కాగా, గౌతంచంద్ వద్ద పనిచేసే వర్కర్ బుధవారం తన వెంట ఐదుగురు కస్టమర్లను తీసుకెళ్లి గోడౌన్లలో వస్తువులను చూపిస్తుండగా, ఒక్కసారిగా పొగ కమ్ముకుంది. వెంటనే వారంతా భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందని సంబంధిత అధికారులు ప్రాథమిక అభిప్రాయానికి వచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల ఆస్తి అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. వన్‌టౌన్ సీఐ దుర్గా ధనశేఖరరెడ్డి, ఎస్ఐలు శారద, సతీష్, రమ్య సంఘటన జరిగిన ప్రదేశానికి వచ్చి రద్దీని నియంత్రించారు.

మళ్లీ టెండర్

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పూర్తి చేసిన పనికి తాజాగా టెండర్లు

- మాజీ మంత్రి పేర్ని నాని అనుచరుడైన కాంట్రాక్టర్ ప్రయోజనం కోసం టెండర్లు
- గుడివాడ సబ్ డివిజిన్ ఈఈ కార్యాలయం సిబ్బంది నిర్వాకం
- వాస్తవాలు దాచి గప్‌చుప్‌గా టెండర్లు
- చోరంపూడిలో మైక్రో ఫిల్టర్ రిపేర్‌లో హై మెటీరియల్ కాస్ట్‌తో అవినీతి

6లో..



హుండీల కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మకు రూ.3.36 కోట్ల కానుకలు

వన్‌టౌన్, జూలై 10 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన కానుకల లెక్కింపు కార్యక్రమంలో 20 రోజులకుగాను రూ.3,36,59,796లు నగదు రూపేణా సమకూరింది. సగటున రోజుకు రూ.16,82,989ల మేరకు కానుకలు వచ్చినట్టు దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. బంగారం 436 గ్రాములు, వెండి 6.060 కిలోలు కానుకల రూపేణా సమకూరింది. యూఎస్ఏ డాలర్లు 1300, యూకే పౌండ్లు 85, ఆస్ట్రేలియా డాలర్లు 7, ఓమన్ రియాల్స్ 2.5, కెనడా డాలర్లు 80, యూఏఈ దిర్హమ్స్ 295, కువైట్ దినార్లు 6.25, ఖతార్ రియాల్స్ 8, సింగపూర్ డాలర్లు 12, సౌదీ రియాల్స్ 100, యూరప్ యూరోలు 10, మలేషియా రింగేట్స్ 118, న్యూజిలాండ్ డాలర్లు 70, థాయ్‌లాండ్ బట్స్ 80, బెహ్రెయిన్ దినార్లు 15.5 చొప్పున కానుకల రూపంలో వచ్చాయి. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా మరో రూ.1,91,787లు ఆదాయం సమకూరింది. కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈవో కేఎస్ రామారావు, దేవదాయశాఖ అధికారులు, దేవస్థానం అధికారులు, ఎస్పీఎఫ్, పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మ సేవలో దేవదాయ మంత్రి ఆనం

వన్‌టౌన్ : సీఎం చంద్రబాబుతో త్వరలో జరగనున్న సమీక్షా సమావేశంలో ఆలయాల ప్రగతికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ, మల్లేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల స్థితిగతులు, అభివృద్ధి పనులను గురించి రెండురోజుల క్రితం చర్చించామన్నారు. దీనిలో భాగంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన పనులను గురించి ఈవో రామారావు, ఇంజనీరింగ్ అధికారులు, అర్చకులు వివరించారన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యతాలోపం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించామన్నారు. ఆలయంలో అభివృద్ధి పనులపై త్వరలో జరగనున్న సీఎం సమీక్షా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పాలకవర్గాల విషయంలో కూడా ఒక నిర్ణయానికి రానున్నట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి పాలకవర్గం, అధికారులు, దేవస్థానం సిబ్బంది అందరూ సహకరించాలని కోరారు. తొలుత మంత్రికి ఈవో కేఎస్ రామారావు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం తదితరాలు అందజేశారు.



బీపీసీఎల్ సీఎండీ, బందరు ఎంపీ బృందానికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో

దుర్గమ్మను దర్శించిన బీపీసీఎల్ సీఎండీ, బందరు ఎంపీ

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరులను బుధవారం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సీఎండీ కృష్ణకుమార్, బందరు ఎంపీ బాలశౌరిల బృందం దర్శించుకుంది. వీరికి ఆలయ ఈవో కేఎస్ రామారావు, అర్చక బృందం సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం తదితరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను గురించి ఈవో రామారావు వారికి వివరించారు. అనంతరం బాలశౌరి విలేకరులతో మాట్లాడుతూ, బీపీసీఎల్ బృందం రాకను గురించి చెప్పారు.

ఎంపీ కేశినేని చిన్నితో..

భారతీనగర్ : బీపీసీఎల్ సీఎండీ కృష్ణకుమార్, ఫైనాన్స్ డైరెక్టర్ గుప్తా, రిఫైనరీ హెడ్ రవితేజలు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని బుధవారం నోవాటెల్ హోటల్‌లో కలిశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేయబోతున్న అభివృద్ధి పనులు, పారిశ్రామిక రంగానికి అందించబోయే చేయూత గురించి ప్రతినిధులకు వివరించారు. ఎంపీలు బాలశౌరి, ఉదయశ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



కొనకంచిలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న నేతలు

అన్నివర్గాల అభివృద్ధే కూటమి లక్ష్యం : నెట్టెం

పెనుగంచిప్రోలు, జూలై 10 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంటరీ టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పేర్కొన్నారు. దాత వితరణతో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం, చర్చి, ముస్లిం సోదరుల కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు నెట్టెం, కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)లు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో ఏ వర్గానికీ సరైన న్యాయం జరగలేదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు రహదారి సౌకర్యాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కసుకుర్తి దశరథ రామారావు, కాకుమాను అశోక్, సర్పంచ్‌లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 11న పద్మశాలీ సంఘ ఆత్మీయ సమావేశం

» రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఘంటసాల, జూలై 10 : రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆత్మీయ సమావేశం ఆగస్టు 11న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్టు కోస్తాంధ్ర పద్మశాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఘంటసాల గ్రామంలోని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె జగదీశ్ ఇంటి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సంఘం ఉండాలనే ఉద్దేశ్యంతో ఏపీ రాష్ట్ర పద్మశాలీ సంఘాన్ని నిర్మించామని, ఆగస్టు 11న జరిగే రాష్ట్రస్థాయి సమావేశానికి పద్మశాలీలందరూ హాజరుకావాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అందె జగదీశ్ మాట్లాడుతూ, పద్మశాలీలు ఎక్కువగా చేనేత వృత్తిపై ఆధారపడి ఉన్నారని, గత వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.24 వేలు వేశామని గొప్పలు చెప్పుకుందని, రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలు, కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల అవసరాలు, స్థితిగతులు పరిశీలించి నూలు సబ్సిడీ, మార్కెటింగ్, థ్రిఫ్ట్ ఫండ్, డిస్కౌంట్స్, బీమా పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. చేనేత ఉత్పత్తులపై 18 శాతం జీఎస్టీని ఎత్తివేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు అక్కల లీలా ప్రసాద్, చేనేత సెల్ కార్య నిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ టెండర్



తుమ్మలచెరువులో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్, ప్లాట్ ఫామ్

ప్రభుత్వం మారినా అధికారులు వైసీపీ నాయకుల అడుగుజాడల్లోనే నడుస్తూ వారికి ప్రయోజనం కల్పించే పనులు చేస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని అనుచరుడైన ఓ కాంట్రాక్టర్‌కు కాసులు కురిపించేందుకు గతంలో పూర్తి చేసిన పనికి కొత్తగా టెండర్ పిలిచారు. అడ్డగోలుగా నిబంధనలను కాలరాశారు. ఎప్పుడో పూర్తి చేసిన పనికి తాజాగా టెండర్లు పిలిచి మాజీ మంత్రి అనుచరుడికి ప్రయోజనం కల్పించేందుకు గుట్టుచప్పుడు కాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్కెచ్ వేశారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మచిలీపట్నం మండలం తుమ్మలచెరువు గ్రామంలో మైక్రో ఫిల్టర్, ప్లాట్‌ఫామ్ పనులు వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి పేర్ని నాని అనుచరుడికి కట్టబెట్టారు. కిందటి జనవరి నెలలోనే పనులు పూర్తయ్యాయి. నామినేషన్ విధానంలో కట్టబెడితే పనులు పూర్తవగానే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు చెల్లింపులు చేశారో లేదో కూడా తెలియదు. చేశారనే ఆర్‌డబ్ల్యూఎస్‌లో ప్రచారం జరుగుతోంది. అసలు నామినేషన్ విధానంలోనే ఈ పని అప్పగించలేదని.. ముందు పనులు చేపడితే తర్వాత నామినేషన్‌పై అప్పగించినట్టుగా బిల్లులు డ్రా చేసుకోవచ్చని వైసీపీ నేతలు భావించారు. అయితే నిబంధనల ప్రకారం ఈ పనిని నామినేషన్ విధానంలో చూపటానికి కూడా అవకాశం లేకుండా పోయిందని తెలుస్తోంది. ఈ పనులకు సంబంధించి వైసీపీ అనుచరుడు పెట్టిన ఖర్చును రాబట్టుకునేందుకు గతంలో దాతల సహాయం తీసుకున్నట్టుగా కూడా తెలుస్తోంది. కానీ, అప్పటి పనికి బిల్లు చెల్లించేందుకు ఘనత వహించిన గుడివాడ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయంలోని కొంతమంది సిబ్బంది స్కెచ్ వేశారు. కృష్ణాజిల్లాకు గుడివాడ డివిజన్ ఈఈ జిల్లా అధికారిగా వ్యవహరిస్తున్నందున.. ఇక్కడి కార్యాలయ సిబ్బంది చక్రం తిప్పారు. కొత్తగా వచ్చిన ఈఈకి విషయం తెలియకపోవటంతో ఆయన్ను తప్పుదారి పట్టించి తాజాగా టెండరు నోటిఫికేషన్ వేయించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా గతంలో చేసిన పనిని రికార్డు చేసి మాజీ మంత్రి అనుచరుడికి బిల్లు చెల్లించేందుకు స్కెచ్ వేశారు. చేసిన పనికి ఇప్పుడు టెండర్లు పిలవటం అన్నది నిబంధనలకు విరుద్ధం.

గుడివాడ డివిజన్ ఈఈ కార్యాలయం హస్తం

ఈ వ్యవహారంలో గుడివాడ డివిజన్ ఈఈ కార్యాలయంలోని అకౌంట్స్ సెక్షన్‌లోని మొవ్వా శివాజీ, డివిజనల్ అక్కౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) నరేంద్రకుమార్ హస్తం ఉన్నట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. వీరిద్దరూ కాంట్రాక్టర్లను తీవ్రంగా బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టుగా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు అందాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విషయంలో కూడా వారి నుంచి భారీఎత్తున లంచాలు డిమాండ్ చేస్తున్నారు. లంచాలు ఇవ్వకపోతే బిల్లులను ఈఈ దగ్గరకు పంపరు. ఆఫీసు ఎస్టాబ్లిష్‌మెంట్స్ అంశాల్లో కూడా పైసలు పడనిదే వీరు పనిచేయరన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. బందరు డివిజన్ పరిధిలో డీఈఈ నటరాజు, ఏఈ నాగరాజులపై ఇప్పటికే పీకల్లోతు ఆరోపణలు ఉన్నాయి. గతంలో చేసిన పనికి ఇప్పుడు టెండర్లు పిలిచే వ్యవహారంలో వీరిద్దరి నుంచి కూడా భరోసా రావటంతోనే.. గప్‌చుప్‌గా టెండర్లు పిలిచినట్టుగా తెలుస్తోంది.

అవినీతి మత్తులో ఆర్‌డబ్ల్యూఎస్

మొత్తంగా కృష్ణాజిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం అవినీతి మత్తులో జోగుతోంది. బంటుమిల్లి మండలం చోరంపూడిలో 0.5 ఎంఎల్‌డీ మైక్రో ఫిల్టర్ మరమ్మతు పనుల్లో కూడా పెద్దఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఫిర్యాదులు వచ్చాయి. మరమ్మతుల కోసం 500 - 600 కేజీల కార్బన్, 2 టన్నుల ఇసుకను వాడాలి. దీనికి విరుద్ధంగా 1200 కేజీల కార్బన్ వాడినట్టుగా చూపారు. అది కూడా స్టాండర్డ్ షెడ్యూల్ రేట్లు (ఎస్ఎస్ఆర్) ప్రకారం కాకుండా ఎక్కువ ధరను నమోదు చేశారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల ఏఈ బాధ్యతలు చూస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నాగేశ్వరరావు పాత్ర ఉందని ఈఈకి ఫిర్యాదు వెళ్లింది. దీంతో ఆయనకు అనుమానం వచ్చి ఆ పనికి సంబంధించిన వివరాలు తెప్పించి పరిశీలించగా.. అసలు బాగోతం బయట పడింది. ఈ ఏఈ డబ్బులేనిదే పనిచేయరన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగి ఫోన్‌పే చెక్ చేస్తే వందల వ్యవహారాలు బయట పడతాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వీటి మీద ఈఈ దృష్టి సారించినట్టుగా తెలుస్తోంది.

జలజలా..

(5వ పేజీ తరువాయి)

13 లక్షల ఎకరాలకు సాగునీరు, 30-40 లక్షల మందికి తాగునీరు అందించవచ్చు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యం చేసిన పట్టిసీమ, తాతపూడి, పుష్కర ఎత్తిపోతల పథకాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నాం. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో 7.38 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తాం. 11 నియోజకవర్గాల్లోని చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీరుస్తాం. కాల్వలు, డ్రెయిన్లలో ఉన్న పూడికతీత, గుర్రపుడెక్క, తూటికాడను తొలగించడానికి యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నాం.' అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

ముందు గొంతులు తడుపుతాం : కొల్లు రవీంద్ర

'ప్రస్తుతం డెల్టా ప్రాంత ప్రజలు తాగునీటి సమస్యతో బాధపడుతున్నారు. ఎండుతున్న గొంతులను ముందుగా తడుపుతాం. వారికి తాగునీటిని అందించడానికి తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు నీటిని విడుదల చేశాం. గతంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని హేళన చేశారు. ఆ పథకంతో ఎంత ప్రయోజనం జరుగుతుందో ప్రజలు చూస్తున్నారు. ప్రతి ఎకరాకు నీటిని అందజేయడానికి కృషి చేస్తాం.' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

సాగునీటి రంగాన్ని వైసీపీ నిర్లక్ష్యం చేసింది : సారథి

'వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో తీవ్రమైన నష్టం వాటిల్లింది. చిన్నపాటి వర్షాలకు పంటలు నీటమునిగి నష్టం వాటిల్లే పరిస్థితి వచ్చింది. వ్యవసాయ రంగానికి సాగునీటి కాల్వలతో పాటు డ్రెయిన్లు చాలా ముఖ్యం. వాటిలో పూడిక తీయకపోవడంతో డెల్టా ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పెడన, అవనిగడ్డ, బందరు ప్రాంత రైతులు ఎదుర్కొంటున్నారు. నూజివీడు, మైలవరం, తిరువూరు వంటి మెట్టప్రాంతాలకు చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన ఆధారం. చంద్రబాబు దీనికి రూ.4వేల కోట్లు ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వం రూ.50 కోట్లు ఖర్చు చేయలేదు. 2.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేయడంతో పంట భూములు బీళ్లుగా మారాయి.' అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు.

నీటి నిల్వలు పెరుగుతున్నాయి : కేశినేని చిన్ని

'గోదావరి జలాలు రావడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద నీటి నిల్వలు పెరుగుతున్నాయి. పట్టిసీమ ద్వారా 6018 క్యూసెక్కుల నీరు వస్తోంది. నీరు లేకపోవడంతో డెల్టా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం మూడు టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. సాగుకు డెల్టా రైతులు సిద్ధంగా ఉన్నారు.' అని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కలెక్టర్ జి.సృజన, ఎమ్మెల్యేలు కాగిత కృష్ణప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, బొండా ఉమామహేశ్వరరావు, జలవనరుల శాఖ సలహాదారుడు ఎం.వెంకటేశ్వరరావు, చీఫ్ ఇంజనీర్ సి.నారాయణరెడ్డి, ఎస్ఈ టీజేహెచ్ ప్రసాద్‌బాబు, కృష్ణా సెంట్రల్ డివిజన్ ఈఈ పీఆర్ కృష్ణారావు, సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మ సేవలో కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిటీ చైర్మన్

వన్‌టౌన్, జూలై 10: సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి, ప్రస్తుత తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ దంపతులు బుధవారం ఇంద్రకీలాద్రిపైనున్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రదోష సమయంలో అమ్మవారికి నిర్వహించిన పంచహారతుల్లో వారు పాల్గొన్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఈవో రామారావు పూలమాల సమర్పించి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గామల్లేశ్వరులను దర్శించుకున్న అనంతరం చంద్రఘోష్ దంపతులకు ఏఈవో రమేష్‌బాబు, ప్రధాన అర్చకుడు ఎల్‌డీ ప్రసాద్ దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. వేదపండితులు ఆశీస్సులు అందజేశారు.

4 లేబర్ చట్టాలను రద్దు చేయాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

గవర్నర్‌పేట, జూలై 10: కార్మికులకు అండగా ఉండే కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చి కొత్తచట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆలిండియా కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం లెనిన్ సెంటర్‌లో సీఐటీయూ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. కార్మికులు పెద్దఎత్తున పాల్గొని కేంద్రం తెచ్చిన 4 లేబర్ చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థలను కాపాడాలని నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ వెంకటేశ్వరరావు, సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు, వివిధ సంఘాల నేతలు కృష్ణయ్య, శాస్త్రి, సీతారాములు, బాబూరావు, సుబ్బారావు, ప్రభుదాస్, మురళీ, ఎం.హనుమంతరావు, ఎంవీ రమణ, సుందర రామరాజు, పున్నారావు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా గుట్టురట్టు

● నలుగురు పిల్లల్ని రక్షించిన ఆర్‌పీఎఫ్

రైల్వేస్టేషన్, జూలై 10: దక్షిణ మధ్య రైల్వేకు చెందిన బాపట్లలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ మానవ అక్రమ రవాణా నిరోధక బృందం నలుగురు పిల్లల్ని రక్షించి నలుగురు అనుమానితులను అరెస్టు చేసింది. ధన్‌బాద్-అలప్పుజా ఎక్స్‌ప్రెస్ మంగళవారం బాపట్ల స్టేషన్‌కు వచ్చినప్పుడు సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల నేతృత్వంలోని ఆర్‌పీఎఫ్ బృందానికి వచ్చిన సమాచారం మేరకు వెంటనే స్పందించి తనిఖీలు చేపట్టారు. రైలులోని 10నుంచి 14ఏళ్ల వయసున్న నలుగురు పిల్లల్ని పరిశీలించినప్పుడు వారికి ఎలాంటి డాక్యుమెంటేషన్ కానీ, పెద్దల పర్యవేక్షణ కానీ లేకపోవడాన్ని గమనించి మానవ అక్రమ రవాణా జరుగుతుందని ఊహించి ఆర్‌పీఎఫ్ సిబ్బంది వారిని రక్షించారు. అలాగే నలుగురు అనుమానితులను అరెస్టు చేశారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఆర్‌పీఎఫ్ బృందాన్ని అభినందించారు. తదుపరి చర్యలకు గుంటూరు రైల్వేస్టేషన్‌కు అప్పగించారు

ఆర్థికసాయంతో పేద విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

ఎంపీ కేశినేని శివనాథ్



విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు

భారతీనగర్, జూలై 10: పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం వారి భవిష్యత్తుకు పునాది వేయడమేనని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కనకదుర్గానగర్ ఆఫీసర్ కాలనీలోని ఫ్రైడ్ మాధవ హోటల్లో బెజవాడ కాకతీయ ఫ్రెండ్ సర్కిల్ వారి 131వ ఆత్మీయ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెజవాడ కాకతీయ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద విద్యార్థులైన వల్లూరి దివ్యచరిత, మల్లినేని పావని, కావ్యచౌదరి, వంగలపాటి రేష్మ, మువ్వా సుధాకర్‌కు కేశినేని శివనాథ్ చేతుల మీదగా చదువు నిమిత్తం ఆర్థికసాయంగా ఒక్కొక్కరికి రూ.20వేల చెక్కును అందజేశారు. బీకేఎఫ్‌సీ అధ్యక్షుడు చెన్నుపాటి సురేష్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, కొడాలి సుబ్బారావు, కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ నేతలు గద్దె ప్రసాద్, ధూళిపాళ్ల రమేష్ పాల్గొన్నారు.



జి.కొండూరులోని ఓ విత్తన షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

విత్తన, ఎరువుల షాపుల్లో తనిఖీలు

జి.కొండూరు, జూలై 10 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇంటర్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు బుధవారం జి.కొండూరులోని ఎరువులు, పురుగు మందుల, విత్తనషాపుల్లో తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఏడీఏ ఎస్.వెంకటేశ్వరరావు, నెల్లూరు పట్టణ స్టేషన్ హెచ్ కానిస్టేబుల్ (విజిలెన్స్) ఎస్.బాజీబాలచంద్రరావు, ఏవో ఆర్.వాసుదేవరావు, జి.కొండూరు ఏవో ఎం.రామ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అనుమతులు లేని కంపెనీల విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. నిబంధనలు తప్పక పాటించాలని ఆదేశించారు.

మైలవరంలో..

మైలవరం : మైలవరంలోని పలు ఎరువులు, పురుగు మందులు, విత్తన షాపుల్లో ప్రత్యేక తనిఖీ బృందం బుధవారం తనిఖీలు నిర్వహించింది. రిజిస్టర్లను, ఎరువులు, విత్తన నిల్వలను పరిశీలించారు. ప్రతి రోజు స్టాక్ బోర్డులో సరుకు నిల్వ వివరాలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, ఏవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వామి కుటుంబానికి ఎస్టీ కమిషన్ సభ్యుల పరామర్శ

జగ్గయ్యపేట, జూలై 10 : అల్ట్రాటెక్ సిమెంట్ ప్రమాదంలో మృతి చెందిన బాణావత్ స్వామి కుటుంబసభ్యులను ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ పరామర్శించారు. నష్ట పరిహారం చెక్కును నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, ఏసీపీ రవికిరణ్, తహసీల్దార్ శేషు తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం యాజమాన్యంపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని వి.శంకర్‌నాయక్‌ను ఆర్ అండ్ బీ బంగ్లాలో సీఐటీయూ నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఫ్యాక్టరీ తరఫున నష్టపరిహారం ప్రకటించారని, ప్రభుత్వం నుంచి పరిహారం ఇవ్వాలని కోరారు. నేతలు ఎస్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.రామనాథం, గౌసేమియా, బాలు పాల్గొన్నారు.



స్వామి కుటుంబసభ్యులకు పరిహారం చెక్కు అందజేస్తున్న శంకర్ నాయక్, ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ రవికిరణ్



ప్రెస్‌మీట్‌లో పత్రాలు చూపుతున్న కార్మిక సంఘాల నేతలు

అల్ట్రాటెక్ కారకులపై చర్యలేవీ

» కార్మిక సంఘాల నేతల డిమాండ్

ధర్నాచౌక్, జూలై 10 : అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై సమగ్రంగా దర్యాప్తు చేసి కారకులైన యాజమాన్య ప్రతినిధులను అరెస్టు చేయాలని పలు కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఫ్యాక్టరీ తనిఖీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి, తీవ్ర గాయాలైనవారికి రూ.50లక్షలు, స్వల్ప గాయాలపాలైన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాయి. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయా సంఘాల నేతలు మాట్లాడారు. ప్రమాదానికి ఫ్యాక్టరీ ఉన్నతాధికారులే ప్రధాన బాధ్యులుగా తేలిందన్నారు. ఫ్యాక్టరీలో రక్షణ చర్యలు తీసుకోవడంలో అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన పాయింట్లో లీకేజీ గురించి గత 20 రోజులుగా కార్మికులు అధికారులకు చెబుతునే ఉన్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో తరచుగా అనేక ప్రమాదాలు చోటుచేసుకుని పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. యాజమన్యాలు, సంబంధిత అధికారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వారు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఏఐసీసీటీయూ, ఏఐసీటీయూ, ఓపీడీఆర్ సంఘాల ప్రతినిధులు జి.ఓబులేసు, కే.పోలారి, ఉదయ్‌కిరణ్, గొల్లపూడి ప్రసాద్, సి.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ప్రమాద వాస్తవాలు బహిర్గతం చేయాలి : సీపీఐ



ధర్నాచౌక్ : అల్ట్రాటెక్ ప్రమాద ఘటనపై వాస్తవాలను ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు బహిర్గతం చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా అన్నిపార్టీలు, సంఘాలు, ప్రభుత్వ అధికారులతో నిజ నిర్ధారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో బుధవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు కంపెనీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజా, కార్మిక హక్కుల విషయంలో హద్దులు దాటి ప్రవర్తిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబోజు శివాజీ, ఏఐటీయూసీ నేతలు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా బెల్!



నిమ్మలూరు బెల్ కంపెనీ

పామర్రు : మండల పరిధిలోని నిమ్మలూరు గ్రామంలో 50 ఎకరాల విస్తీర్ణంలో రూ. 340 కోట్లతో నిర్మితమైన భారత్ ఎలక్ట్రానిక్స్ సంస్థ(బెల్) కంపెనీ త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. 2016లో అప్పటి కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, నాటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. కొవిడ్ కారణంగా పనుల్లో కొంత జాప్యం జరిగినా నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 2022 సంవత్సరాంతంలో నాటి కేంద్ర మంత్రి భారతి ప్రవీణ్ పవార్ సందర్శించడంతోపాటు కర్మాగారంలో తయారుచేసే పరికరాలు దేశరక్షణ, పారామిలటరీ బలగాలకు విధి నిర్వహణలో ఎలా ఉపయోగిస్తారో కంపెనీ సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ఎలక్ట్రో ఆప్టిక్ వ్యాపార విస్తరణకు నిమ్మలూరు కంపెనీ దోహదపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో త్వరలో కంపెనీ ప్రారంభోత్సం జరగనుండడం విశేషం. బెల్ కంపెనీ కోసం ఎంతోకాలంలో ఎదురుచూస్తున్న యువతకు త్వరలో తీపికబురు అందనుంది.



చినపాండ్రాకలో మట్టిని పరిశీలిస్తున్న అధికారులు

మట్టి మాఫియాకు అడ్డుకట్ట..

» స్పందించిన రెవెన్యూ అధికారులు

బంటుమిల్లి, జూలై 10 : పెట్రేగిపోతున్న మట్టి మాఫియాపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి కృత్తివెన్ను రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం చినపాండ్రాక గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన మట్టిని రెవెన్యూ అధికారులు ఆర్ఐ, వీఆర్వోలు పరిశీలించారు. తక్షణమే మట్టి విక్రయాలను నిలిపివేశారు. పూర్తి విచారణ చేపట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని కృత్తివెన్ను తహసీల్దార్ అన్నారు. మట్టి నిల్వలు ఉన్న భూమి యజమానులతో మాట్లాడినట్టు తెలిపారు. విచారణ పూర్తి అయ్యేవరకు మట్టి తోలకాలు చేయరాదని ఆదేశించినట్టు తెలిపారు. వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు.



పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

సాగర్ కవచ్.. ముగ్గురి అరెస్టు

మచిలీపట్నం టౌన్, జూలై 10 : సాగర్‌కవచ్ ట్రయల్ రన్‌లో భాగంగా బుధవారం రాడార్ కేంద్రం వద్ద కొత్తగా నగరంలోకి ప్రవేశించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. సాగర్ ట్రయల్‌రన్‌లో భాగంగా రాడార్ కేంద్రం వద్ద బ్యాగులను తనిఖీ చేశారు. బ్యాగులో ఆర్‌టీఎక్స్ ఉన్నట్టు గుర్తించారు. గిలకలదిండి కోస్టల్ సెక్యూరిటీ పోలీసులతో పాటు సీఐ పెద్దిరాజు, ఏఎస్ఐ మురళీకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ మద్దియ్య, రవికిరణ్, పీసీ రాజ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. ఆటోలో వస్తున్న సిబ్బందిని ఆపి వాహనాలు తనిఖీ చేశారు. ఒక బ్యాగులో ఆర్‌టీఎక్స్ ఉన్నట్టు గుర్తించారు. ఆర్‌కె సింగ్, నీరజ్‌కుమార్, పి.ఎస్.పి. కిషోర్‌లను గిలకలదిండి కోస్టల్ సెక్యూరిటీ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ ముగ్గురు నావెల్ సిబ్బంది కావడం విశేషం.

కుక్కల దాడిలో 12 మేకలు మృతి



చందర్లపాడు, జూలై 10 : కుక్కల దాడిలో 12 మేకలు మృతి చెందిన ఘటన చందర్లపాడులో చోటు చేసుకుంది. బుధవారం గ్రామానికి చెందిన ఆవల వలరాజు అనే కాపరికి చెందిన మేకలపై కుక్కలు విచక్షణా రహితంగా దాడి చేశాయి. దాడిలో 12 మేకలు చనిపోగా, కొన్నింటికి గాయాలయ్యాయి. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని వేడుకున్నాడు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.55

ధర్మపథం వేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, జూలై 10: దుర్గగుడిలోని ధర్మపథం వైదికపై అనంతపురానికి చెందిన శ్రీమంజీర నాట్యకళాక్షేత్రం ఎస్ రాజశేఖర్ ఆధ్వర్యంలోని బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేసింది. మహేశ్వరి మహంకాళి, అఖిలాండేశ్వరి, మలయ మారుత దిల్లాన వంటి కీర్తనలతో పాటు మరో ఆరు కీర్తనలకు కళాకారులు తమదైన శైలిలో నాట్య ప్రదర్శన చేశారు. హావం భావం ఆహార్యం అన్నీ శ్రోతలను ఆకట్టుకున్నాయి.



ఉచిత ఇసుకతో

కార్మికుల ముఖాల్లో చిరునవ్వులు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ● చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పటమట, జూలై 10 : ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి రాష్ట్రంలో భవన నిర్మాన కార్మికుల ముఖాల్లో సీఎం చంద్రబాబు చిరునవ్వులు పూయించారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. సీఎం ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చిన సందర్భంగా 10వ డివిజన్‌లో బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో వాసవీకాలనీలో అభ్యుదయ కాలేజ్ రోడ్డులో చంద్రబాబు చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే, కార్మికులతో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణతో కలిసి స్థానికంగా ఉన్న సైడ్ డ్రెయిన్లను ఎమ్మెల్యే పరిశీలించారు. పొన్నం శ్రీనివాస్, పాలగాని జగన్‌మోహన్‌రావు, పింకి హర్వీందర్ సింగ్, కుల్దీప్ కౌర్, మన్నే జయప్రకాష్, యార్లగడ్డ రంగారావు, చలసాని వాసులు పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గద్దె

కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన

11వ డివిజన్ ఆటోనగర్ పరిధిలోని యూసీ టీ స్టాల్ ఎదురుగా డ్రెయినేజీపై కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో బుధవారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రూ.11.55లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఐలా చైర్మన్ దుర్గాప్రసాద్, కోనేరు రాజేష్, కొలసాని నాగమణి, ఏ. శివనాగేశ్వరరావు, గొల్లపూడి నాగేశ్వర రావు, జాస్తి సురేష్, కొడూరు ఆంజనేయ వాసు, పామర్తి కిషోర్‌లు పాల్గొన్నారు.

గద్దెను కలిసిన వలంటీర్లు

మొగల్రాజపురం: తూర్పు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కర్రి రాజేష్ ఆధ్వర్యంలో 7వ డివిజన్ 39వ సచివాలయ వలంటీర్‌లు బుధవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, యువ నాయకుడు గద్దె క్రాంతిని కలిశారు. వలంటీర్లను తొలగిస్తారని, డిగ్రీ అర్హత ఉండాలని, ఇలా ప్రచారం జరుగుతోందని, వైసీపీ నాయకులు ఇబ్బందులు పెట్టినా రాజీనామా చేయలేదని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విధి నిర్వహణ కచ్చితంగా చేశామని చెప్పారు. ఈ నెల జీతం ఇంకా పడలేదని, తమ ఉపాధిని కాపాడాలని, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు గద్దెను కోరారు.

ఇస్త్రం డానియేల్ సేవలు మరువరానివి

విద్యాధరపురం, జూలై 10: టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి పార్టీకి ఎంతో గుర్తింపు తెచ్చిన ఇస్త్రం డానియేల్ సేవలు మరువరానివని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఇస్త్రం డానియేల్ ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పు ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చిన సమయంలో ఆయన భౌతికంగా లేకపోవడం తీరని లోటన్నారు. ఎస్సీ సెల్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, నాయకులు చెన్నుపాటి గాంధీ, గొల్లపూడి నాగేశ్వరరావు, దోమకొండ రవికుమార్, నందిపాటి దేవానంద్, మల్లెల రామకృష్ణ, ఇంకా పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డానియేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

17,18 డివిజన్ల ఆధ్వర్యంలో ..

రాణిగారితోట: టీడీపీ నాయకుడు ఇస్త్రం దానియేలు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని 17,18 డివిజన్ల ఆధ్వర్యంలో రాణిగారితోట ప్రధాన సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని దానియేలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు డివిజన్ల అధ్యక్షులు రంగమ్మ, వేముల దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● న్యూ అరుంధతి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కొక్కెర తిరుపతయ్య దానియేలుకు నివాళులు అర్పించారు.

పర్యావరణ సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

● గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత



మాట్లాడుతున్న నియంత

పటమట, జూలై 10 : పర్యావరణానికి చెడు కలిగించే వ్యర్థాల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలని గోరా సైన్స్ డైరెక్టర్ జి.నియంత తెలిపారు. గోరా సైన్స్ సెంటర్ బుధవారం నిర్వహించిన పర్యావరణ అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. గాలి, నీరు, పరిసరాలు మనం విడుదల చేసే వ్యర్థాల వల్లనే కలుషితం అవుతున్నాయన్నారు. చిన్న వయస్సులోనే విద్యార్థులు పర్యావరణ సమస్యల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. సభానంతరం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షులు రేష్మా జెల్లీ పాఠశాల, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ప్రారంభించారు. డాక్టర్ సమరం, సకల పాల్గొన్నారు.

సంగీత ఆరాధనా ఉత్సవాల్లో ఐదు బృందాల కచేరీలు

విజయవాడ కల్చరల్, జూలై 10 : సత్యనారాయణపురం శివరామకృష్ణక్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత సద్గురువర్యుల సంగీత ఆరాధన ఉత్సవాలలో భాగంగా శ్రీవారి శిష్యప్రశిష్య బృందం ఆధ్వర్యంలో ఐదవ రోజు బుధవారం ఐదు బృందాలు కచేరీలు చేశారు. తొలుత కె.శ్రీరంజని తన గాత్రంతో రామ నీ సమానమెవరు-ఖరహరప్రియ రాగంలో ఆలపించి రంజింపచేశారు. జననీ నిను వినా అంటూ రీతిగౌళ రాగంలో, వాడేరా దైవము మనసా అనే కృతిని పంతువరాళి రాగంలో, మాధవ మమవ కీర్తనను నీలాంబరి రాగంలో గానం చేసి మైమరిపించారు. వీరితో పాటు వలివేటి నీరజ, హేమాద్రి చంద్రకాంత్, ఒంగోలు డాక్టర్ నాగమాధురిలు గాత్ర కచేరీలతో ముగ్ధుల్ని చేయగా అన్నవరపు రామస్వామి-వయోలిన్ సోలోతో ప్రేక్షకుల్ని ఆనంద పరవశుల్ని చేశారు. కార్యక్రమాన్ని మోదుమూడి సుధాకర్ పర్యవేక్షించారు.

ఇసుక విధానంపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

జనసేన నాయకురాలు తిరుపతి అనూష

భవానీపురం, జూలై 10 : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంపై వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఐక్యంగా తిప్పికొట్టాలని జనసేన నాయకురాలు తిరుపతి అనూష పిలుపునిచ్చారు. సితార సెంటర్‌లోని జనసేన కార్యాలయంలో ఆమె మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు కేవలం లోడింగ్ చార్జీలు, ట్రాన్స్‌పోర్టు చార్జీలు చెల్లించుకుని ఇసుకని తీసుకెళ్లాలని క్లియర్‌గా చెప్పిన విషయాన్ని కొంత మంది వైసీపీ నేతలు ఇసుక విధానం తప్పని ప్రజల్ని మభ్యపెట్టాలని చూడటం తగదన్నారు. దీనిపై ప్రజల్లోకి వెళ్లి జనసైనికులు చైతన్యం తీసుకురావాలన్నారు. ఎండీ అయాజ్, పసుపులేటి నాగకృష్ణ, తంగా రవి, దాసి రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

వేతనాలివ్వాలంటూ కోచ్‌ల ఆందోళన

విజయవాడ స్పోర్ట్స్, జూలై 10: రాష్ట్రవ్యాప్తంగా క్రీడాప్రాంగణాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కోచ్‌లు రోడ్డెక్కారు. తమకు 5 నెలల నుంచి వేతనాలు అందడం లేదని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. 65 మంది వివిధ క్రీడాంశాల్లో పనిచేసే కోచ్‌లు 2 గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాప్ అవుట్ సోర్సింగ్ కోచ్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు, ఉపాధ్యక్షుడు నర్సా రాఘవేంద్రరావు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శాప్ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట రమణకు అందించారు. అనుమతి లేకుండా ధర్నా చేశారని ప్రశ్నించడంపై కోచ్‌లు మండిపడ్డారు. దీనిపై శాప్ వీసీ, ఎండీకి నివేదిస్తానని ఆమె హామీ ఇచ్చారు. సంఘ సెక్రటరీ వేణు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల నిరసన

పటమట, జూలై 10: ఆలిండియా డిమాండ్స్ డే సందర్భంగా నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆశావర్కర్లు బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా శ్రామిక మహిళా నేత ఏ కమల మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, వారంలో ఒక రోజు సెలవు దినం ప్రకటించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ ఇవ్వాలని, స్కీం వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కుల్ని, చట్టాల్ని ఉల్లంఘిస్తే ఉద్యమాలకు ఉపక్రమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు వీబీ.రాజు, ఎన్.కోటబాబు, నేతలు శ్రీలక్ష్మి, దయామణి, జ్యోష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనే లక్ష్యం

రైల్వేస్టేషన్, జూలై 10: పాత పెన్షన్ సాధనే లక్ష్యమని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం పాత పెన్షన్ సాధన కోసం డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో లంచ్ అవర్ గేట్ మీటింగ్ జరిగింది. నేతలు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానంలో కార్మికులు జీవన పరిస్థితులు దుర్లభంగా మారాయన్నారు. రైల్వే కార్మికుల చిరకాల డిమాండ్ సాధనకు లంచ్ అవర్ గేట్ మీటింగ్ నిర్వహించినట్టు తెలిపారు. అన్ని బ్రాంచ్‌లకు చెందిన కార్మికులు, సంఘ కార్యదర్శులు, చైర్మన్‌లు, క్యాడర్, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌బీఐ 90వ వార్షికోత్సవం సందర్భంగా

మొక్కలు నాటే కార్యక్రమం

లబ్బీపేట, జూలై 10: సిద్ధార్థ మహిళా కళాశాలలో బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఆర్‌బీఐ సంయుక్త ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 90వ వార్షికోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ ఆష్రఫ్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యవరణాన్ని పరిరక్షణతో పాటు, కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్ సాయిశివ కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా.కె.సరళ, టి.నాగరాణి, జి.జ్యోత్స్న పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన యార్లగడ్డ



ఉంగుటూరు, జూలై 10 : రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న అపరిష్కృత సమస్యలను మంత్రి లోకేశ్‌కు వివరించారు.

గత ఐదేళ్లగా ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని, తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారని లోకేశ్‌కు తెలిపారు. ఈక్రమంలో ప్రజలకు భరోసా కల్పిస్తూ, సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గంలో పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

విజిలెన్స్ ఈఈ కమలకుమారి

విద్యాధరపురం, జూలై 10: విద్యుత్ చౌర్యానికి పాల్పడడం సామాజిక నేరమని చౌర్యానికి పాల్పడిన వినియోగదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్ విజిలెన్స్ ఈఈ కమలకుమారి హెచ్చరించారు. బుధవారం కాళేశ్వరరావు జనరల్ మార్కెట్ సెక్షన్ పరిధిలోని గృహ, వాణిజ్య సర్వీసులపై తనిఖీలు నిర్వహించారు. మొత్తం 40 బృందాలు నిర్వహించిన తనిఖీల్లో అదనపు లోడ్‌ను వినియోగిస్తున్న 60 సర్వీసులు గుర్తించి రూ.2.17 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు అంతరాయంలేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని సూచించారు. టౌన్ ఈఈ బీవీ సుధాకర్ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం విషయంలో తీసుకోవాల్సిన అంశాలు, విద్యుత్ సరఫరాలో నాణ్యతను వివరించారు. విజయవాడ టౌన్, డివిజన్ పరిధిలోని ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో విద్యుత్ అధికారులు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో సామూహిక రాయబార కార్యక్రమం

పటమట, జూలై 10 : ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా భవన నిర్మాణ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ పిలుపు మేరకు బుధవారం బెంజిసర్కిల్ కార్మికుల అడ్డా వద్ద కార్మికులు సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పి.నరసింహారావు మాట్లాడుతూ అసంఘటిత నిర్మాణ కార్మికులు భద్రతగా భరోసాగా ఉన్న వెల్ఫేర్‌బోర్డు చట్టాన్ని కార్మికులు, కార్మికవర్గం పోరాడా సాధించిందని, గత వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తన సొంత ఉపయోగాల కోసం వాడుకుందన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం బోర్డును పునర్నిర్మించి బోర్డులో ఉన్న సంక్షేమ పథకాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ఈ నెల 15న జిల్లా కలెక్టర్ సృజనకు సామూహిక రాయబార వినతి పత్రాన్ని కార్మికవర్గంతో వెళ్లి ఇవ్వాలని పిలుపునిచ్చారు. వీబీ రాజు, బి. బెనర్జీ, ఎం.నాగమల్లేశ్వరరావు, బి. దుర్గారావు, వి. రాంబాబు వి. నరసింహారావు, డి. వెంకన్నలు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకట్

అజిత్‌సింగ్‌నగర్, జూలై 10 : మంగళగిరి సమీపంలోని నవులూరు గ్రామం షారోన్ ఆశ్రమంలో ఉంటూ స్థానిక రెయిన్‌బో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విజయవాడ హెల్పింగ్ హ్యాండ్స్ బుధవారం ఆర్థిక సహాయం అందించింది. ఆశ్రమంలో ఉంటున్న 23 మంది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, చదువులకు అయ్యే ఖర్చులో భాగంగా రూ. 2 లక్షల 4 వేలు స్కూల్ ప్రిన్సిపాల్‌కు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యుడు వెంకట్ అందజేశారు. కన్న వారి ప్రేమకు దూరమైన చిన్నారుల చదువు కోసం హెల్పింగ్ హ్యాండ్స్ తమ వంతుగా సహాయం అందించామని వెంకట్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను ప్రజలకు చేరువ చేయాలి : సత్యవతి



భవానీపురం, జూలై 10 : నగరంలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు చేరువ చేయాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్టు) కేవీ సత్యవతి అధికారులకు సూచించారు. కబేళా, హెచ్‌బీ కాలనీల్లో క్షేత్రస్థాయిలో చేపట్టిన పనులను బుధవారం ఆమె పరిశీలించారు. హెచ్‌బీ కాలనీ రోజ్‌గార్డెన్‌లో స్కేటింగ్ రింక్‌తో పాటు వివిధ పార్కులను, వాకింగ్ ట్రాక్, క్రికెట్, టెన్నిస్ ప్రాక్టీస్‌కోర్టులను పరిశీలించిన సత్యవతి ప్రజలకు సౌకర్యాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. పార్కుల ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని త్వరితగతిన అందించాలన్నారు. ఆమె వెంట ప్రాజెక్టుల ఎస్ఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

పాయకాపురం, జూలై 10 : ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై నున్న రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం రాజీవ్‌నగర్‌కు చెందిన బాలిక(14)ను. జక్కంపూడి కాలనీకి చెందిన కిరణ్ కొంత కాలంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు యువకుడిని హెచ్చరించినా అతనిలో మార్పు రాకపోవడంతో నున్న రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

అజిత్‌సింగ్‌నగర్, జూలై 10 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం మధ్యకట్ట ప్రాంతంలో ఉంటున్న మావర్ల పద్మ ఈనెల 6న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లింది. మరుసటి రోజు ఉదయం వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండటం, ఇంట్లో సామాన్లు చిందర వందరగా పడి ఉండటాన్ని గుర్తించి ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే 21 కాసుల బంగారు ఆభరణాలు, 18 తులాల వెండి, రూ. 20 వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది.

పుస్తకాలు పంపిణీ


గవర్నర్‌పేట, జూలై 10: మహంతి అప్పల నరసయ్య, మహాలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ (ఎంఏఎం) ఆధ్వర్యంలో బుధవారం 25వ డివిజన్ సీతారామపురం ట్రస్ట్ కార్యాలయం వద్ద 20 మంది పేద విద్యార్థులకు పుస్తకాలు, ఫీజులు నిమిత్తం నగదుతో పాటు రెండు పేద కుటుంబాలకు కూరగాయల బండ్లు పంపిణీ జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు మహంతి వాసు దేవరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గౌతమి, దూండీ రాంప్రసాద్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:అయనంక బోస్.

బంగారం వేటలో పోరాటం



తమిళ హీరో విక్రమ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తంగలాన్'. పా రంజిత్ దర్శకత్వంలో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యధార్థ ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ బుధవారం విడుదల చేశారు. రెండు గిరిజన తెగల మధ్య పోరాటం, తనవాళ్లను కాపాడుకోవడానికి ఎంతకైనా తెగించే నాయకుడి పాత్రలో విక్రమ్ నటన, ఆయన సిద్ధమైన తీరు, యాక్షన్ సీక్వెన్స్‌లు ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో పార్వతీ తిరువోతు, మాళవికా మోహనన్ కథానాయికలు. పశుపతి, హరికృష్ణన్ కీలకపాత్రలు పోషించారు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఎడిటర్ : ఆర్ కే సెల్వ

పల్లెటూరి యువతి ప్రతీకారం



యాభైకి పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అంజలి ప్రధాన పాత్ర పోషించిన వెబ్ సెరీస్ 'బహిష్కరణ' ఈ నెల 19న ఓటీటీ వేదిక జీ 5లో స్ట్రీమింగ్ కానుంది. ముఖేశ్ ప్రజాపతి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ విలేజ్ రివెంజ్ డ్రామా ఆరు ఎపిసోడ్స్‌గా ప్రసారం అవుతుంది. ఈ సిరీస్ ట్రైలర్‌ను అక్కినేని నాగార్జున విడుదల చేశారు. పల్లెటూరు, అక్కడ అంజలి, శ్రీతేజ్, అనన్య నాగళ్ల పాత్రల పరిచయం, ఊరి పెద్ద చేసే దురాగతాలు ట్రైలర్‌లో చూపించారు. ఓ వైపు ప్రేమ కురిపిస్తూనే మరో వైపు ప్రతీకారం తీర్చుకోవడం కోసం రగిలిపోయే పల్లెటూరి యువతి పాత్రను అంజలి పోషించారు. ఇందులో ఊరి పెద్దగా రవీంద్రన్ విజయ్ నటించారు. ప్రశాంతి మలిశెట్టి నిర్మించిన 'బహిష్కరణ' సిరీస్‌కు ప్రసన్నకుమార్ సినిమాటోగ్రఫీని, సిద్ధార్థ్ సదాశివుని సంగీతాన్ని అందించారు.

యథార్థ సంఘటనలతో...



రవికృష్ణ, సమీర్‌మల్లా, రాజీవ్‌కనకాల ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ. దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్, టీజర్‌కు మంచి ఆదరణ లభించింది. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు విస్కీ మాట్లాడుతూ "నా జీవితంలో జరిగిన కొన్ని యధార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాను. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. "ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితంలో జరిగిన ఓ సంఘటన చుట్టూ ఈ సినిమా నడుస్తుంది" అని నిర్మాత ఐ.భరత్ తెలిపారు. "సినిమా అంటే ప్రాణమిచ్చే ఇలాంటి టీమ్‌తో నటించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. సినిమా అందరికీ కొత్త అనుభూతిని పంచుతుంది" అని నటుడు రవికృష్ణ అన్నారు. వాకా మని, రాజా అశోక్, వెంకటేశ్, సాయి అరుణ్, రాహుల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

రెడీ అయిన రాయన్



ప్రతి హీరో కెరీర్‌లో 50, 100 చిత్రాలకు ఓ ప్రత్యేకత ఎప్పుడూ ఉంటుంది. ప్రత్యేక కథలతో ఈ చిత్రాల్లో నటించడానికి హీరోలు ప్లాన్ చేసుకుంటుంటారు. తమిళ హీరో ధనుష్ తన 50వ చిత్రం 'రాయన్' కోసం ఓ మంచి కథను ఎంపక చేయడమే కాకుండా తనే ఆ చిత్రానికి దర్శకత్వం వహించారు. సందీప్ కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. సెన్సార్‌తో సహా అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని 'రాయన్' చత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నెల 26న సినిమా రిలీజ్ కానుంది. ఏషియన్ సురేశ్ సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తున్నాయి. అపర్ణ బాలమురుగన్, ఎస్.జె.సూర్య, సెల్వ రాఘవన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీత దర్శకత్వం వహించారు.

ఊరినే ఉప్పొంగించే వీరుడు



'సాదా సీదా మగాళ్లు కావాలా, ఈ ఊరినే ఉప్పొంగించే వీరుడు కావాలా'... ప్రస్తుతం ఎన్టీఆర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న డైలాగ్ ఇది. ఆయన కథానాయకుడిగా శివ కొరటాల దర్శకత్వం వహిస్తున్న 'దేవర' చిత్రంలోని ఈ డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవలే చిత్రబృందం డబ్బింగ్ కార్యక్రమాలను మొదలుపెట్టింది. అందులో నుంచి ఓ డైలాగ్ లీక్ అయి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో ఎన్టీఆర్ ఊరికోసం పోరాడే వీరుడు అని తెలుస్తోంది. 'దేవర' చిత్రం రెండు భాగాలుగా వస్తోంది. తొలి భాగం సెప్టెంబర్ 27న విడుదలవుతోంది. ఇందులో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషిస్తున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ నిర్మిస్తున్నాయి.

తిన్నడి విల్లు కథ




మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద ఇప్పుడు భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన 'టీజర్' అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వివరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయరు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. పులి ఎముకలు, దంతాలతొ తయారు చేసిన ఈ విల్లుతో కన్నప్ప యుద్ధ భూమిలో అసమానమైన ప్రజ్ఞను ప్రదర్శిస్తాడు. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. సినిమాలో ఈ విల్లు అంతర్భాగం. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతూల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు. త్వరలో విడుదల కానున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్ తదితరులు నటించారు. ముఖేశ్‌సింగ్ దర్శకుడు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవలే తండ్రీ, కూతుళ్లను కించపరిచేలా వీడియోలను పోస్ట్ చేసిన క్రియేటర్లపై మండిపడ్డారు. కామెడీ పేరుతో ఇలాంటి వీడియోలు చేయడం సరికాదని సూచించారు. మహిళలను కించపరిచే పోస్ట్‌లు పెడితే ఇకపై వదిలిపెట్టేది లేదని వీడియోలో పేర్కొన్నారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడం ముఖ్యం

సురేశ్‌బాబు



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు .భారతీయుడు-2 చిత్రం శుక్రవారం విడుదల కానుందని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు డిస్ట్రిబ్యూషన్ తానే తీసుకున్నట్లు చెప్పారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీ రంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

- పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు
- నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది



విష్వక్ సేన్

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంకట సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.



షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?

బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కో సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. కలసి కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది. మంచి సందేశంతో దర్శకుడు చిత్రాన్ని తీశారు" అని అన్నారు.

పీరియాడిక్ థ్రిల్లర్ 'క'



కిరణ్ అబ్బవరం కొంత విరామం తర్వాత నటిస్తున్న చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమాకు 'క' అనే ఆసక్తికరమైన, సింగిల్ లెటర్ టైటిల్‌ను నిర్ణయించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శక ద్వయం సుజీత్, సందీప్ రూపొందించారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా చిత్రాన్ని విడుదల చేస్తామని నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 11 జూలై 2024

అందరి చూపులు ఆమె వైపే! ఎంచుకునే దుస్తులు మొదలు ధరించే నగల వరకూ అన్నీ అపురూపమే! హల్దీ సెరిమనీలో కూడా పూల దుపట్టా, ఆభరణాలతో అలరించి అందరూ అవాక్కయ్యేలా చేసేసింది అంబానీ కాబోయే కోడలు, **రాధికా మర్చంట్**. రాధికతో పాటు, మెహందీ, హల్దీ వేడుకల కోసం పూల ఆభరణాల ట్రెండ్‌ను ఎంచుకున్న సెలబ్రిటీల గురించి తెలుసుకుందాం!

ఫ్లవర్ పవర్





వినూత్నం

హల్దీ వేడుకలో పసుపుపచ్చని ఎంబ్రాడరీ లెహెంగా, అందమైన ఫ్లోరల్ దుపట్టాలో ముద్దబంతి పువ్వులా వెలిగిపోయింది రాధికా మర్చంట్. 90 బంతిపూలు, వేలకొద్దీ నందివర్ధనం మొగ్గలతో అల్లిన వినూత్నమైన దుపట్టాతో పాటు, ఆ దుస్తులతో మ్యాచ్ అయ్యే పువ్వుల జ్యువెలరీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెల్లని నందివర్ధనం మొగ్గల చెవి దుద్దులు, డబుల్ నెక్లెస్, హాథ్ ఫూల్, కలీరాస్... ఇలా ఆభరణాలన్నీ ఫ్లోరల్ థీమ్‌లో రూపొందాయి. ఆభరణాల తయారీలో నందివర్ధనం మొగ్గలతో పాటు, ఎల్లో బటన్ డైసీ, థాయి రుయి ఫ్లవర్స్‌ను కూడా ఉపయోగించారు. ఫ్లోలర్ ఆర్ట్ స్టూడియో ఫౌండర్, శ్రిష్టి కపూర్ ఈ ఫ్లోరల్ డిజైన్‌ను రూపొందించింది. కళాత్మకత ఉట్టిపడేలా తాజా పూల తాగర్ జాల్ దుపట్టా రూపొందించడం కోసం, ప్రతి పువ్వునూ ఎంతో పక్కాగా అమర్చామనీ, సహజత్వం కోల్పోకుండా, అందంగా కనిపించేలా డిజైన్ చేశామనీ, కళాకారుల బృందం ఈ దుపట్టా రూపొందించడానికి ఒక రోజంతా కష్టపడిందనీ డిజైనర్ శ్రిష్టి అంటోంది.

పువ్వుల తళుకుల్లో...

గతంలో పువ్వుల ఆభరణాలను ఎంచుకున్న తారలు కూడా ఉన్నారు. కత్రినా కైఫ్, మౌని రాయ్, కరిష్మా తన్నా కూడా మెహందీ, హల్దీ వేడుకల కోసం ఇవే ఆభరణాలను ఎంచుకున్నారు. కత్రినా తన హల్దీ వేడుక కోసం సబ్యసాచి లెహెంగా ధరించి, మ్యాచింగ్‌గా సహారా స్ట్రింగ్స్‌తో కూడిన నందివర్ధనం మొగ్గల ఇయర్‌రింగ్స్, డ్రై ఫ్లవర్స్‌తో తయారైన గాజులు, ఉంగరం, కలీరాస్ ధరించింది. కత్రినా ధరించిన ఈ ఫ్లవర్ జ్యువెలరీ ఖరీదు 15 వేలు. కరిష్మా తన్నా కూడా తన తెల్లని సహారా సెట్‌ను నందివర్ధనం పూల ఆభరణాలతోనే మ్యాచ్ చేసింది. ఆల్ వైట్ లుక్ కోసం, సహారా స్ట్రింగ్స్‌తో ఝుంకాలు, పాపటి బిళ్ల, మణికట్టుకు వేలాడుతూ ఉండే కలీరాలు ధరించిందామె. కరిష్మా ధరించిన ఫ్లవర్ జ్యువెలరీ ధర కూడా పదిహేను వేలే! మౌని రాయ్ తన హల్దీ సెరిమనీ కోసం, ఫాక్స్ ఫ్లోరల్ జ్యువెలరీని ఎంచుకుంది. మౌని స్టైలిస్ట్, అనురాధ ఖురానా, డిజైనర్ స్టూడియో ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ ద్వారా మౌనికి నచ్చే వైట్ అండ్ వైట్ కాంబినేషన్ ఫ్లవర్ జ్యువెలరీని ఆర్డర్ చేసింది.

చవకలో చమక్కుమనేలా...

వినూత్నంగా, అందంగా కనిపించాలనే కోరిక ప్రతి వధువుకూ ఉంటుంది. అందుకోసం ఎంచుకునే దుస్తుల మొదలు, ఆభరణాల వరకూ కొత్తదనాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తూ ఉంటారు. పువ్వుల ఆభరణాలను ఎంచుకోవడం వెనకున్న రహస్యం ఇదే! ఆహ్లాదంగా కంటికింపుగా కనిపించడం కోసం మరీ ముఖ్యంగా హల్దీ వేడుకల్లో పూల ఆభరణాలనే ఎంచుకుంటూ ఉంటారు. తేలికగా వాడిపోని నందివర్ధనం, బంతిపూలను ఎంచుకోవడం వెనకున్న కారణం కూడా ఇదే! పసుపు, తెలుపు దుస్తులతో మ్యాచ్ అవడంతో పాటు, ముఖానికి పూసే పసుపుతో తెల్లని నందివర్ధనాలు, బంతిపూలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తాయి కాబట్టి, ఈ రెండు పూలనే ఫ్లవర్ జ్యువెలరీలో ఎక్కువగా వాడుతూ ఉంటారు. నిజానికి తక్కువ ధరలో, వినూత్నంగా కనిపించాలనుకునే వాళ్లకు ఫ్లవర్ జ్యువెలరీ బెస్ట్ ఆప్షన్.

కౌన్సెలింగ్

డాక్టర్! మాకు పెళ్లై నాలుగేళ్లు. పిల్లలు లేరు. అందుకు లోపం నాలోనే ఉందని భర్త, అత్తమామలూ వేధిస్తున్నారు. కానీ పరీక్షల్లో నాలో ఎలాంటి లోపం లేదని తేలింది. పిల్లలు కలగడకపోవడానికి కారణం ఆయనలో కూడా ఉండే అవకాశంుందా?

- ఓ సోదరి, హైదరాబాద్

గర్భం దాల్చడానికి భార్యాభర్తలిద్దరూ సమ బాధ్యులే! గర్భం దాల్చకపోతే అన్ని వేళ్లూ భార్యనే చూపిస్తాయి. కానీ నిజానికి పిల్లలు కలగకపోవడానికి భార్యతోపాటు భర్త కూడా కారణమే! 'పురుషాంగం గట్టిపడి, స్ఖలనమవుతోంది కదా? నాలో లోపమేముంటుంది?' అనుకుంటే పొరపాటు. అంతర్గతంగా ఎన్నో లోపాలుండవచ్చు. గర్భం దాల్చకుండా అడ్డుపడే అంశాలు వీర్యకణాల్లో, వీర్యనాళాల్లో, వృషణాల్లోనూ ఉండొచ్చు. కొన్ని ఇబ్బందులు స్పష్టంగా కనిపించవచ్చు. మరికొన్ని నిశ్శబ్దంగా సమస్యను జటిలం చేస్తూ ఉండొచ్చు. ఇంతకీ పురుషులను ఎప్పుడు అనుమానించాలంటే?

పురుషుల్లోనూ లోపం ఉండొచ్చు

పెళ్లయ్యాక ఎటువంటి గర్భనిరోధక పద్ధతులూ పాటించకుండా సంవత్సరంపాటు భార్యాభర్తలు కలిసినా గర్భధారణ జరగకపోతే కచ్చితంగా వంధ్యత్వాన్ని అనుమానించవచ్చు.

జెనిటల్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్స్: దీనివల్ల కొంతమందికి వృషణాల్లో నొప్పి ఉంటుంది. ఇంకొందరికి ఉండకపోవచ్చు కూడా! అందుకే ఈ రకమైన ఇన్‌ఫెక్షన్లను 'సైలెంట్ ఇన్‌ఫెక్షన్స్' అంటారు. ఇవి 'సెమెన్ ఎనాలసిస్' చేసినప్పుడు మాత్రమే బయట పడతాయి.

జీవనశైలి సమస్యలు: ఎక్కువ సమయం పాటు కూర్చుని పని చేయడం, ఆహారం, నిద్ర వేళలు సక్రమంగా పాటించకపోవడం లాంటి జీవనశైలి కూడా వంధ్యత్వానికి దారి తీయొచ్చు.

వేరికోసిల్: కాళ్లలో వచ్చే వెరికోజ్ వెయిన్స్ లాంటిదే ఈ సమస్య. కాకపోతే వృషణాల్లోని రక్తనాళాల్లో రక్తం ప్రవహించకుండా నిలిచిపోతుంది. ఇది కూడా నిశ్శబ్ద సమస్యే! ఎవరికి వారు తెలుసుకోవడం కష్టం.



వీర్యకణాల సమస్యలు: వీర్యకణాల రూపం సక్రమంగా ఉంటేనే అండంలోకి చొచ్చుకుపోగలవు. వాటి తల, మధ్య భాగం, తోక... వీటిలో ఏ ఒక్కటిలో లోపం ఉన్నా అండం ఫలదీకరణ కష్టమే!

స్ఖలన సమస్య: కొందరికి వీర్యనాళంలో సమస్య ఉండొచ్చు. ఇలాంటి వాళ్లు స్ఖలించలేరు. స్ఖలనమే జరగకపోతే గర్భధారణ ఎలా సాధ్యపడుతుంది?

హార్మోన్లలో హెచ్చుతగ్గులు: మెదడు నుంచి విడుదలయ్యే ఎఫ్.ఎస్.హెచ్ హార్మోన్ వృషణాలను ప్రేరేపించినప్పుడే వీర్య ఉత్పత్తి జరుగుతుంది. ఈ హార్మోన్ స్రావం తక్కువగా ఉంటే వీర్యం తక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఒకవేళ శరీరంలో ఈ హార్మోన్ స్థాయిలు ఎక్కువగా ఉంటే దానర్థం ఈ హార్మోన్‌ను వృషణాలు సరిగా ఉపయోగించుకోకపోవడమే! అలాగే టెస్టోస్టిరాన్ హెచ్చుతగ్గులు లేకుండా సమంగా ఉండాలి. ప్రొలాక్టిన్ ఎక్కువగా ఉన్నా టెస్టోస్టిరాన్ హార్మోన్ తగ్గుతుంది.

వంశపారంపర్యం: వంధ్యత్వం వంశపారంపర్యంగా కూడా సంక్రమిస్తుంది. మేనరికం ద్వారా పుట్టిన పిల్లల్లో ఈ సమస్య సర్వసాధారణం. అలాగే మేనమామ, పెద్దనాన్న... ఇలా దగ్గరి రక్తసంబంధీకుల్లో వంధత్వం ఉన్నా తర్వాతి తరానికి సంక్రమిస్తుంది.

జన్యుపరమైన సమస్యలు: జన్యుపరమైన లోపాల వల్ల వంధత్వం పుట్టుకతోనే సంక్రమించవచ్చు.

సర్జరీలు: బాల్యంలో వృషణాలు, పొత్తికడుపు ప్రదేశంలో సర్జరీలు జరిగినా వంధ్యత్వాన్ని అనుమానించవచ్చు.

ప్రమాదాలు: కొందరికి రోడ్డు ప్రమాదాల వల్ల వీర్యనాళానికి గాయమై, మూసుకుపోవచ్చు. వెన్నుముకకు దెబ్బ తగిలితే ఎజాక్యులేటరీ సిస్టమ్ దెబ్బతింటుంది.

ధూమపానం, మద్యపానం: ధూమపానం వల్ల వీర్యకణ నాణ్యత, వీర్య ఉత్పత్తుల మీద నేరుగా ప్రభావం పడుతుంది. దాంతో వీర్యం దెబ్బతింటుంది. మద్యపానం వల్ల హార్మోన్లలో అవకతవకలు జరిగి వంధత్వం వస్తుంది. చికిత్సలో భాగంగా తీసుకునే మందుల ప్రభావం కూడా మద్యపానం వల్ల తగ్గుతుంది. కాబట్టి వంధత్వానికి మందులు వాడుతూ ఉంటే మద్యపానానికి దూరంగా ఉండాలి.

బిగుతైన లోదుస్తులు: వీటి వల్ల కటి ప్రదేశంలో వేడి పెరిగి, ఆ కారణంగా వీర్యనష్టం జరగవచ్చు.

ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్లు: ల్యాప్ టాప్‌ను ఒడిలో పెట్టుకుని పని చేసే అలవాటు మానుకోవాలి. అలాగే సెల్ ఫోన్‌ను ప్యాంటు ముందు జేబులో ఉంచుకోవడం వల్ల రేడియేషన్ ఫలితంగా వంధ్యత్వం రావొచ్చు.

డాక్టర్ రాహుల్ రెడ్డి,
ఆండ్రాలజిస్ట్, ఆండ్రోకేర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్.



అమెరికాలో..

మన కళల 'లయ విన్యాసం'

హిప్‌హాప్.. పబ్, క్లబ్ డ్యాన్స్‌లతో హోరెత్తే అమెరికాలో... కళాభిమాలనులను కూచిపూడి నృత్యంతో అలరించడమే కాదు... అక్కడి భారతీయులకు శిక్షణ ఇస్తున్నారు **శారద నోరి ఆకెళ్ళ**. అంతేకాదు... మన పురాణాలను, ఇతిహాసాలను ఆ దేశంవారికి పరిచయం చేస్తున్నారు. కళ ద్వారా సమకాలీన సమస్యలపై చైతన్యం పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. కర్నాటక సంగీతంలోనూ నిష్ణాతురాలైన శారద... మృదంగ వాద్యకారుడిగా తన కుమారుణ్ణి తీర్చిదిద్దారు. అతడి అరంగేట్రం సందర్భంగా హైదరాబాద్ వచ్చిన ఆమె 'నవ్య'తో ప్రత్యేకంగా సంభాషించారు.

"మా స్వస్థలం హైదరాబాద్. నేను పుట్టింది, పెరిగింది ఈ నగరంలోనే. మా అమ్మ నోరి రత్నమాల, నాన్న సత్యనారాయణశర్మ. ఉస్మానియా యూనివర్శిటీ పక్కనే ఉన్న దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కాలనీలో మా నివాసం. నేను పదో తరగతివరకూ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాను. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంసీఏ చేశా. చదువుకొనే రోజుల్లోనే... సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్న మత్తడి ఉషాగాయత్రి వద్ద కూచిపూడి నేర్చుకున్నాను. ఎంసీఏ పూర్తయ్యాక చెన్నైకి ఉద్యోగ నిమిత్తం వెళ్లి అక్కడ వెంపటి చిన్న సత్యం డ్యాన్స్ స్కూల్‌లో రవిశంకర్ వెంపటి దగ్గర మూడేళ్లు శిక్షణ పొందాను. నేతి శ్రీరామశర్మ వద్ద కర్ణాటక శాస్త్రీయ సంగీతగ, డాక్టర్ ఆనంద శంకర్ జయంతి దగ్గర భారతనాట్యం అభ్యసించాను.

తోలు బొమ్మలకు వాయిస్ ఇచ్చాను...

మా అమ్మ రత్నమాల ఆర్ట్ టీచర్. ఆమె తోలు బొమ్మలను ఆడించేవారు. ప్రత్యేకంగా 'నోరి ఆర్ట్ పప్పెట్ సెంటర్'ను కూడా నిర్వహించారు. గ్రామాలకు వెళ్లి... స్త్రీ చైతన్యం, మద్యపాన నిషేధం... ఇలా ఎన్నో సామాజిక అంశాలపై తోలుబొమ్మలను ఆడిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేవారు. చిన్నప్పుడే అమ్మతో పాటు నేనూ వెళ్ళేదాన్ని. తోలుబొమ్మలకు వాయిస్ ఇచ్చేదాన్ని. నాలో సామాజిక బాధ్యత పెరగడానికి ఇది దోహదం చేసింది. పెళ్లి అయ్యాక అమెరికా వెళ్ళిన తర్వాత... అక్కడ నాలుగేళ్ల పాటు ఐటీ రంగంలో ఉద్యోగం చేశాను. ఇల్లు, ఆఫీసు... వీటితోనే సరిపోయేది. ఎంతో ఇష్టంగా నేర్చుకున్న కూచిపూడి, భరతనాట్యం, సంగీతం పరిస్థితేమిటని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. పిల్లలు పుట్టిన తర్వాత ఉద్యోగానికి స్వస్తి చెప్పాను. మేము అమెరికాలోని కనెక్టికట్‌లో ఉండేవాళ్ళం. అక్కడ మన వాళ్ళు ఉంటారు. అయితే... పిల్లలకు మన పండుగలు, మన సంస్కృతి, కళల గురించి, మన మూలాల గురించి తెలీదు. పూర్తిగా విదేశీ సంస్కృతిలోనే పెరగడం వల్ల... మన విలువలకు దూరంగా వాళ్ళు జీవిస్తున్నారు. పిల్లలకు కూచిపూడి, భరతనాట్యం నేర్పడం ద్వారా మన సంస్కృతి, కళల గురించి తెలియజేయాలనే ఆలోచన కలిగింది. నా భర్త ప్రవీణ్ ఆకెళ్ళ సహకారంతో కనెక్టికట్‌లో డ్యాన్స్ స్కూల్ ప్రారంభించాను.

అందుకు ఎంతో శ్రమపడ్డా...

చీర కట్టుతో చేసే కూచిపూడి నృత్య ప్రదర్శనలకు అక్కడ ఆదరణ ఉండేది కాదు. లైబ్రరీల్లో, పాఠశాలల్లో ప్రదర్శనలు ఇస్తే... విదేశీయులు అటువైపు చూసేవారు కాదు. భారతీయులు మాత్రమే వచ్చేవారు. ఇక... కళలను నేర్చుకోవడానికి కూడా తక్కువమందే వచ్చేవారు. 'ఇది ఎందుకు నేర్చుకోవాలి? అది అన్నం పెట్టదు' అనే ప్రశ్నలు వినిపించాయి. కళలు ఎంత గొప్పవో పిల్లల్లో అవగాహన కల్పించి, మన సంస్కృతిని గౌరవించాలని తల్లితండ్రులకు తెలియజెప్పడానికి... ఎంతో శ్రమపడ్డాను. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా... సంగీత, నృత్యాల విశిష్టతను వివరించాను. అలా... మొదట నలుగురితో ప్రారంభమైన మా స్కూల్‌లో... ఇప్పుడు 60 మంది ఉన్నారు. ఎక్కువ మంది దక్షిణ భారత దేశానికి చెందినవారే. సంగీతం నేర్చుకుంటున్నవారిలో విదేశీయులు కూడా ఉన్నారు. కనెక్టికట్‌లోని పలు వర్సిటీలు, కాలేజీల్లో... సంగీతాన్ని ఒక కోర్సులా నేర్పిస్తున్నాం. 'లయ విన్యాస' పేరుతో ఒక సంస్థను ప్రారంభించాం. దాని ద్వారా ప్రదర్శనలు ఇస్తున్నాం. ఇప్పుడు విదేశీయులు కూడా మన ప్రదర్శనలను ఆసక్తిగా చూస్తున్నారు. వివిధ సందర్భాల్లో మన ప్రదర్శనలకు అవకాశం ఇస్తున్నారు. అమెరికాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఐడియా'లో కూడా మేము ప్రదర్శన ఇచ్చాం.

> **"కూచిపూడి అయినా... భరతనాట్యమయినా... పురాణాలు, ఇతిహాసాల్లోని అంశాలను చెబుతున్నాం. సమకాలీన సామాజిక అంశాలను తీసుకొని నృత్య నాటకాలను తయారు చేస్తున్నాం. వాతావరణ మార్పులు, పర్యావరణ సంరక్షణ అవశ్యకతపై 'ధరణి' అనే కూచిపూడి నృత్య నాటిక తయారు చేశాం..పాశ్చాత్య దేశాల్లో మన కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాలనేదే నా లక్ష్యం."**



ఏ దేశమేగినా...

మా అమ్మాయి సహన కూచిపూడిలో, సంగీతంలో శిక్షణ పొందింది. మా అబ్బాయి కేదార్‌కి 16 ఏళ్లు. సంగీతంపై మక్కువతో మృదంగం నేర్చుకున్నాడు. 'తానా' సభలో ప్రదర్శన ఇచ్చి... మూడో బహుమతి అందుకున్నాడు. మన సంస్కృతి గురించి, మన కళల గురించి పిల్లలకు మనమే చెప్పాలి, నేర్పాలి. ఏ దేశమేగినా... మన సంస్కృతిని కాపాడుకోవడం ముఖ్యం. అమెరికాలో తెల్లవారు, నల్లవారి మధ్య సామాజిక అసమానతలు ఎక్కువగా ఉంటాయి. కానీ వారందరూ మన కల్చర్‌ను అర్థం చేసుకుంటారు. స్కూల్స్, కాలేజీలు, వర్సిటీలలో ప్రదర్శనలకు అవకాశమిస్తారు. ఇక్కడ ప్రదర్శన జరపకూడదనే అభ్యంతరాలు ఉండవు. తెలుగు, కన్నడ, మరాఠీ, ఇండియన్ అసోసియేషన్లు కూడా మంచి సహకారం అందిస్తాయి. పిల్లలు సంగీత, నృత్యాలను శ్రద్ధగా నేర్చుకోవడం కోసం సిలికాన్ ఆంధ్ర నిర్వాహకులు 'సంపద' అనే కేంద్రాన్ని ప్రారంభించి... తెలుగు యూనివర్సిటీ నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను మొదలుపెట్టారు. నా దగ్గర దాదాపు 35మంది శిక్షణ పొంది, సర్టిఫికెట్లను అందుకున్నారు.

పర్యావరణ స్పృహను కలిగించడం కోసం..

కూచిపూడి అయినా... భరతనాట్యమయినా... పురాణాలు, ఇతిహాసాల్లోని అంశాలను విదేశీయులను ఆకట్టుకొనేలా ప్రదర్శిస్తున్నాం. సమకాలీన సామాజిక అంశాలను తీసుకొని నృత్య నాటకాలను తయారు చేస్తున్నాం. వాతావరణ మార్పులు, పర్యావరణ సంరక్షణ అవశ్యకతపై 'ధరణి' అనే కూచిపూడి నృత్య నాటిక తయారు చేశాం.. మా అమ్మ ఆడించిన తోలుబొమ్మలను వినియోగించాం. మానవులకు, జంతుజాలానికి వాతావరణ మార్పులు ఏ విధంగా ఇబ్బంది కలిగిస్తున్నాయి, ప్లాస్టిక్‌తో ఎదురవుతున్న సమస్యలేమిటి? తదితర అంశాలను ప్రస్తావిస్తూ.. విజువల్స్‌తో సహా రూపొందించిన ఆ 40 నిమిషాల ప్రదర్శనకు ఎన్నో ప్రశంసలు లభించాయి. మన పండుగల విశిష్టతను చాటి చెప్పడానికి... సెప్టెంబర్‌లో ఒక ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాం. ఈ ప్రదర్శనలకు అక్కడి ప్రభుత్వం కూడా వివిధ గ్రాంట్స్ మంజూరు ద్వారా సాయం అందిస్తోంది. పాశ్చాత్య దేశాల్లో మన కళలు, సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పాలనేదే నా లక్ష్యం.'

• బయ్యు దామోదర్
ఫొటోలు: లవకుమార్

రైట్ రైట్...
ఈ కండక్టర్ కతే వేరు!

పబ్లిక్‌లో తిరిగే ఏ ఉద్యోగమైనా జర ఇబ్బందే ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్‌లో తిరిగే ఆర్టీసీ బస్సు కండక్టర్ల కష్టాలెంటో బస్సెక్కిన ఎవరికైనా.. ఎరుక! రాజేంద్రనగర్ బస్‌డిపోకు చెందిన **రాగమల్ల అనూప రాణి** ఫ్రెండ్లీ కండక్టర్ జాబ్‌కు పెట్టింది పేరు. ఇరవై నాలుగేళ్ల నుంచీ ప్రయాణికుల్ని ఏమాత్రం విసిగించకుండా.. నవ్వుతూ.. నవ్విస్తూ.. వృత్తిపట్ల అమితమైన ప్రేమను చూపించే అనూప రాణిని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమెను 'నవ్య' పలకరించిందిలా...

"మా సజ్జనార్ సర్ 'ప్రయాణీకులతో నవ్వుతూ మాట్లాడాలి. ఫ్రెండ్లీగా ఉండాలి' అంటుంటారని రాజేంద్రనగర్ డిపోలో చెబుతుంటారు. ప్రస్తుతం కంటి ఆపరేషన్ చేయించుకుని.. సెలవులో ఉన్నాను. ఇటీవల మా బస్సెక్కిన సిద్దార్థి సుభాష్ చంద్రబోస్ అనే ప్రయాణికుడు.. ఫేస్‌బుక్కులో నా గురించి రాశారు. అది చదివి.. ఫోన్ చేశానని సజ్జనార్ సార్ నాతో మాట్లాడారు. 'డ్రైవర్లు, కండక్టర్లు మన ఆర్టీసీ బస్సుకు అంబాసిడర్లు. ప్రయాణికులను కుటుంబ సభ్యుల్లా చూడటం గొప్ప విషయం. పని ఒత్తిడి ఉన్నా.. కష్టపడి పని చేయటం గ్రేట్. వృత్తిపట్ల ప్రేమ ఉండే మీలాంటి వాళ్లే సంస్థకు కావాల్సింది'ని ఎమ్‌డీ ప్రశంసించటం ఆనందంగా ఉంది.

మా బస్సుకోసం చూస్తరు..

చిన్నప్పటినుంచీ నా తీరే అంత! ఎవరైనా బాధల్లో ఉంటే కాస్త మాట్లాడించటం.. అలవాటు. ఎవరెవరో ఎన్నో కష్టాలతో మా బస్సెక్కుతారు. వాళ్లను మంచిగా పలకరిస్తే.. నాకు ఖర్చయ్యేదేమీ లేదు కదా! ఇరవై నాలుగేళ్ల నుంచీ ఒకటే బస్.. ఏపీ15జడ్ 0004. రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఈ బస్ ప్రతి రోజూ మెహదీపట్నం నుంచి ఆరాంఘర్, బండ్లగూడ, చంద్రాయణ గుట్ట మీదుగా ఉప్పల్ వెళ్తుంది. స్టాప్ వచ్చాక.. పెద్దవాళ్లను దిగబెడుతుంటే 'నువ్వు చల్లగుండాలె బిడ్డా' అంటూ ఆశీర్వదిస్తారు. 'ఇట్లుండా మరదలా..!' అంటూ మాట్లాడిస్తా. చుట్టపోళ్ల మాదిరి మాట్లడ్తరు. కాలేజీ పిల్లలు ఫోన్లు చూస్తుంటే.. 'కండ్లు గుంజకపోయినాయి. బుద్ధిగా చదువుకోండి పిల్లగాండ్లు. మీ ఇంట్లో వాళ్లు కాలేజీకి పంపిస్తే ఇట్లన చేసేది' అంటూనే... మెల్లగా ఫోన్లు జేబుల్లో పెట్టుకుంటారు. ఇలా బస్సులో మాటలు కలుపుతా. అందుకే 'నీ బస్సెక్కితే హుషారు అక్కా' అంటారు కొందరు.



> **తొలి జీతం అనాథలకు..**
>
> మాది రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామం. వ్యవసాయ కుటుంబం మాది. నాకు ముగ్గురు అక్కలు, ఒక అన్న.. నేనే చిన్నదాన్ని. అందరినీ చదివించారు మా నాన్న. ఉపాధికోసం హైదరాబాద్‌లోని ఉప్పర్‌పల్లి ప్రాంతానికి వచ్చాం. పదో తరగతి సెలవులు అయిపోయాక పరీక్ష రాసి కండక్టర్ కొలువు సంపాదించా. జీతం మూడు వేలు. 2000 సంవత్సరంలో మాకు ఈ జీతమే గొప్ప. అదిగాక.. సర్కారు ఉద్యోగం వచ్చినోళ్లు మా ఇంటావంటా లేరు. మావోళ్లు నా గురించి గొప్పగా మాట్లాడేవాళ్లు. మా నాన్న మాత్రం 'ఇంట్లో ఎన్ని కష్టాలున్నా బయటోళ్లమీద చిరాకు చూపించకు బిడ్డా' అని చెప్పారు. ఉదయం మా అన్నయ్య బస్సు దగ్గర వదిలేసి వచ్చేవారు. డ్యూటీ అయ్యాక నాన్న వచ్చి పికప్ చేసుకునేవారు. కొలువు ఎట్ల చేస్తనో ఏమో.. అనుకుంటూ కొన్నాళ్లు భయపడినా.. మెల్లగా నిలదొక్కుకున్నా. తొలి జీతం మొత్తం అనాథలకు ఇచ్చాను.

చదువుల్లోనూ తగ్గేదే లేదు..

వికారాబాద్‌లోని 'సంఘం లక్ష్మీబాయ్ కాలేజీ'లో చదివా. కండక్టరు ఉద్యోగం వచ్చాక.. హైదరాబాద్‌లోని వనితా కాలేజ్‌లో ఇంటర్ చదివా. 2005లో పెళ్లయ్యింది. మావారి పేరు ప్రవీణ్ కుమార్. నా ఉద్యోగానికి సహకరించారు. అంతేనా పీజీడీసీఏ చదివించారు. ఉస్మానియా యూనివర్శిటీ కింద డిస్టెన్స్‌లో ఎం.ఏ.సోషియాలజీ, ఎం.ఏ.ఇంగ్లీష్ లిటరేచర్ చదివించారు. మాకు ఒక కొడుకు. ఉద్యోగ నిర్వహణలో బిజీగా ఉంటాను కాబట్టి.. మా అమ్మానాన్నే బాబును చూసుకుంటారు. ఏడేళ్ల కిందట గ్రూప్-2 రాస్తానంటే.. 'సరే' అన్నారు మా వారు. అందుకు తగినట్లు అండగా నిలిచారు. తెల్లారుజామున నాలుగు గంటలకే ఇంటినుంచి బయలుదేరి.. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఆర్.సి.స్టడీ సర్కిల్‌కు ఐదు గంటలకు చేరుకునేదాన్ని. మా గురువులు 'అనూప.. ఎందుకింత కష్టం?' అనేవాళ్లు. మధ్యాహ్నం పన్నెండయ్యాక.. అట్నుంచి అటే డూటీకి ఉరికేదాన్ని. పది నెలల పాటు అలా కష్టపడ్డా. గ్రూప్-2 పరీక్షయితే పాసయ్యా కానీ.. ఇంటర్వ్యూ పోయింది. ఇప్పుడు మా అబ్బాయి బీటెక్‌కి వచ్చినా.. నేను ఏదో ఒక కాంపిటీషన్ ఎగ్జామ్ రాస్తుంటా. ఉద్యోగం కొట్టాలని కాదు.. పది మంది పిల్లలకు గైడ్ చేయవచ్చు కదా! అనేది ఆలోచన. ఇపుడు నా వయసు నలభై ఆరేళ్లు. ఇకమీదట పరీక్షలకు దరఖాస్తు చేయటానికి కుదరదేమో! అన్నట్లు ప్రతి రోజూ తెలుగు, ఇంగ్లీషు పత్రికలు చదువుతా. ఎంత చదివినా.. కండక్టరు ఉద్యోగమే నా పర్మినెంటు ఉద్యోగం(నవ్వులు).

• రాళ్లపల్లి రాజావలి

ఆర్‌ఎస్ బ్రదర్స్ ఆషాఢం సేల్



హైదరాబాద్: వస్త్రాల రిటైలింగ్‌లో అగ్రగామి సంస్థల్లో ఒకటైన ఆర్‌ఎస్ బ్రదర్స్ ఆషాఢం సేల్స్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా 70 శాతం తగ్గింపు ధరలకే "కేజీ సేల్స్" నిర్వహిస్తున్నామని, వస్త్రాభిమానులను ఈ ఆఫర్ విశేషంగా ఆకర్షిస్తున్నదని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మహిళలు చూపుతున్న ఈ అభిమానాన్ని దృష్టిలో ఉంచుకుని వైవిధ్యభరితమైన కొత్త స్టాక్‌ను తమ స్టోర్లలో ప్రతీ రోజూ విక్రయానికి పెడుతున్నట్టు వెల్లడించింది. అలాగే రాబోయే పర్వదినాలు, శుభకార్యాలను దృష్టిలో ఉంచుకుని కంచి పట్టు చీరలను సొసైటీ ధరలకే విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్/క్రెడిట్ కార్డులపై ఈఎంఐ సదుపాయం సైతం అందిస్తున్నామని, రూ.5000 వరకు తక్షణ డిస్కౌంట్ కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు.

టర్మ్ పాలసీలు మరింత ప్రియం

ప్రీమియం 10 శాతం వరకు పెంచిన కంపెనీలు



న్యూఢిల్లీ: జీవితానికి జరగరానిది ఏమైనా జరిగితే ఆదుకునే టర్మ్ పాలసీలు మరింత ప్రియంగా మారాయి. కొన్ని బీమా కంపెనీలు ఇప్పటికే ఈ పాలసీల ప్రీమియాన్ని పది శాతం వరకు పెంచేశాయి. మిగతా బీమా కంపెనీలూ త్వరలో ఇదే బాట పడతాయని పరిశ్రమ వర్గాల అంచనా. ఆరు పదుల వయసు దాటిన వారి టర్మ్ పాలసీల ప్రీమియం మరింత ప్రియంగా మారనుంది. బీమా కంపెనీల వార్షిక ప్రీమియం వసూళ్లలో టర్మ్ పాలసీల ప్రీమియం వాటా ఐదు శాతం మాత్రమే. అయినా బీమా కంపెనీలు ఈ పాలసీల ప్రీమియం పెంచేయడం విశేషం.

కంపెనీల వారీగా: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలయెన్స్, టాటా ఏఐఏ కంపెనీలు ఇప్పటికే తమ టర్మ్ పాలసీల ప్రీమియం 10 శాతం వరకు పెంచాయి. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కంపెనీ 60 ఏళ్ల వయసు పైబడిన వారి టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియాన్ని 10 శాతం వరకు పెంచింది. మ్యాక్స్ లైఫ్ కంపెనీ కూడా అన్ని వయసుల వారి టర్మ్ పాలసీల ప్రీమియాన్ని ఒకటి నుంచి ఆరు శాతం వరకు పెంచింది. టాటా ఏఐఏ అన్ని వయసుల వారి టర్మ్ పాలసీల ప్రీమియాన్ని మూడు నుంచి 10 శాతం పెంచింది. ఐసీఐసీఐ ప్రూడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా త్వరలో తన టర్మ్ పాలసీల ప్రీమియాన్ని మూడు నుంచి ఐదు శాతం పెంచబోతున్నట్టు సమాచారం.

ఎందుకంటే?

- పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా టర్మ్ పాలసీల ప్రీమియాన్ని సర్దుబాటు చేయాల్సి రావడం.
- రిస్క్ కవరేజి ఎక్కువగా ఉండే టియర్- 2 కవరేజిలు పెరిగిపోవడం.
- రీ-ఇన్సూరెన్స్ ప్రీమియంలు కూడా పెరిగిపోవడం.

సామ్‌సంగ్ గెలాక్సీ రింగ్

» తొలిసారిగా స్మార్ట్ రింగ్స్ విభాగంలోకి సంస్థ

» గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, ఫ్లిప్ 6 ఫోన్ల లాంచ్



ప్యారిస్: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్ దిగ్గజం సామ్‌సంగ్ ప్యారిస్‌లో నిర్వహించిన అన్‌ప్యాక్డ్ కార్యక్రమంలో గెలాక్సీ రింగ్‌ను లాంచ్ చేసింది. తద్వారా కంపెనీ స్మార్ట్ రింగ్‌ల విభాగంలోకి ప్రవేశించింది. ఈ స్మార్ట్ రింగ్ ద్వారా వ్యక్తులు తమ గుండె పనితీరు, నిద్ర, వ్యాయామాలను.. మహిళలైతే తమ రుతు కాలచక్రాన్ని సైతం ట్రాక్ చేసుకునే వీలుంటుంది. 2.3 గ్రాములు, 3 గ్రాముల సైజులో ఉండే ఈ రింగ్ మూడు రంగుల్లో లభిస్తుంది. 10 ఏటీఎం వాటర్ రెసిస్టెన్స్, టైటానియమ్ గ్రేడ్ 5 ఫినిష్‌తో కూడిన ఈ రింగ్ సింగిల్ చార్జ్‌తో ఏడు రోజుల పాటు పనిచేస్తుందని కంపెనీ తెలిపింది. దీని ప్రారంభ ధర 399 డాలర్లు. భారత మార్కెట్‌లో స్మార్ట్ రింగ్ రేటు, ఎప్పటి నుంచి అందుబాటులోకి తేనున్న విషయాల్ని మాత్రం ఇంకా వెల్లడించాల్సి ఉంది.

సామ్‌సంగ్ ఈ కార్యక్రమంలో గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6, ఫ్లిప్ 6 ఫోన్లతోపాటు గెలాక్సీ వాచ్ 7, గెలాక్సీ వాచ్ 'అల్ట్రా'ను, గెలాక్సీ బడ్స్ 3, 'బడ్స్ ప్రో' ను సైతం లాంచ్ చేసింది. స్నాప్‌డ్రాగన్ 8 జెనరేషన్ 3 చిప్‌సెట్, 7.6 అంగుళాల 120 హెర్ట్జ్ ఏఎమ్‌ఓఎల్ఈడీ డిస్‌ప్లేతో కూడిన గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 6 బేస్ వేరియంట్ (256 జీబీ ర్యామ్) ధర రూ.1,64,999. 512జీబీ రేటు రూ.1,76,999. ఒక టీబీ వేరియంట్ ధర రూ.2,00,999గా ఉంది. గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 6లో 256జీబీ వేరియంట్ ధరను కంపెనీ రూ.1,09,999గా నిర్ణయించింది. తన కొత్త ఉత్పత్తుల ప్రీ- బుకింగ్‌ను బుధవారం నుంచి ప్రారంభించిన సామ్‌సంగ్.. ఈనెల 24 నుంచి విక్రయాలు ప్రారంభమవుతాయని వెల్లడించింది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

80000 దిగువకు సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం సరికొత్త గరిష్ఠాల వద్ద ట్రేడింగ్ ఆరంభించినప్పటికీ ఇన్వెస్టర్లు మెటల్, ఐటీ, ఆటో షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు దిగడంతో భారీగా నష్టపోయాయి. ఫెడ్ రేట్ల తగ్గింపుపై అనిశ్చితి పెరగడం కూడా మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. సెన్సెక్స్ 129.72 పాయింట్ల లాభంతో సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి 80,481.36 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. భారీగా ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో సూచీ ఒకదశలో 915.88 పాయింట్లు క్షీణించి 79,435.76 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆఖరి గంటలో జరిగిన కొనుగోళ్లతో సూచీ కాస్త కోలుకున్నప్పటికీ, 426.87 పాయింట్ల నష్టంతో 79,924.77 వద్ద ముగిసింది. దాంతో సూచీ 80,000 కీలక స్థాయిని చేజార్చుకున్నట్లైంది. నిఫ్టీ సైతం సరికొత్త రికార్డు స్థాయి 24,461.05 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించినప్పటికీ.. ఒకదశలో 291.4 పాయింట్లు పతనమైంది. చివరికి 108.75 పాయింట్ల నష్టంతో 24,324.45 వద్ద స్థిరపడింది.

- అమ్మకాల హోరులో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.22 లక్షల కోట్లు తగ్గి రూ.450.05 లక్షల కోట్లకు (5.39 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. ఉదయం సెషన్‌లో సూచీల భారీ నష్టాల కారణంగా మార్కెట్ క్యాప్ కూడా 7 లక్షల కోట్ల వరకు పతనమైంది.



కెనరా బ్యాంక్ రూ.1838 కోట్ల డివిడెండ్

బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.1838 కోట్ల చెక్కును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు అందచేశారు. ఇది బ్యాంకు ఆర్థిక స్వస్థతలోని శక్తికి, వాటాదారుల సొమ్ముకు విలువ కల్పించడంలో కట్టుబాటుకు దర్పణం పడుతుందని ఈ సందర్భంగా రాజు అన్నారు.

మరో మూడు బ్యాంకులు కూడా...

మరో మూడు బ్యాంకులు కూడా ఆర్థికమంత్రికి డివిడెండు చెక్కులు అందచేశాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) మేనేజింగ్ డైరెక్టర్ దేవదత్త చంద్ రూ.2514.22 కోట్ల చెక్కును అందచేశారు. ఇండియన్ బ్యాంక్ రూ.1193.45 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.935.44 కోట్లు డివిడెండ్‌గా చెల్లించాయి. వీటితో పాటు ఎగ్జిమ్ బ్యాంక్ కూడా రూ.252 కోట్ల చెక్కు అందించింది.

ఎస్‌బీఐ రూ.10 వేల కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించినట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ బుధవారం వెల్లడించింది. 15 ఏళ్ల కాల పరిమితితో కూడిన ఈ బాండ్లపై ఏటా రూ.7.36 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. మౌలిక సదుపాయాలు, అందుబాటు గృహాల నిర్మాణ రంగ సంస్థలకు దీర్ఘకాలిక రుణాలందించేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు ఎస్‌బీఐ స్పష్టం చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,250 ▲	67,200 ▲	98,500 ▼
ముంబై	72,620 ▲	66,520 ▲	91,790 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	129
కర్నూలు	105	నెల్లూరు	129
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

వచ్చే మార్చి నాటికి 50 స్టోర్ల టార్గెట్

» రివర్ ఈవీ సీఈఓ అరవింద్ మణి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థ రివర్ వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో 50 స్టోర్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం బెంగళూరులో రెండు స్టోర్లు నిర్వహిస్తున్న ఆ కంపెనీ బుధవారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అరవింద్ మణి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈవీలకు మంచి డిమాండు ఉన్నదని, అందుకే బెంగళూరు వెలుపల తొలి స్టోర్‌ను ఇక్కడ ప్రారంభించామని చెప్పారు. ఈ సందర్భంగా 30 స్కూటర్లను కస్టమర్లకు అందించామని ఇక్కడ 500 ఈవీలకు ఆర్డర్ చేతిలో ఉన్నదని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న స్టోర్లలో మరో మూడు హైదరాబాద్‌లో ఉంటాయని, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ, విశాఖపట్టణం నగరాల్లో కూడా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నామని తెలిపారు. తమ విద్యుత్ స్కూటర్ ఇండీ ఎక్స్ షోరూమ్ ధర హైదరాబాద్‌లో రూ.1,38,000 అని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం బెంగళూరులో తమ ఫ్యాక్టరీ ఉన్నదంటూ, 2026 నాటికి మరో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే యోచన ఉన్నదని, అందుకోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా కొన్ని రాష్ట్రాలు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

అదానీ కంపెనీలో అంబానీకి వాటా

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీ.. రెండో అత్యంత ధనికుడైన గౌతమ్ అదానీ కంపెనీలో స్వల్ప వాటాను చేజిక్కించుకున్నారు. అదానీ పవర్ లిమిటెడ్ అనుబంధ విభాగమైన మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో (ఎంఈఎల్) 5 కోట్ల షేర్లను రూ.50 కోట్లకు అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోలు చేసింది. తద్వారా ఎంఈఎల్‌లో రిలయన్స్‌కు 26 శాతం వాటా దక్కింది. ఈ డీల్‌లో భాగంగానే రెండు కంపెనీల మధ్య 20 ఏళ్ల కాలానికి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ కుదిరింది. ఎంఈఎల్‌కు మధ్యప్రదేశ్‌లో ఉన్న 600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్.. రిలయన్స్‌కు పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ సరఫరా చేయనుంది.

గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్ నుంచి వైదొలగనున్న గ్లెన్‌మార్క్ ఫార్మా


గ్లెన్‌మార్క్ లైఫ్ సైన్సెస్‌లో తనకున్న 7.84 శాతం వాటా కూడా విక్రయించడం ద్వారా కంపెనీ నుంచి పూర్తిగా వైదొలగనున్నట్లు గ్లెన్‌మార్క్ ఫార్మా బుధవారం వెల్లడించింది. ఈనెల 11, 12 తేదీల్లో ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన ఈవాటా షేర్లను, ఒక్కొక్కటి రూ.810 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపింది. అనగా, ఈ డీల్ విలువ రూ.778 కోట్లుగా ఉండనుంది.

హైదరాబాద్‌లో మెడ్‌ట్రానిక్స్ గ్లోబల్ ఐటీ సెంటర్

హైదరాబాద్: మెడికల్ టెక్నాలజీ రంగంలోని మెడ్‌ట్రానిక్స్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను (ఎంఈఐసీ) ప్రారంభించింది. తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి డి.శ్రీధర బాబు, అమెరికన్ కాన్సల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, కంపెనీ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాబోయే మూడు నుంచి ఐదు సంవత్సరాల కాలంలో ఈ సెంటర్‌పై 6 కోట్ల డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నామని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సీఐఓ రష్మీ కుమార్ తెలిపారు.

టాటా, మహీంద్రా ఎస్‌యూవీ ధరలు తగ్గింపు

న్యూఢిల్లీ: డిమాండును ఉద్దీపింపచేయడం కోసం టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వివిధ ఎస్‌యూవీల ధరను తగ్గించాయి. తమ ప్రధాన ఎస్‌యూవీల్లో హారియెర్ ప్రారంభ ధరను రూ.14.99 లక్షలకు, సఫారీ ధరను రూ.15.49 లక్షలకు తగ్గించడంతో పాటు వివిధ ఎస్‌యూవీ వేరియెంట్లపై రూ.1.4 లక్షల మేరకు అదనపు ప్రయోజనాలు అందిస్తున్నట్టు టాటా మోటార్స్ తెలిపింది. మహీంద్రా ఎక్స్‌యూవీ 700 ఎX7 ధరను రూ.2 లక్షల మేరకు తగ్గించడంతో ఇప్పుడది రూ.19.49 లక్షలకు దిగివచ్చింది.



గంభీర్ 'ప్యాకేజీ' ఎంత?

న్యూఢిల్లీ: ఈనెలలో జరిగే శ్రీలంక పర్యటన నుంచి భారత జట్టు కొత్త కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టనున్నాడు. అయితే జీతభత్యాలకు సంబంధించి గంభీర్, బీసీసీఐ ఇంకా ఓ నిర్ణయానికి రాలేదని తెలిసింది. 'ప్యాకేజీ'కంటే కూడా రాబోయే మూడేళ్లలో తనకు ఎదురవనున్న సవాళ్లు, వాటిని అధిగమించే క్రమంలో ఏర్పాటు చేసుకోవాల్సిన సహాయ సిబ్బందిపైనే గౌతీ ప్రస్తుతం దృష్టి సారించినట్టు సమాచారం. గంభీర్‌ను టీమిండియా హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి జై షా మంగళవారం ప్రకటించిన విషయం విదితమే. గంభీర్ శాలరీ ఎంతో ఇతమిత్థంగా ఖరారు కాకున్నా..అతడికి ముందు పనిచేసిన రవిశాస్త్రి, ద్రవిడ్‌లు మాదిరే ఉండనున్నట్టు బోర్డు వర్గాలు వెల్లడించాయి. ఇక..తన సహాయ సిబ్బందిగా అభిషేక్ నాయర్ (బ్యాటింగ్ కోచ్), ఎల్.బాలాజీ లేదా జహీర్ ఖాన్ (బౌలింగ్ కోచ్), మునీష్ బాలి (ఫీల్డింగ్ కోచ్)ని గంభీర్ ఎంపిక చేసుకోనున్నట్టు సమాచారం. మునీష్ ప్రస్తుతం మహిళల జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

కుర్రాళ్లు.. అదే జోరు

వరుసగా రెండో విజయం

- రాణించిన గిల్, రుతురాజ్
- తిప్పేసిన సుందర్
- మూడో టీ20లో జింబాబ్వే చిత్తు



గిల్ (49 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66)



వాషింగ్టన్ సుందర్ (4-0-15-3)

హరారే: సమష్టిగా రాణించిన భారత యువ జట్టు.. జింబాబ్వే టూర్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. శుభ్‌మన్ గిల్ (49 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66), రుతురాజ్ గైక్వాడ్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 49) బ్యాట్‌తో అదరగొట్టగా.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' వాషింగ్టన్ సుందర్ (4-0-15-3) బంతితో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. ఫలితంగా బుధవారం జరిగిన మూడో టీ20లో భారత్ 23 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. 5 టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సాధించింది. ఇరుజట్ల మధ్య నాలుగో మ్యాచ్ శనివారం జరగనుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 182/4 స్కోరు చేసింది. సికందర్ రజా, ముజరబాని చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (36), కెప్టెన్ గిల్ జట్టుకు శుభారంభాన్నిచ్చారు. టీ20 వరల్డ్‌కప్‌లో బెంచ్‌కే పరిమితమైన జైస్వాల్.. ఇక్కడ ఆరంభం నుంచే దూకుడైన బ్యాటింగ్ చేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి టీమిండియా 55/0తో మెరుగైన స్థితిలో నిలిచింది. అయితే, జైస్వాల్‌ను రజా క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. గత మ్యాచ్‌లో సెంచరీ సాధించిన అభిషేక్ శర్మ (10) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కానీ, ఆ తర్వాత వచ్చిన రుతురాజ్.. జింబాబ్వే బౌలర్ల పనిబట్టాడు. గిల్‌తో కలసి మూడో వికెట్‌కు 44 బంతుల్లో 72 పరుగుల భాగస్వామ్యంతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అర్ధ శతకం సాధించిన గిల్‌తోపాటు గైక్వాడ్‌ను ముజరబాని పెవిలియన్ చేర్చాడు. అయితే, సంజూ శాంసన్ (12 నాటౌట్), రింకూ సింగ్ (1 నాటౌట్) జట్టు స్కోరును 180 మార్క్ దాటించారు. ఛేదనలో జింబాబ్వే ఓవర్లన్నీ ఆడి 159/6 స్కోరుకే పరిమితమైంది. ఆవేశ్ ఖాన్ (2/39), సుందర్ దెబ్బకు 7 ఓవర్లలో 39/5తో పీకల్లోతు కష్టాల్లోపడ్డ జింబాబ్వేను డియాన్ మేయర్స్ (65 నాటౌట్) ఆదుకొనే ప్రయత్నం చేశాడు. క్లైవ్ మడండి (37)తో ఆరో వికెట్‌కు 77 రన్స్ జోడించిన మేయర్స్.. మసకద్జా (18 నాటౌట్) జతగా 43 పరుగుల భాగస్వామ్యంతో చివర్లో పోరాడాడు. ప్రపంచకప్ జట్టు సభ్యులు జైస్వాల్, శాంసన్, దూబే జట్టులోకి రావడంతో.. జితేష్, పరాగ్, సుదర్శన్ బెంచ్‌కే పరిమితం కావాల్సి వచ్చింది.

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) బ్రయన్ (బి) రజా 36, గిల్ (సి) రజా (బి) ముజరబాని 66, అభిషేక్ (సి) మరుమణి (బి) రజా 10, రుతురాజ్ (సి) మదెవెరె (బి) ముజరబాని 49, శాంసన్ (నాటౌట్) 12, రింకూ సింగ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 8; **మొత్తం: 20 ఓవర్లలో 182/4; వికెట్ల పతనం:** 1-67, 2-81, 3-153, 4-177; **బౌలింగ్:** బెన్నెట్ 1-0-15-0, ఎన్‌గరవ 4-0-39-0, చతార 3-0-30-0, ముజరబాని 4-0-25-2, రజా 4-0-24-2, మసకద్జా 3-0-25-0, మదెవెరె 1-0-19-0.

జింబాబ్వే: మదెవెరె (సి) అభిషేక్ (బి) ఆవేశ్ 1, మరుమణి (సి) దూబే (బి) ఖలీల్ 13, బెన్నెట్ (సి) బిష్ణోయ్ (బి) ఆవేశ్ 4, మేయర్స్ (నాటౌట్) 65, రజా (సి) రింకూ (బి) సుందర్ 15, క్యాంప్‌బెల్ (సి/సబ్) పరాగ్ (బి) సుందర్ 1, క్లైవ్ మడండి (సి) రింకూ (బి) సుందర్ 37, మసకద్జా (నాటౌట్) 18, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 159/6; వికెట్ల పతనం:** 1-9, 2-19, 3-19, 4-37, 5-39, 6-116; **బౌలింగ్:** ఖలీల్ 4-0-15-1, ఆవేశ్ 4-0-39-2, బిష్ణోయ్ 4-0-37-0, సుందర్ 4-0-15-3, అభిషేక్ 2-0-23-0, దూబే 2-0-27-0.

దటీజ్ ద్రవిడ్!

2.50 కోట్లు చాలు

నజరానాలో సగం తగ్గించుకున్న మాజీ కోచ్



న్యూఢిల్లీ: తానాడే రోజుల్లో 'జెంటిల్మన్'గా ప్రశంసలందుకున్న క్రికెటర్ రాహుల్ ద్రవిడ్.. రిటైరై కోచ్‌గా కొనసాగిన తర్వాతా అదే శైలిని కొనసాగించి దటీజ్ ద్రవిడ్ అనిపించుకున్నాడు. టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిచిన టీమిండియాకు బీసీసీఐ ప్రకటించిన రూ. 125 కోట్ల నజరానాలో హెడ్ కోచ్‌గా ద్రవిడ్ రూ. 5 కోట్లు అందుకోవాల్సి ఉంది. ఇక బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లకు రూ. 2.50 కోట్ల చొప్పున బోనస్‌గా ఖరారు చేశారు. అయితే బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ కోచ్‌లతో సమానంగా తనకు రూ. 2.50 కోట్లు చాలని బీసీసీఐకి ద్రవిడ్ తెలియజేశాడు. తద్వారా తన వ్యక్తిత్వాన్ని అతడు చాటుకున్నాడు. 2018లోనూ ద్రవిడ్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్నాడు. ఆ ఏడాది భారత జట్టు అండర్-19 ప్రపంచ కప్ గెలుచుకుంది. అప్పట్లో యువ జట్టు కోచ్‌గా ద్రవిడ్‌కు రూ. 50 లక్షల రివార్డు ప్రకటించారు. ఇతర సహాయ సిబ్బందికి రూ. 20 లక్షల చొప్పున, క్రికెటర్లకు రూ. 30 లక్షల చొప్పున ప్రకటించారు. అయితే తనకు, ఇతర సహాయ సిబ్బందికి బోనస్ విషయంలో భేదం వద్దని ద్రవిడ్ అప్పుడు కూడా బోర్డుకు స్పష్టంజేశాడు. దాంతో బోనస్‌ను సవరించిన బీసీసీఐ.. ద్రవిడ్ సహా సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ. 25 లక్షలు అందజేసింది. ఇదీ ద్రవిడ్ వ్యక్తిత్వం అంటూ క్రికెట్ ఫ్యాన్స్, నెటిజన్లు అతడికి జేజేలు పలుకుతున్నారు.



రాష్ట్రపతి భవన్‌లో బుధవారం షట్లర్ సైనా నెహ్వాల్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఫైనల్లో స్పెయిన్

ఫ్రాన్స్‌పై 2-1తో గెలుపు

మ్యూనిచ్: సూపర్ ఫామ్‌లో ఉన్న స్పెయిన్.. యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం రాత్రి జరిగిన తొలి సెమీఫైనల్ పోరులో స్పెయిన్ 2-1తో ఫ్రాన్స్‌ను ఓడించింది. టోర్నీలో ఇంత వరకు ఒక్క ఫీల్డ్ గోల్ కూడా నమోదు చేయని ఫ్రెంచ్ జట్టు 9వ నిమిషంలోనే ఖాతా తెరిచి ప్రత్యర్థికి షాకిచ్చింది. ఎంబప్పే కొట్టిన క్రాస్‌ను రండల్ కోలో మువాని హెడర్ ద్వారా గోల్ చేయడంతో ఫ్రాన్స్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వెంటనే తేరుకొన్న స్పెయిన్.. ఫ్రాన్స్ గోల్ పోస్టుపై దాడుల ఉధృతిని పెంచి ఫలితం సాధించింది. 21వ నిమిషంలో స్ట్రయికర్ లామిన్ యమల్ కళ్లు చెదిరే గోల్‌తో స్కోరు 1-1తో సమం చేసింది. దీంతో యూరో కప్ చరిత్రలో గోల్ చేసిన పిన్న వయస్కుడిగా 16 ఏళ్ల యమల్ రికార్డు సృష్టించాడు. ఇది జరిగిన నాలుగు నిమిషాలకే డాని ఓల్మో మరో గోల్ చేసి స్పెయిన్‌ను 2-1 ఆధిక్యంలో నిలిపాడు. పెనాల్టీ ఏరియాలో ఓల్మో కొట్టిన క్రాస్ ఫ్రాన్స్ డిఫెండర్ జులెస్ కాలికి తగిలి గోల్‌లో పడింది. దీన్ని తొలుత ఓన్ గోల్‌గా ప్రకటించినా.. ఆ తర్వాత ఓల్మో పేరిట మార్చారు. ఇక, సెకండాఫ్‌లో ఇరుజట్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా సఫలం కాలేకపోయాయి. చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకొన్న స్పెయిన్ అజేయంగా టైటిల్ ఫైట్‌కు చేరుకొంది.



యూరో కప్



ఎంబప్పే

జొకో మరో అడుగు

సెమీఫైనల్లో సెర్బియా స్టార్ ● రిబకినాతో క్రెజికోవా ఢీ



వింబుల్డన్

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ ట్రోఫీని ఎనిమిదోసారి అందుకొనే దిశగా వెటరన్ స్టార్ నొవాక్ జొకోవిచ్ మరో అడుగు వేశాడు. ఈ సెర్బియా వీరుడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అడుగుపెట్టాడు. 9వ సీడ్ అలెక్స్ డిమినార్‌తో జొకో క్వార్టర్‌ఫైనల్లో తలపడాల్సి ఉంది. అయితే తుంటి గాయంతో ఆస్ట్రేలియా ఆటగాడు డిమినార్ మ్యాచ్‌కు ముందే వైదొలిగాడు. దాంతో 25వ సీడ్ ముసేటితో శుక్రవారం జరిగే సెమీస్‌లో జొకో తలపడతాడు. మరో క్వార్టర్స్‌లో ముసేటి 3-6, 7-6(5), 6-2, 3-6, 6-1తో 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్‌ను కంగుతినిపించాడు. మహిళల సింగిల్స్‌లో 4వ సీడ్ ఎలెనా రిబకినా, 31వ సీడ్ క్రెజికోవా సెమీస్‌లో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వార్టర్‌ఫైనల్స్‌లో రిబకినా 6-3, 6-2తో 21వ సీడ్ స్విటోలినాను చిత్తు చేయగా, క్రెజికోవా 6-4, 7-6 (4)తో 13వ సీడ్ ఒస్టాపెంకోకు షాకిచ్చింది. మహిళల మరో సెమీఫైనల్లో అన్‌సీడెడ్ డొనా వెకిక్, 7వ సీడ్ జాస్మిన్ పౌలినీ తలపడతారు.

శాప్ కోచ్‌లతో సీఎం కార్యదర్శి భేటీ

అమరావతి (ఆంధ్రజ్యోతి): శాప్ కోచ్‌ల ఆందోళనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది. సీఎం చంద్రబాబు, రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న.. ఔట్‌సోర్సింగ్ కోచ్‌లను సచివాలయంలోని సీఎంవోకి పిలిపించుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. అంతేకాకుండా కోచ్‌ల పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించేందుకు అంగీకారం తెలిపారు.

అట్కిన్సన్ విజృంభణ

లార్డ్స్: ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ అరంగేట్ర టెస్ట్‌లోనే అదరగొట్టాడు. అతడు ఏడు (7/45) వికెట్లతో చెలరేగడంతో ఇంగ్లండ్‌తో బుధవారం మొదలైన తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ 121 పరుగులకే కుప్పకూలింది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆతిథ్య జట్టు తొలిరోజు ఆట ముగిసేసరికి 3 వికెట్లకు 198 రన్స్ చేసింది.



భళా.. అర్జెంటీనా

- కోపా కప్ తుదిపోరుకు మెస్సీసేన
- సెమీస్‌లో కెనడాపై 2-0తో గెలుపు

ఈస్ట్ రూథర్‌ఫర్డ్ (యూఎస్): కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్‌లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా టైటిల్ నిలబెట్టుకునేందుకు అడుగుదూరంలో నిలిచింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన సెమీఫైనల్లో మెస్సీ బృందం 2-0తో కెనడాను చిత్తుచేసి ఫైనల్‌కు దూసుకెళ్లింది. కెప్టెన్ మెస్సీ 51వ నిమిషంలో గోల్ కొట్టి తన జట్టును గెలిపించాడు. మెస్సీకిది కెరీర్‌లో 109వ అంతర్జాతీయ గోల్. అంతకుముందు అల్వారెజ్ (22వ) జట్టుకు తొలి గోల్ అందించాడు. గత 9 ఎడిషన్లలో అర్జెంటీనాకు ఇది ఏడో ఫైనల్. ఉరుగ్వే, కొలంబియా మధ్య జరిగే రెండో సెమీస్ విజేతతో అర్జెంటీనా ఫైనల్లో తలపడనుంది.



అశ్లీల రాతల పోస్టర్‌ను చూపిస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు

- అశ్లీల రాతలు, అసభ్యకర పోస్టింగులతో వేధించారు
- మాజీ మంత్రి సీదిరి ప్రోద్బలంతో నీచమైన కామెంట్లు
- కోర్టును ఆశ్రయించిన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

శ్రీకాకుళం(ఆంధ్రజ్యోతి)/డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), జూలై 10: ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తనపై, తన కుటుంబంపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత విమర్శలు, అసభ్యకర వ్యాఖ్యలు చేసినవారిని కఠినంగా శిక్షించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. వీటన్నింటిపై ఆమె విశాఖపట్నం రెండో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో దావా వేశారు. వ్యాజ్యం విచారణలో భాగంగా బుధవారం న్యాయమూర్తి ఎదుట ఎమ్మెల్యే హాజరయ్యారు. అశ్లీల రాతలు, అసభ్యకర పోస్టింగులతో తనను, తన కుటుంబాన్ని సామాజిక మాధ్యమాల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎలా వేధించారో వివరించారు. అనంతరం కోర్టు ఆవరణలో విలేకరులతో శిరీష మాట్లాడారు. 'ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా రాజకీయ విమర్శలు సర్వసాధారణం. కానీ గత ఐదేళ్లలో టీడీపీలో న్యాయబద్ధంగా, నీతిగా పోరాడే ప్రతి మహిళ సోషల్ మీడియా ద్వారా వేధింపులకు గురయ్యారు. మహిళలను మాటలతోనూ, మార్ఫింగ్ ఫొటోలతోనూ ఇబ్బంది పెట్టారు. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు ఓ 20 మందిని పోషిస్తూ నాపైన, నా తండ్రిపైన అసభ్యకరంగా మాట్లాడించారు. నీచమైన కామెంట్లు పెట్టించారు. వేధింపులపై పలాస పోలీస్ స్టేషన్‌లో ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అందుకే న్యాయపోరాటానికి దిగాను. అకారణంగా నాపై, మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. హోంమంత్రి అనిత కూడా సోషల్ మీడియా వేధింపులకు గురయ్యారు. ఆడపిల్లలపై అసభ్యకరంగా పోస్టులు పెట్టేవారిని కఠినంగా శిక్షించాలి' అని ఆమె కోరారు. ఇటువంటి సమస్యలున్న మహిళలు ఎవరూ మనస్తాపానికి లోనవకుండా న్యాయపోరాటం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో బాధితులెవరికైనా తన సహాయం ఎప్పుడూ ఉంటుందని శిరీష భరోసా ఇచ్చారు.

అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుకు పచ్చజెండా

- 25వేల కోట్లతో నిర్మాణానికి కేంద్రం అంగీకారం: పురందేశ్వరి

విజయవాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. మొత్తం 189 కిలోమీటర్ల పరిధిలో రూ.25వేల కోట్ల వ్యయంతో చేపట్టేందుకు నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. దీంతో రానున్న కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు భారీగానే కేటాయింపులు జరిపే అవకాశం కనిపిస్తోంది.

ఆర్థిక సర్వేపై స్పందించే దమ్ముందా జగన్?: యనమల

అమరావతి, జులై 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రం ఎంతగా దిగజారిపోయిందో ఆర్థిక సర్వే కళ్లకు కట్టిందని, దానిపై స్పందించే దమ్ము జగన్‌కు ఉందా అని శాసనమండలి ప్రతిపక్ష నేత, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక ఆర్థిక సర్వే 2022-23 వైసీపీ పాలనలో కీలక రంగాలు ఎంత పతనం చెందిందో ఆధారాలతో నిరూపించిందని, రాష్ట్రం ఆర్థిక ప్రగతి కుప్పకూలిన తీరును ప్రదర్శించిందన్నారు. 'వందేళ్ల వ్యవసాయ చరిత్రలో ఎన్నడూ లేనంతగా పంటల సాగు వైసీపీ హయాంలో పాతాళానికి పడిపోయింది. టీడీపీ హయాంలో వృద్ధి రేటు 12.5 శాతం ఉంటే వైసీపీ హయాంలో సగానికి సగం తగ్గిపోయింది. ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం, ఉత్పత్తులకు ధర లేక అన్నదాతలు అప్పుల పాలు కావడం దీనికి కారణం. ఆక్వా చెరువులకు విద్యుత్ రేట్లు విపరీతంగా పెంచడం, అవినీతితో మత్స్య రంగం కుప్పకూలింది. ఈ రంగంలో టీడీపీ హయాంలో వృద్ధిరేటు రికార్డు స్థాయిలో 29% వైసీపీ హయాంలో ఘోరంగా 9శాతానికి తగ్గిపోయింది. ఏకంగా 20శాతం వృద్ధి రేటు తగ్గిపోవడం దేశంలో ఏ రంగంలో జరగలేదు. జగన్ సృష్టించిన భయానక పరిస్థితులతో రాష్ట్రానికి రావడానికి పారిశ్రామికవేత్తలు వెనకడుగు వేశారు. ఉన్న కంపెనీలు మూతపడ్డాయి. ఈ రంగంలో వృద్ధి రేటు సగానికి పడిపోయింది. రాష్ట్రంలో నిరుద్యోగుల శాతం జాతీయ స్థాయి శాతానికి కంటే అధికంగా ఉంది. పర్యాటక రంగం, హోటళ్లు, రెస్టారెంట్ల ఆదాయం కూడా పడిపోయింది. ఆ రంగంలో కూడా వృద్ధి రేటు 9.5 శాతం నుంచి 5శాతానికి పడిపోయింది. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. విద్య, వైద్యం, విద్యుత్ సహా ప్రధాన రంగాలన్నీ నేల చూపులే చూశాయి' అని విమర్శించారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడటానికి సీఎం చంద్రబాబు 2014 నుంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఒక వైపు రాజధానిని నిర్మిస్తూనే మరో పక్క అన్ని రంగాలనూ ముందుకు తీసుకు వెళ్లారని ఆయన తెలిపారు. దీని ఫలితంగానే రాష్ట్రం స్థూల జాతీయోత్పత్తిలో 9శాతం వృద్ధి సాధించిందని, ఇప్పుడు అందులో సగం కూడా లేకుండా పోయిందని ఆయన పేర్కొన్నారు.

ఉచిత ఇసుకపై నీలిమీడియా దుష్ప్రచారం: కాల్వ

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పంపిణీపై నీలి మీడియా, జగన్ రోత మీడియా దుష్ప్రచారం చేస్తోందని టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బుధవారం ఇక్కడి టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ చేయలేని పనిని చంద్రబాబు చేశారనే కడుపుమంటతోనే ఇలా దుష్ప్రచారానికి ఒడిగడుతున్నారన్నారు. లోడింగ్, రవాణా చార్జీలు మాత్రమే వసూలు చేస్తూ ఉచితంగా ఇసుక ఇవ్వడంతో లక్షల మంది కార్మికులకు మేలు జరుగుతుందని, నిర్మాణ రంగం ఊపిరి పీల్చుకుంటోందని పేర్కొన్నారు. ఉచిత ఇసుకతో దాదాపు 125 విభాగాల వారు బతికేందుకు చంద్రబాబు అవకాశం కల్పిస్తే వైసీపీ, నీలిమీడియా విష ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ నేతలు ఇకనైనా ప్రభుత్వంపై విషం చిమ్మడం మానుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు జరగబోతున్నాయని, ఏపీ రాతను మార్చే శక్తియుక్తులు చంద్రబాబుకే ఉన్నాయని కాల్వ పేర్కొన్నారు.

విదేశీ విద్య బకాయిలు ఇప్పించండి

- సీఎంకు నజీర్ అహ్మద్ వినతి

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): 2019-20 విదేశీ విద్య బకాయిలు విడుదల చేయాలని కోరగా సీఎంను సానుకూలంగా స్పందించినట్లు టీడీపీ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం అమరావతి సచివాలయంలో హిందూపురానికి చెందిన ముగ్బుల్ జాన్ అనే మహిళతో సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల కోసం గతంలో చంద్రబాబు ప్రవేశపెట్టిన విదేశీ విద్యాదీవెన పథకాన్ని జగన్ ప్రభుత్వం తీసివేయడంతో ఎంతో మంది విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ముగ్బుల్ జాన్ మాట్లాడుతూ.. ఒంటరి మహిళనైన తాను హిందూపురం నుంచి 800 కిలో మీటర్లు బైక్‌పై సమస్య చెప్పుకోవడానికి వస్తే జగన్ సర్కార్‌లో ఎవ్వరూ స్పందించలేదని, సచివాలయం గేటు దాటి రావడానికి నాలుగేళ్లుపట్టిందన్నారు. ఇప్పుడు చంద్రబాబును కలిసి 2019-20 వరకు విదేశాలకు వెళ్లిన పేదవారికి విదేశీ విద్యాపథకం వర్తింపజేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని, పథకాన్ని మళ్లీ ప్రారంభించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపామని చెప్పారు.

విద్యుత్ అప్పుల్లో వైసీపీ దోపిడీయే ఎక్కువ: లంకా

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పుల్లో 85శాతంగా ఉన్న నిర్వహణ వ్యయంలో దోపిడీ ఎక్కువగా జరిగిందని రాష్ట్ర బీజేపీ విమర్శించింది. జగన్ పాలనలో అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేయడం వల్ల ప్రజలపై భారం భారీగా పడిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. విద్యుత్ కొనుగోలు అగ్రిమెంట్లు 2019లో రద్దు చేయడం వల్ల పారిశ్రామిక వేత్తల్లో ఆంధ్రప్రదేశ్‌పై బ్యాడ్ ఇమేజ్ ఏర్పడిన విషయం పలు సదస్సుల్లో కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ దృష్టికి వచ్చిందని గుర్తు చేశారు. విద్యుత్ శాఖ దుస్థితికి కారణమైన అధికారులపై దృష్టి పెట్టి విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

భారత్-చైనా సరిహద్దులో

108 కిలోల బంగారం సీజ్

లేహ్, జూలై 10: లద్దాఖ్‌లోని భారత్-చైనా సరిహద్దుకు సమీపంలో భారీగా స్మగ్లింగ్ చేస్తున్న బంగారం పట్టుబడింది. ఒక్కోటి కిలో బరువున్న 108 బంగారు కడ్డీలను (108 కిలోలు) ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు (ఐటీబీపీ) స్వాధీనం చేసుకున్నారని, ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఓ అధికారి తెలిపారు. బంగారంతోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైనాక్యులర్, రెండు కత్తులు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఐటీబీపీ చరిత్రలో ఇంత భారీ స్థాయిలో ఎన్నడూ బంగారాన్ని పట్టుకోలేదని ఆ అధికారి చెప్పారు.

ఫిబ్రవరి నుంచి జీతాల్లేవు సార్!

- పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యంవల్లే..
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించాలి
- గ్రేడ్ 5 పంచాయతీ సెక్రటరీల విన్నపం

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి తమకు జీతాలు రావడం లేదని గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని వారు విన్నవిస్తున్నారు. వారి కథనం మేరకు.. ప్రతి పంచాయతీకీ ఒక కార్యదర్శిని నియమించాలనే లక్ష్యంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో పంచాయతీరాజ్‌శాఖ జీఓ 11ను విడుదల చేసింది. దీంతో సచివాలయంలో పనిచేస్తున్న 4 వేల మంది గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులు గ్రామ సచివాలయాల నుంచి రిలీవ్ చేసి గ్రామ పంచాయతీల్లో నియమించారు. పంచాయతీరాజ్‌శాఖ జీఓ ఇచ్చి చేతులు దులుపుకుని కేడర్ స్ట్రెంత్‌ను మాత్రం అప్‌డేట్ చేయలేదు. దీంతో ట్రెజరీ అధికారులు ఆర్నెల్లుగా గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు జీతాలు విడుదల చేయలేదు. పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారులు డేటా ఇస్తే ప్రాసెస్ చేస్తామని ట్రెజరీ అధికారులు చెప్తున్నారు. కమిషనరేట్ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడంతో పంచాయతీ కార్యదర్శులు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. 4348 మందికి గ్రామ పంచాయతీలు ఇవ్వొచ్చు అని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ... ఆ సంఖ్యను కేడర్ స్ట్రెంత్‌గా సీఎఫ్ఎంఎస్‌లో అప్‌డేట్ చేయకపోవడంతో అటు జీతాలు రాక, ఇటు పంచాయతీల్లో బిల్లులు పెట్టలేక గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కూడా అటకెక్కిందని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. సచివాలయాల నుంచి పంచాయతీరాజ్ ఎంపీడీఓల లాగిన్‌లోకి వారిని మారుస్తూ పంచాయతీరాజ్‌శాఖ, ట్రెజరీలకు అనుమతి ఇస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని చెప్తున్నారు. జీతాల్లేక తాము ఇబ్బందులు పడుతున్నా... పంచాయతీరాజ్ అధికారులు మాత్రం పట్టించుకోలేదని, దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి తమ సమస్య సత్వరమే పరిష్కారమయ్యేలా ఆదేశాలివ్వాలని వారు కోరుతున్నారు.



అటవీ శాఖ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పీపీపీ విధానంలో జూ పార్కుల అభివృద్ధి

దాతల సహకారం తీసుకోవాలి

- కార్పొరేట్లను భాగస్వాములు చేయాలి
- అరుదైన జంతువుల దిగుమతి, ప్రదర్శన
- టీ విత్ డిప్యూటీ సీఎం కార్యక్రమాలు: పవన్

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జంతు ప్రదర్శనశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జోన్ల వారీగా కొత్త జూ పార్కుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై నివేదికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మంగళగిరిలోని తన నివాసంలో ఏపీ జూ పార్కు అథారిటీ 14వ గవర్నింగ్ బాడీ సమావేశాన్ని పవన్ నిర్వహించారు. అలాగే, పీసీబీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'అంతర్జాతీయ ప్రమాణాలతో విశాఖపట్నం, తిరుపతి జూ పార్కుల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి. దీనికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం విధానంలో నిధులు సమకూర్చుకోవాలి. అరుదైన జంతువుల దిగుమతి, ప్రదర్శనపై దృష్టి పెట్టాలి. పర్యాటకులకు చక్కని అనుభూతి కలిగేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. జూపార్కుల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలి. కార్పొరేట్లను భాగస్వాములను చేయాలి. దీనికోసం కార్పొరేట్ సంస్థల ప్రతినిధులతో టీ విత్ డిప్యూటీ సీఎం కార్యక్రమాన్ని రూపొందించాలి. పారిశ్రామిక వేత్తలు వ్యక్తిగతంగా జంతువులను దత్తత తీసుకునేలా చూడాలి. ఇందుకోసం విశాఖ, తిరుపతిలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలి. పర్యావరణ హిత పర్యాటక అభివృద్ధిపై చర్చించి, ఏపీని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేద్దాం' అని నిర్దేశించారు.

కాలుష్యంపై ఫిర్యాదులకు సమయం

కాలుష్య నియంత్రణ మండలిని ప్రజలకు చేరువ చేయాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కాలుష్య సమస్యలపై ప్రజలు పీసీబీ కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదులు చేసుకునేందుకు అధికారులు ప్రతి రోజూ రెండు గంటల సమయాన్ని కేటాయించాలని ఆదేశించారు. పీసీబీ ప్రధాన కార్యాలయంతో పాటు రీజనల్, జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. పీసీబీ వెబ్‌సైట్‌లో వాయు, జల, శబ్ద కాలుష్యాల వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీంతో ప్రతి రోజూ సాయంత్రం 3-5 గంటల మధ్య ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు సమయాన్ని కేటాయిస్తామని పీసీబీ సభ్య కార్యదర్శి శ్రీధర్ చెప్పారు. సమావేశాల్లో అటవీశాఖ ముఖ్యదళాధికారి చిరంజీవ్‌చౌదరి, పర్యాటకశాఖ కమిషనర్ కన్నబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భారీ రిఫైనరీ!

(మొదటి పేజీ తరువాయి)

బుధవారమిక్కడ వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. మరోవైపు తాము కూడా రాష్ట్రంలో రూ.4 వేల కోట్ల పెట్టుబడులు పెడతామంటూ వియత్నాంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో మంచి పేరున్న విన్‌ఫాస్ట్ కంపెనీ సీఈవో పామ్ సాన్ చౌ, ఆ సంస్థ ప్రతినిధులు కూడా సీఎంతో సమావేశమయ్యారు. ఈ రెండు సంస్థల బృందాలతో వేర్వేరుగా భేటీ అయిన ఆయన.. తొలుత ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై బీపీసీఎల్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టుకు 4-5 వేల ఎకరాల భూమి అవసరమవుతుందని వారు ఆయనకు తెలిపారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించారు. అవసరమైనన్ని భూములు కేటాయించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 90 రోజుల్లోగా ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన పూర్తి ప్రణాళికతో రావాలని కోరారు. అక్టోబరుకల్లా పూర్తి ఫీజిబులిటీ రిపోర్టుతో వస్తామని బీపీసీఎల్ ప్రతినిధులు తెలిపారు. విన్‌ఫాస్ట్ సంస్థ ప్రతినిధులు కూడా ఆయనతో సమావేశమయ్యారు. రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ కర్మాగారం ఏర్పాటుకు సంసిద్ధత తెలిపారు. కాగా.. పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ అత్యుత్తమ గమ్యస్థానమని సీఎం పేర్కొన్నారు. పై రెండు సంస్థల ప్రతినిధులతో సమావేశాల అనంతరం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'దేశంలోని తూర్పు తీరంలో ఉన్న ఆంధ్ర గణనీయమైన పెట్రో కెమికల్స్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈరోజు సీఎండీ కృష్ణకుమార్ నేతృత్వంలోని బీపీసీఎల్ ప్రతినిధులతో సమావేశమయ్యాను. ఆంధ్రప్రదేశ్‌లో చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో కెమికల్ కారిడార్ ఏర్పాటుపై చర్చించాం. 90 రోజుల్లో వివరణాత్మక ప్రణాళిక, దాని సాధ్యాసాధ్యాల నివేదిక కోరాను. ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 5వేల ఎకరాల భూమి అవసరమవుతుంది. ఎవరికీ ఇబ్బంది లేని పద్ధతిలో సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది' అని పోస్టు పెట్టారు. విన్‌ఫాస్ట్ సీఈవోతో కూడా చర్చలు జరిపానని, ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించినట్లు చంద్రబాబు తెలిపారు. ఆ కర్మాగారం ఏర్పాటుకు అనువైన భూములను సందర్శించేందుకు విన్‌ఫాస్ట్ ప్రతినిధులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఏడాదికి 12 మిలియన్ టన్నుల సామర్థ్యం..

బీపీసీఎల్‌కు ప్రస్తుతం ముంబై, కోచి, మధ్యప్రదేశ్‌లోని బీనాలో రిఫైనరీలు ఉన్నాయి. 2029 నాటికి ఈ సంస్థ సామర్థ్యాన్ని 45 మిలియన్ టన్నులకు పెంచుకునేందుకు వీలుగా మరో కొత్త రిఫైనరీని తూర్పు, పశ్చిమ తీరప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో ఎక్కడో ఒక చోట ఏర్పాటు చేయాలని యోచిస్తుండగా.. ఇటీవలే ఢిల్లీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్ సింగ్ పురీని కలిశారు. బీపీసీఎల్ రిఫైనరీని ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. దానికి కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన నేపథ్యంలోనే బీపీసీఎల్ ప్రతినిధులు బుధవారం అమరావతి సచివాలయానికి వచ్చి ముఖ్యమంత్రితో చర్చలు జరిపారు. ఈ భారీ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే.. దాదాపు 75 వేల కోట్ల పెట్టుబడితో.. ఏడాదికి 12 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రాష్ట్రంలో ఆయిల్ రిఫైనరీని నాలుగేళ్లలో నెలకొల్పేందుకు బీపీసీఎల్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రిఫైనరీ ఏర్పాటుకు బందరు ప్రాంతం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి కూడా ఇక్కడే ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తున్నారు. ఇందుకు అవసరమైన భూములు అందుబాటులో ఉన్నాయని, రిఫైనరీ ఏర్పాటుతో బందరు ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని, దాదాపు 25 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెబుతున్నారు.

రూ.లక్ష కోట్లకు బీపీసీఎల్ సిద్ధం: మంత్రి భరత్

రాష్ట్రంలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు బీపీసీఎల్ సిద్ధంగా ఉందని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రితో బీపీసీఎల్ ప్రతినిధుల సమావేశం అనంతరం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రిఫైనరీ ఏర్పాటుకు మూడు ప్రాంతాలు పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. 90 రోజుల్లో బీపీసీఎల్ ప్రతినిధులు మళ్లీ సీఎం చంద్రబాబుతో సమావేశానికి వస్తారని, అప్పుడు రిఫైనరీని ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విన్‌ఫాస్ట్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఓర్వకల్లులో గానీ లేదా కృష్ణపట్నంలో గానీ ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ కర్మాగారాన్ని నెలకొల్పే అవకాశం ఉందని తెలిపారు. ఈ రెండు సంస్థలే కాకుండా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే సంస్థలకు భూమి, మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు.

మొత్తం ఊడ్చేశారు!

- అన్నమయ్యలో మొదలు కాని ఉచిత ఇసుక
- డంపులలో పిడికెడు ఇసుకా లేని వైనం
- వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా దోపిడీ
- అధికారులెవరైనా అడ్డుకోవాలని చూస్తే ధనుంజయరెడ్డి జోక్యం.. వద్దని బెదిరింపులు!
- ఏసీబీ దాడులు తప్పవని హెచ్చరిక

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)



రాయచోటిలో మార్కెట్‌యార్డు లోని ఇసుక డంపులో పిడికెడు ఇసుక లేని దృశ్యం

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తోంది. అమల్లోకి వచ్చి మూడు రోజులు గడచినా అన్నమయ్య జిల్లాలో మాత్రం ఇంకా మొదలేకాలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఇసుక దోపిడీయే ఇందుకు కారణం. జిల్లాలోని డంపులలో పిడికెడు ఇసుక కూడా లేదు. వైసీపీ నాయకులు మొత్తం ఊడ్చేశారు. జగన్ పాలనలో నాటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంకా ముఖ్యనాయకులతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు ఇసుకే ప్రధాన ఆదాయవనరుగా మారింది. రేయింబవళ్లు ఇసుకను అక్రమంగా తవ్వి ..పక్క రాష్ట్రాలకు తరలించి వందల కోట్లు సంపాదించారు. బయట మార్కెట్‌లో ఇసుక ధర ట్రాక్టర్, టిప్పర్లు వేలాది రూపాయలు ఉండడంతో కొనలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో నిర్మాణ పనులన్నీ నెమ్మదించాయి. కూలీలు ఉపాధిని కోల్పోయారు. అన్నమయ్య జిల్లాలో ప్రధానంగా మాండవ్య, బహుదా, చెయ్యేరు, పింఛా నదులు ఉన్నాయి. ఈ నదుల్లో పెద్ద మొత్తంలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో ప్రధానంగా పెనగలూరు మండలంలో రెండుచోట్ల, నందలూరు మండలంలో ఒకచోట ఇసుక రీచ్‌లు ఉన్నాయి. గతంలో కలికిరి మండలంలో, రాజంపేట మండలం బాలరాజుపల్లె వద్ద ఇసుక రీచ్‌లు ఉండేవి. ఇవి ప్రస్తుతం మూతపడ్డాయి. వీటితో పాటు పలుచోట్ల తాత్కాలిక రీచ్‌లు ఉండేవి. జిల్లాలో ఇసుక నిల్వ చేయడానికి రాయచోటి, రాజంపేట, పెనగలూరు, ఓబులవారిపల్లె, కురబలకోట, మదనపల్లె, పెద్ద తిప్పసముద్రం మండలాల్లో డంపులను ఏర్పాటు చేశారు. ఈ డంపుల ద్వారా వైసీపీ ప్రభుత్వం ఇసుక వ్యాపారాన్ని చేసింది. ప్రస్తుతం ఈ డంపుల్లో కనీసం పిడికెడు ఇసుక కూడా లేదు. అందరూ ఎన్నికల నిర్వహణలో తలమునకలై ఉంటే.. అధికార పార్టీ నాయకులు ఇసుకను ఊడ్చేశారు. గత ప్రభుత్వంలో ఇసుక అమ్మకాలకు సంబంధించిన వివరాలు ఏపీ ప్రస్తుతం మైనింగ్ అధికారుల దగ్గర లేవు. ఈ ఏడాది జనవరి నుంచి నెల నెలా ఎన్ని టన్నులు నిల్వలు ఉండేవి, ఇప్పుడు ఎంత ఉన్నాయనే సమాచారం కూడా చెప్పడం లేదు. ప్రైవేటు కాంట్రాక్టు సంస్థ వివరాలు తమకు ఇవ్వలేదని మాత్రమే చెప్తున్నారు.

అధికారులకు బెదిరింపు

ఇసుక డంపుల ఖాళీ వెనుక ఎవరున్నారని ఆరా తీస్తే.. ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో వైసీపీ నాయకులు చేస్తున్న ఇసుక దోపిడీని సహించలేని అధికారులు ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే.. స్వయంగా నాటి ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డి జోక్యం చేసుకునే వారని అధికారులు వాపోతున్నారు. ఇసుక నిల్వల వైపు కన్నెత్తి కూడా చూడవద్దని.. తమ మాట వినకుండా ఎవరైనా వెళితే ఏసీబీ దాడులు తప్పవని బెదిరించినట్లు సమాచారం. ఉమ్మడి కడప జిల్లాలో ఓ చోట 15 లక్షల క్యూబిక్ టన్నుల ఇసుక నిల్వలు అక్రమంగా ఉన్నాయనే సమాచారంతో మైనింగ్ అధికారులు అక్కడికి వెళ్లారు. వెంటనే ధనుంజయరెడ్డి వారికి ఫోన్ చేసి.. 'మర్యాదగా అక్కడి నుంచి వెనక్కి రండి.. లేకుంటే ఏసీబీ దాడులు జరుగుతాయి జాగ్రత్త' అని చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై అప్పటి కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజుకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన మైనింగ్ ఏడీని సస్పెండు చేయాలని గనుల శాఖ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లాలో కూడా ఇసుక అక్రమ నిల్వలపై అప్పటి కలెక్టర్ గిరీషాకు ధనుంజయరెడ్డి ఫోన్ చేసి.. 'మైనింగ్ అధికారులను అటువైపు వెళ్లవద్దని చెప్పండి' అని ఆదేశించినట్లు సమాచారం. ఇప్పుడు డంపులలో స్టాకు లేక అధికారులు తలలు పట్టుకుంటూ ఉంటే.. డంపుల్లో 50, 60 టిప్పర్ల ఇసుక నిల్వలు ఉన్నట్లు బిల్లులు పెట్టాలంటూ ఇప్పటివరకు ఇసుకను అమ్ముకున్న కాంట్రాక్టు సంస్థ ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఐదు సంవత్సరాలు వైసీపీ నాయకుల విచ్చలవిడి ఇసుక దోపిడీ, అందుకు సహకరించిన అధికారులపైన విచారణ జరిపించాలని పలువురు కోరుతున్నారు.

కేటీఆర్ వర్సెస్ సత్యకుమార్!

- కేతిరెడ్డి, వైసీపీ ఓటమిపై కేటీఆర్ ఆశ్చర్యం
- మీరు ధరణిలో.. కేతిరెడ్డి గుడ్‌మార్నింగ్‌లో దోచుకున్నారు: మంత్రి సత్య కౌంటర్




అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఏపీ బీజేపీ నేత, కూటమి ప్రభుత్వంలో మంత్రి సత్యకుమార్ మధ్య రాజకీయం ఆసక్తిగా మారింది. 'మాటకు మాట' అన్నట్టు.. ఏపీ రాజకీయాలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు సత్యకుమార్ అంతే స్థాయిలో పదునైన కౌంటర్ ఇచ్చారు. "ఏపీలో వైసీపీ ఓడిపోతుందని అస్సలు ఊహించలేదు. ఆ పార్టీ ఓటమి ఆశ్చర్యానికి గురిచేసింది. మాకున్న సమాచారం మేరకు వైసీపీ గెలుస్తుందని భావించినం. అసలు నా మిత్రుడు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఓడిపోవుడేంది? ధర్మవరంలో 'గుడ్ మార్నింగ్' పేరుతో తెల్లారగట్లే ప్రజలను కలుసుకున్నడు. ప్రజల్లోనే ఉన్నడు. మరి ఎలా ఓడిపోయిండు?" అని మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యాయి.

ఒకే జాతి పక్షులు: మంత్రి కౌంటర్

కాగా, కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు తాజా ఎన్నికల్లో ధర్మవరం నుంచి విజయం దక్కించుకున్న బీజేపీ నేత, ఏపీ మంత్రి సత్యకుమార్ కౌంటర్ ఇచ్చారు. "కేతిరెడ్డి ఓటమిపై కేసీఆర్ చిలకపలుకులు పలుకుతున్నారు. 'ధరణి' పేరుతో తెలంగాణలో మీరు నడిపిన మాఫియా తరహాలోనే ధర్మవరంలో 'గుడ్ మార్నింగ్' పేరుతో మీ భూబకాసుర మిత్రుడు ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డ్ భూములు ఆక్రమించాడు. కొండలు, చెరువులు కూడా కొల్లగొట్టాడు. 'గుడ్ మార్నింగ్' అంటే ధర్మవరం ప్రజలకు గుర్తుకు వచ్చేది కబ్జా-కలెక్షన్-కరెక్షన్-కమీషన్లే. ఫాం హౌస్‌కే పరిమితమైన మీరు.. 'ఎక్స్'లో అడిగినా ధర్మవరం ప్రజలు సమాధానం చెబుతారు. అవినీతి-అహంకారం-అసమర్థతే మిమ్మల్ని, మీ ప్రియమిత్రుడు జగన్, కేతిరెడ్డిలను ఓడించాయి. ఒకేజాతి పక్షులు... ఒకరికొకరు 'సర్టిఫికెట్లు' ఇచ్చుకుంటూ ఓదార్చుకోండి!" అని సత్యకుమార్ ఘాటుగా స్పందించారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే మా ధ్యేయం

- వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరుస్తాం : మంత్రి సవిత



అనంతపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): 'నా ఎస్సీ.. నా ఎస్టీ.. నా బీసీ.. నా మైనార్టీ' అంటూ జగన్‌లాగా ఆ వర్గాలపై కపటప్రేమ చూపబోమని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణి శ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ఆమె అనంతపురంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లల్లో వసతి గృహాల డైట్ బిల్లులు చెల్లించలేని దుస్థితిలో పాలన సాగించారని సవిత విమర్శించారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లల్లో ఇసుక కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారని, చివరకు ఏవరైనా చనిపోతే సమాధి కట్టుకునేందుకూ ఇసుక దొరక్క బాధలు పడ్డారని మంత్రి అన్నారు. ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా బీసీ, ఎస్సీ రెసిడెన్షియల్ స్కూల్స్, కళాశాలలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వచ్చే ఏడాది స్కూల్స్, కళాశాలలను పెంచడంతోపాటు సీట్లు పెంచుతామని అన్నారు.

హాస్టళ్ల బకాయిలు విడుదల చేస్తాం: మంత్రి డోలా



అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు పెండింగ్ బకాయిలు త్వరలో విడుదల చేస్తామని ఆ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మూడో రోజు మంత్రి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. విద్యార్థి సంఘ నాయకులు, గురుకుల ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు, వివిధ వర్గాలు మంత్రిని కలిసి వినతిపత్రాలు అందించారు. త్వరలో ఖాళీలు భర్తీ చేస్తామని, గురుకుల పాఠశాలలకు పూర్వ వైభవం తెస్తామని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి.. వైసీపీ నేతల అరెస్టు

- 15 మందిని కోర్టులో హాజరుపరచిన పోలీసులు
- దాడిలో 71 మంది పాల్గొన్నట్లు నిర్ధారణ
- మిగతావారి కోసం ప్రత్యేక బృందాల గాలింపు

గన్నవరం, జూలై 10: గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకుల్లో కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. టీడీపీ కార్యాలయం ఆపరేటర్ ముదునూరి సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐపీసీ 143, 147, 148, 435, 506 రెడ్‌విత్ 149, 3(1) (ఎస్సీ, ఎస్టీ చట్టం) సెక్షన్ల కింద కేసు (క్రైమ్ నంబర్ 137/2023) నమోదు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన గన్నవరం టీడీపీ కార్యాలయంపై నాటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు, వైసీపీ నాయకులు దాడిచేసి నిప్పుబెట్టిన సంగతి తెలిసిందే. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేయడంతో పాటు పలువురు టీడీపీ నేతలను గాయపరిచి వాహనాలను తగులబెట్టారు. ఐదు గంటలపాటు గన్నవరంలో వారు సృష్టించిన అరాచకం, విధ్వంసం స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. అయితే వంశీ ప్రోద్బలంతో ఈ ఘటనలో గాయపడిన టీడీపీ నేతలపైనే పోలీసులు కేసులు నమోదు చేశారు. టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని అర్ధరాత్రి వరకూ జీపులో వివిధ పోలీసు స్టేషన్లకు తిప్పారు. ఈ వ్యవహారంలో తాజాగా సత్యవర్ధన్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు టీడీపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని సీసీ కెమేరాలు, వీడియోలు ద్వారా గుర్తించారు. 71మంది దాడికి పాల్పడినట్లు నిర్ధారించారు. వీరిలో 15 మంది.. మూల్పూరి ప్రభుకాంత్ అలియాస్ ప్రేమ్‌కుమార్, ఎర్రగళ్ల నగేశ్, షేక్ కరీముల్లా, కొల్లి సుబ్రమణ్యం, బుగ్గల రాజేశ్, రామినేని రవిబాబు, మల్లవల్లి సాయి రాహుల్, షేక్ రబ్బాని, పాగోలు సురేశ్, బండారుపల్లి కోటేశ్వరరావు, పడమట నాగరాజు, దాసరి విజయ్, సాలియోహాన్, డొక్కు సాంబశివ వెంకన్నబాబు, మేచినేని విజయ్‌కుమార్‌లను అరెస్టు చేసి బుధవారం గన్నవరం అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. మిగిలిన వారి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు తెలిపారు.

'టికెట్ ధరల పెంపు'పై తేలుస్తాం!

» 'కల్కి'పై దాఖలైన వ్యాజ్యంలో హైకోర్టు స్పష్టీకరణ...



అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): టికెట్ ధరలను పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా? లేదా అనే విషయాన్ని తేలుస్తామని హైకోర్టు ధర్మాసనం తెలిపింది. టికెట్ ధర నిర్ణయాధికారం లైసెన్సింగ్ అథారిటీదేనని సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులిచ్చారని గుర్తు చేసింది. ఆ వ్యాజ్యాన్ని కూడా ప్రస్తుత పిల్‌తో జత చేస్తామని, ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. కౌంటర్ దాఖలుకు మరింత గడువిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభాస్ నటించిన 'కల్కి-2898 ఏడీ' సినిమా టికెట్ల ధరలను మొదటి 14 రోజులు పెంచుకొనేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, చిత్ర నిర్మాత సి.అశ్వనీదత్‌కు నోటీసులు జారీ చేసింది.

టీడీపీ ఆఫీసుపై దాడి.. హైకోర్టుకు సజ్జల, ఆళ్ల


» వైసీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి సంబంధించి మంగళగిరి రూరల్ పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం పలువురు వైసీపీ నేతలు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించగా.. తాజాగా ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రాఘురాం, వైసీపీ నేత దేవినేని అవినాశ్ వేసిన వ్యాజ్యాలు బుధవారం విచారణకు వచ్చాయి. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి స్పందిస్తూ.. ఈ వ్యాజ్యాలపై అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తారని.. విచారణను గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ విచారణను వాయిదా వేశారు. వైసీపీ నేతల తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు (విపక్ష నేతగా ఉన్నప్పుడు) ఉండవల్లి నివాసంపై మూక దాడి వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ మంత్రి జోగి రమేశ్ దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ కూడా గురువారానికి వాయిదా పడింది.

1000 కోట్ల పాస్‌వర్డ్‌లు లీక్

న్యూఢిల్లీ, జూలై 10: పాస్‌వర్డ్‌లు ఎంత సంక్లిష్టంగా పెట్టుకున్నప్పటికీ సైబర్ నేరగాళ్లు వాటిని బ్రేక్ చేస్తున్నారు. తాజాగా 1000 కోట్ల పాస్‌వర్డ్‌లను హ్యాకర్లు లీక్ చేశారని, దానికి సంబంధించిన భారీ ఫైల్‌ను ఆన్‌లైన్‌లో పెట్టారని సెమాఫోర్ నివేదిక తెలిపింది. ఈ వ్యహారాన్ని అతిపెద్ద లీక్‌గా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ భారీ లీకేజీ వల్ల క్రెడెన్షియల్ స్టఫింగ్ దాడులు జరిగే ప్రమాదం ఉందని సెమాఫోర్ నివేదిక పేర్కొంది. అంటే.. హ్యాకర్లు ఒక పాస్‌వర్డ్‌ను ఉపయోగించి దానికి అనుసంధానమైన బహుళ ఖాతాల్లోకి చొరబడవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ఏటీ అండ్ టీ, శాంటండర్ బ్యాంక్, టికెట్‌మాస్టర్, 23 అండ్ మీ వంటి ప్లాట్‌ఫామ్‌ల వినియోగదారులపై క్రెడెన్షియల్ స్టఫింగ్ దాడులు జరిగినట్టు సైబర్ న్యూస్ తెలిపింది. 2020 నుంచి ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులు అధికమయ్యాయని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నివేదిక తెలియజేస్తోంది. సైబర్ దాడికి గురికాకుండా ఉండాలంటే.. బ్యాంకులు, బీమా, ఆర్థిక లావాదేవీలతో లింక్ అయిన ఖాతాలకు వేర్వేరు పాస్‌వర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు సూచించారు. ఎనిమిది నుంచి పన్నెండు అక్షరాలతో కూడిన బలమైన పాస్‌వర్డ్‌ను ఎంచుకోవాలి. అందులో కనీసం ఒక క్యాపిటల్ లెటర్, ఒక అంకె, ఒక స్పెషల్ సింబల్ ఉండేలా చూసుకోవాలని చెప్పారు. పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ షేర్ చేసుకోకూడదని, వాటిని తరచూ మారుస్తూ ఉండాలని సూచించారు.

5,78,92,568



» ఇది ఏపీ జనాభా.. గతేడాదితో పోలిస్తే 0.35% పెరుగుదల

» టాప్‌లో నెల్లూరు.. చివరి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా

» దేశంలో ఆంధ్రప్రదేశ్‌కు పదో స్థానం.. యూపీకి మొదటి స్థానం

» 144 కోట్లు దాటేసిన భారత దేశ జనాభా

విశాఖపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభా భారీగా పెరుగుతోంది. గురువారం (జూలై 11) అంతర్జాతీయ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని జనాభా అధ్యయన కేంద్రం గ్రోత్ రేట్ ఆధారంగా రాష్ట్రంలో ప్రస్తుత జనాభాను అంచనా వేసి బుధవారం నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం ప్రస్తుత రాష్ట్ర జనాభా 5,78,92,568 మందిగా ఉంది. గతేడాది జనాభా (5,76,89,944)తో పోలిస్తే ఈ సంవత్సరం 2,02,624 మంది (0.35 శాతం) పెరిగారు. దేశంలో 23 కోట్లకు పైగా జనాభాతో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా.. ఏపీ పదో స్థానంలో కొనసాగుతోంది. 3.81 కోట్లకుపైగా జనాభాతో తెలంగాణ 13వ స్థానంలో ఉంది. ఏపీలో.. 24,69,712 మంది జనాభాతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మొదటి స్థానంలో నిలవగా.. 9,53,960 మందితో పార్వతీపురం మన్యం జిల్లా ఆఖరి స్థానంలో ఉంది. అత్యధిక జనసాంద్రత కలిగిన జిల్లాగా విశాఖపట్నం నిలిచింది. ఈ జిల్లాలో కిలోమీటరుకు 1,670 మంది నివసిస్తున్నారు. అత్యల్ప జనసాంద్రత కలిగిన జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లా (కిలోమీటరుకు 77 మంది) నిలిచింది. ఇక పురుషులు, మహిళల నిష్పత్తి చూస్తే... విజయనగరం జిల్లాలో ప్రతి 1000 మంది పురుషులకు.. 1019 మంది మహిళలు ఉండగా, అనంతపురం జిల్లాలో అత్యల్పంగా ప్రతి 1000 మంది పురుషులకు 977 మంది మహిళలు ఉన్నారు.

0.92 శాతం పెరిగిన దేశ జనాభా

గతేడాది దేశ జనాభా 142,86,27,663. ఈ సంవత్సరం 0.92 శాతం పెరిగి 144,17,19,852కు చేరింది. ఇక ప్రపంచ జనాభా 801,98,76,189కి చేరింది. ప్రపంచ జనాభాలో భారత్ వాటా 17.76 శాతంగా ఉంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాల జాబితాలో భారత్ టాప్‌లో నిలిచింది. ఆ తర్వాతి స్థానంలో చైనా నిలిచింది. భారతదేశ జనాభాలో 36.3 శాతం పట్టణాల్లో, 63.7 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా చేసుకుని గ్రోత్ రేటును బట్టి ఈ లెక్కలు అంచనా వేస్తున్నట్టు పాపులేషన్ రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మునిస్వామి వెల్లడించారు.

..వాలిపోతున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

కొల్లు రవీంద్ర పేషీలో చేరుతున్నట్టు వస్తున్న వార్తలు విస్మయపరుస్తున్నాయి. మరోవైపు వైసీపీ ప్రభుత్వంలో వేధింపులు, కేసులకు గురైనవారిని అవే కారణాలతో ప్రభుత్వం పక్కన పెడుతుండటం గమనార్హం.

చెక్ పెట్టాల్సిన వారికే చాన్స్!

మంత్రికి పీఎస్ అంటే మంత్రితో సమానం. పీఎస్ ఫైలు చూసి బ్రీఫ్ చేసినమేరకు మంత్రి నిర్ణయం తీసుకుంటారు. అలాంటి ముఖ్యమైన పోస్టులో నియామకం అనేది ఒక పెద్ద ప్రక్రియ. సాధారణంగా ఈ నియామకాల వెనుక కింగ్ మాస్టరు ఒకరు ఉండి.. ఎవరిని నియమించుకోవాలనేది మంత్రులకు వారే నిర్దేశిస్తుంటారు. కానీ, ఇప్పుడు గత ప్రభుత్వానికి పూర్తి విరుద్ధమైన సర్కారు రాష్ట్రంలో ఉంది. జగన్ ఆనవాళ్లు ఏపీ ప్రభుత్వ పాలనలో ఉండరాదనే దిశగా గట్టి అడుగులు పడుతున్నాయి. అయినా.. వైసీపీ వీరభక్తులు కొందరు పేషీల్లోకి వచ్చేస్తుండటం ప్రభుత్వ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈసారి మంత్రుల్లో చాలామంది కొత్తవారు. ఈ విషయాల్లో వారికి అవగాహన లేదు. ఎమ్మెల్యేలు, సహ మంత్రులు సూచించినవారిని తీసేసుకుంటున్నారు. కానీ, గతంలో పాలించినప్పుడు చంద్రబాబు పీఎస్‌లు, ఓఎస్డీల నియామకంలో జాగ్రత్తలు తీసుకునేవారు. వెరిఫికేషన్ లేకుండా నేరుగా పేషీల్లోకి ఎవరినీ అనుమతించేవారు కాదు. కానీ, ఎందువల్లో ఈసారి పీఎస్‌లను మంత్రులు నేరుగా పెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో నలుగురైదుగురు మంత్రుల వద్దకు వైసీపీ వీరభక్తులు చేరిపోయారని తెలిసింది. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వం ఉలిక్కిపడింది. దీనిపై ఇంటెలిజెన్స్ నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిసింది. అయితే, ఈ ప్రక్రియను కూడా కొందరు ఘనాపాటీలు ప్రభావితం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. మంత్రికి మంచిపేరు వచ్చినా, చెడ్డ గుర్తింపు వచ్చినా అది పీఎస్‌లు, ఓఎస్డీల వల్లే జరుగుతుంది. అందువల్ల ఉన్నంతలో సమర్థులను, నిజాయితీపరులను మాత్రమే పేషీల్లోకి తీసుకోవాలని ప్రభుత్వ వర్గాలు కోరుతున్నాయి. దీనికి భిన్నంగా కొన్ని శాఖల్లో పరిణామాలు ఉండటం పట్ల ఆందోళన చెందుతున్నాయి.

గతమంతా గలీజే...

రాజాబాబు గత ప్రభుత్వంలో గనుల శాఖలో జేడీ కేడర్‌లో పనిచేశారు. ఈ అధికారి గత ఐదేళ్లూ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. గనుల గజదొంగ అంటూ అప్పట్లో ఈయనపై టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. మాంగనీస్ టెండర్ల సెక్యూరిటీ డిపాజిట్‌ను దారిమళ్లించి దోచుకున్న కేసులో తీవ్ర ఆరోపణలను ప్రస్తుతం ఎదుర్కొంటున్నారు. ఈ పాటికే రిటైర్ అయిన ఆ అధికారిని నిధుల దోపిడీ కేసులో ఇబ్రహీంపట్నం పోలీసులు ఎప్పుడు అరెస్టుచేస్తారా? అన్న చర్చ జరుగుతోంది. అలాంటి వ్యక్తిని గనుల శాఖ మంత్రి ఓఎస్డీగా నియమించే ఫైలు మంగళవారం ముందుకు కదిలింది. వాస్తవానికి, రాజాబాబు దందాలపై గత రెండున్నర నెలలకాలంలో 'ఆంధ్రజ్యోతి'లో వార్తలు వచ్చారు. అవి ఇప్పుడు సోషల్‌మీడియాలో, అధికారపార్టీ వాట్సప్‌గ్రూప్‌ల్లో విపరీతంగా సర్క్యులేట్ అవుతున్నాయి. ఇలాంటి వ్యక్తిని ఓఎస్డీగా ఎలా నియమించుకుంటారంటూ అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గనుల శాఖలో ఇటీవలి వరకు జాయింట్ డైరెక్టర్ హోదాలో ఆయన పనిచేశారు. ఆయన హయాంలోనే మాంగనీస్ టెండర్ల సందర్భంగా కాంట్రాక్టర్లు సమర్పించిన సెక్యూరిటీ డిపాజిట్ సొమ్ము కోట్లాది రూపాయలు దారిమళ్లాయి. వాటిని గుంటూరులోని ఓ ప్రైవేటు ఇసుక కాంట్రాక్టర్ ఖాతాకు తరలించి ఆ తర్వాత విత్‌డ్రాచేశారు. ఆ సొమ్ముతో మంగళగిరిలో భారీగా బంగారం, ఇతర ఆభరణాలు కొన్నారు. కార్లు కొనుగోలు చేశారు. విషయం బయటకు పొక్కగానే చిన్న ఉద్యోగులను బలి చేశారు. ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై మోపి వారిపై ఇబ్రహీంపట్నంలో కేసుపెట్టి అరెస్టు చేయించారు. అయితే, ఉన్నతాధికారుల ఆమోదంతోనే ఆ నిధులు దారిమళ్లినట్లుగా 'ఆంధ్రజ్యోతి' గతనెల 11వ తేదీన "గనుల శాఖలో తోడేళ్ల దందా" శీర్షికన వార్తను వెలుగులోకి తీసుకొచ్చింది ఆ తర్వాత గనుల ఫైళ్లను మాయం చేశారని మరో వార్తను ప్రచురించింది. నిధుల దారిమళ్లింపు కేసులో నాటి జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న రాజాబాబు ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ఎందుకంటే, నిధుల విడుదలకు ఆయన డాంగిల్‌ను వాడారు. ఆ తర్వాత వేలిముద్ర వేశారు. ఆ తర్వాతే గనుల డైరెక్టర్ వేలిముద్ర వేసి డాంగిల్ వాడినట్లు తెలుస్తోంది. ఇదే అంశంపై శాఖపరమైన విచారణకు ఆదేశించగా, అంతా తెలిసిన అధికారులే కావడంతో విచారణాధికారి చేతులెత్తేశారు. విచారణ నివేదిక ఇవ్వకుండానే వదిలేశారు. ఈ విషయాన్ని కూడా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కేసును ఇబ్రహీంపట్నం పోలీసులు విచారిస్తున్నారు. రాజాబాబు పాత్రపై ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆయన్ను అరెస్టు చేయవచ్చనే ప్రచారం ఉంది. సరిగ్గా ఇదే సమయంలో కాకినాడకు చెందిన ఓ నేత... గనుల శాఖలో తన అవసరాల కోసం రాజాబాబును అక్కడ నియమించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయం తెలియగానే ఆ నేత విషయమై కూడా విచారణకు ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం.

వైసీపీ ఉద్యోగ నేత హడావుడి

సచివాలయంలో వైసీపీ అంతరంగికుడిగా, వైసీపీ వీరవిధేయ నేతగా పేరు తెచ్చుకున్న సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి సన్నిహితులే అన్నిచోట్లా వాలిపోతున్నారు. వీరిలో కొందరికి ఇంటెలిజెన్స్ నివేదిక కూడా అనుకూలంగా రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మరికొందరికి ఇంటెలిజెన్స్ నివేదిక అనుకూలించకపోయినా కొనసాగిస్తున్నారు. మరోవైపు గత ఐదేళ్లు టీడీపీ కోసం నిలబడిన వారిపై కేసులున్నాయంటూ పక్కన పెడుతుండటం గమనార్హం. ఎన్ని కేసులుంటే (రాజకీయ కక్ష సాధింపులతో పెట్టిన కేసులు) అంత ప్రయారిటీ అని మంత్రి లోకేశ్ గతంలో చెప్పినప్పటికీ అవేవీ ఆచరణలో కనపడడం లేదు. కక్షసాధింపులో భాగంగా పెట్టిన కేసులు ఇప్పుడు ప్రతిబంధకాలయ్యాయి. వివాదాస్పద పోస్టింగుల్లో ఎక్కువగా మంత్రులు అనిత, గొట్టిపాటి రవి, నిమ్మల రామానాయుడు, లోకేశ్, కొల్లు రవీంద్ర పేర్లు వినిపిస్తున్నాయి.

బాబుపై కేసుపెట్టిన పోలీసుకు హోంలో చోటు..

రామతీర్థం ఆలయానికి వెళ్లిన అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై కేసులు పెట్టిన డీఎస్పీ పులిపాటి అనిల్ ఇప్పుడు హోంమంత్రి అనిత పేషీలో ఓఎస్డీగా చేరారు. అంతకుముందు రెండేళ్లపాటు అప్పటి డీజీపీ గౌతమ్ సవాంగ్ వద్ద ఆయన ఓఎస్డీగా చేశారు. అలాగే, అనిత పేషీలో సచివాలయ ఉద్యోగుల సంఘంలో పనిచేసిన వివాదాస్పద ఉద్యోగ నేత వెంకట్రామిరెడ్డి కుడిభుజం సాయికుమార్ అడిషనల్ పీఎస్‌గా చేరారు. వైసీపీ వీరభక్తులంతా హోం పేషీలో చేరికతో కీలకమైన సమాచారం బయటకు పోదని గ్యారంటీ ఏముంది? పైగా సాయికుమార్‌కు ఇంటెలిజెన్స్ నుంచి క్లియరెన్స్ రావడం విచిత్రంగా ఉంది.

నెగెటివ్ రిపోర్టు అందినా లోకేశ్ పేషీలో...

విద్యాశాఖ మంత్రి లోకేశ్ పేషీలో ఓఎస్డీగా చేరిన ఆకుల వెంకటరమణపై తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఈ అధికారికి ఇంటెలిజెన్స్ నుంచి నెగెటివ్ రిపోర్ట్ వచ్చింది. అయినప్పటికీ లోకేశ్ పేషీలో కొనసాగుతున్నారు.

వైసీపీ అధికారికి గొట్టిపాటి చాన్స్

వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణ స్వామి వద్ద పీఏగా చేసిన రవీంద్ర ఇప్పుడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి వద్దకు చేరారు. రవీంద్రను పీఏగా గొట్టిపాటి రవి నియమించుకున్నారు.

అప్పుడూ, ఇప్పుడూ పీఎస్ దర్జా....

వైసీపీ హయాంలో మంత్రిగా చేసిన చెల్లుబోయిన వేణుగోపాల్ వద్ద పీఎస్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యం అనే ఉద్యోగి ప్రస్తుత జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేషీలో అంతా తానై వ్యవహరిస్తున్నారు. ఇక్కడా తానే పీఎస్ నంటూ అందరికీ చెప్పుకొంటున్నారు.

ఇప్పుడూ అన్యాయమేనా?

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తుందని అభిప్రాయపడుతున్నాయి.

ఏం జరిగింది?

ఉన్నత విద్యాకోర్సులకు సంబంధించి ప్రతి మూడేళ్లకోసారి ఫీజులు ఖరారు చేస్తారు. 2023-24 నుంచి 2025-26 విద్యాసంవత్సరం వరకు మూడేళ్లకు గతేడాది ఫీజులు నిర్ణయించాల్సి ఉంది. కాలేజీల్లో ప్రమాణాలను అధ్యయనం చేసిన ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్... ఫీజులు సిఫారసు చేసింది. ఇంజనీరింగ్ కోర్సులకు కనీస ఫీజు రూ.45 వేలు, గరిష్ఠ ఫీజు రూ.1.05 లక్షలుగా ఉండాలని పేర్కొంది. ఈ సిఫారసులను అప్పటి ప్రభుత్వం ఆమోదించకుండా తిప్పి పంపింది. కనీస ఫీజును తగ్గించాలని ఒత్తిడి చేసింది. ప్రభుత్వ ఒత్తిడితో కనీస ఫీజును రూ.40 వేలకు తగ్గించారు. గరిష్ఠ ఫీజును మాత్రం అలానే ఉంచారు. అయితే అప్పట్లో ఫీజులపై వైసీపీ ప్రభావం ఉందన్న ఆరోపణలున్నాయి. కమిషన్ ఛైర్మన్ పారదర్శకంగా ఫీజులు ఖరారు చేయాలని ఎంత ప్రయత్నించినా కొందరు తప్పుదారి పట్టించారన్న విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా కమిషన్‌కు ఆడిటర్‌గా వ్యవహరించిన వ్యక్తి ఖర్చులపై తప్పుడు నివేదికలు సమర్పించి.. కొన్ని కాలేజీలకు ఎక్కువ ఫీజులు వచ్చేలా, వైసీపీకి అనుకూలంగా లేని కాలేజీలకు తక్కువ ఫీజులు వచ్చేలా చేశారని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఫీజులు సరిగా లేవంటూ గతేడాదే యాజమాన్యాలు హైకోర్టుకు వెళ్లాయి. కమిషన్‌కు ఫీజులు ఖరారు చేసే అధికారమే లేదని వాదించాయి. ఈ నేపథ్యంలో అడ్మిషన్లు జాప్యం కాకూడదనే హైకోర్టు ఆదేశాల మేరకు 2023-24 ఏడాదికి అంతకుముందున్న ఫీజులపై 10 శాతం చొప్పున పెంచి అమలుచేశారు. దీంతో కనీస ఫీజు రూ.38,500.. గరిష్ఠ ఫీజులు రూ.77,000 అయ్యాయి.

గత సిఫారసులే ప్రామాణికంగా!

గత ప్రభుత్వంలో కమిషన్ సిఫారసు చేసిన ఫీజులు సక్రమంగా లేవని కాలేజీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అయితే.. ఇప్పుడు కూటమి సర్కారు కూడా గత సిఫారసులనే ఆమోదించింది. తొలుత సిఫారసు చేసినట్లు కనీస ఫీజు రూ.45 వేలుగా కాకుండా, ప్రభుత్వ ఒత్తిడి అనంతరం మార్చిన రూ.40 వేలను ప్రామాణికంగా తీసుకుంది. ఆ ఫీజులను ఖరారు చేస్తున్నట్లు రెండు రోజుల కిందట ఉత్తర్వులు జారీచేసింది. దీంతో 108 కళాశాలలకు కనీస ఫీజు రూ.40 వేలు మాత్రమే దక్కనుంది. మొత్తం కాలేజీలు 210లో ఇవి సగం కంటే ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ కొత్త ఫీజుల ఖరారుకు అధ్యయనం చేసే సమయం లేదనుకుంటే 10శాతం పెంపునే పరిగణనలోకి తీసుకుని, వచ్చే ఏడాదికి కొత్త ఫీజులపై అధ్యయనం చేయాల్సిందని యాజమాన్యాలు అభిప్రాయపడుతున్నాయి. తాజా నిర్ణయం వల్ల గత ప్రభుత్వంలో ఐదేళ్లు నష్టపోయిన తాము ఈ ప్రభుత్వంలో తొలి రెండేళ్లు నష్టపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

అనుకూల కాలేజీలకు పెంచేశారు!

తాజాగా మంత్రి నారా లోకేశ్‌కు రాసిన లేఖలో యాజమాన్యాలు 10 కాలేజీల ఫీజులను వివరించాయి. కాలేజీ ఖర్చు ఎంత చేస్తుంది? అనే అంశం ఆధారంగా ఫీజులు సిఫారసు చేస్తున్నారు. అలాగే ఆయా కాలేజీలకు న్యాక్ గుర్తింపు, అందులో ర్యాంకు స్థాయిలను కూడా ప్రామాణికంగా తీసుకోవాలి. కానీ వీటితో సంబంధం లేకుండా ఫీజులు సిఫారసు చేశారనేది యాజమాన్యాల ఆరోపణ. ఉదాహరణకు తిరుపతిలో వైసీపీకి అనుకూలంగా ఉండే ఓ కాలేజీకి రూ.60,600, పలమనేరులో ఓ కాలేజీకి రూ.57,200, చిత్తూరులో ఓ కాలేజీకి రూ.71,200గా ఫీజులు నిర్ణయించారు. ప్రమాణాలు అంతంత మాత్రంగానే ఉన్నా అనేక కాలేజీలకు రూ.50 వేలకు పైగానే ఫీజులున్నాయి. గతంలో అన్యాయం జరిగిందనే న్యాయస్థానానికి వెళ్లామని, ఇప్పుడు మళ్లీ వాటినే పరిగణనలోకి తీసుకోవడం వల్ల ప్రయోజనం ఏముందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

లక్ష్మీపార్వతికి ఏయూలో ప్రొఫెసర్‌షిప్!

» తెలుగు పరిశోధకులకు గైడ్‌గా నియామకం

» మూడేళ్ల క్రితమే ఉత్తర్వులు..

» ఇదీ మాజీ వీసీ ప్రసాదరెడ్డి బాగోతం

» టీడీఆర్ హబ్ కేంద్రంగా అడ్డగోలు వ్యవహారాలు



విశాఖపట్నం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ)లో మాజీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేసిన అడ్డగోలు వ్యవహారాల్లో మరొకటి వెలుగులోకి వచ్చింది. వైసీపీకి విశాఖలో ప్రధాన కార్యకర్తగా పనిచేసిన ఆయన యూనివర్సిటీని పూర్తిగా ఆ పార్టీ కార్యాలయంగా మార్చేశారు. వైసీపీ నాయకురాలు లక్ష్మీపార్వతిని ప్రసాదరెడ్డి ఏకంగా తెలుగు ప్రొఫెసర్‌ను చేసేశారు. ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీఆర్ (ట్రాన్స్ డిసిప్లినరీ రిసెర్చ్) హబ్‌లో తెలుగు ప్రొఫెసర్ హోదా ఇచ్చి పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గదర్శకురాలి (గైడ్)గా నియమించారు. మూడేళ్ల క్రితమే ఈ నియామకం జరిగింది. వివిధ సంస్థల్లో విధులు (ఉద్యోగాలు) నిర్వహిస్తున్న వారికి పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పించేందుకు ఈ టీడీఆర్ హబ్‌ను ఏర్పాటు చేశారు. యూనివర్సిటీతో ఎలాంటి సంబంధం లేని జేమ్స్ స్టీఫెన్ అనే వ్యక్తిని తీసుకువచ్చి ఈ టీడీఆర్ హబ్‌కు డీన్‌ని చేశారు. కాగా, లక్ష్మీపార్వతి విజయవాడలో ఉంటారు. పీహెచ్‌డీ చేసే పరిశోధకులంతా విశాఖపట్నానికి చెందినవారు. అక్కడ ఉండే ఆమె ఇక్కడి వారిని ఎలా గైడ్ చేస్తారనే విషయన్ని పరిశీలించకుండానే ఆమెను నియమించారు. అంతేకాదు, పది మంది పరిశోధకులకు కూడా ఆమెను గైడ్‌ను చేశారు.

అర్హత ఉందా?

పీహెచ్‌డీ చేసే పరిశోధకులకు గైడ్‌గా వ్యవహరించే ప్రొఫెసర్.. పీజీ విద్యార్థులకు పాఠాలు బోధించి ఉండాలి. కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. కనీసం ఒక్కరికైనా పీహెచ్‌డీ అందించే ప్రక్రియలో సహకరించి ఉండాలి. ఇవేమీ లేకుండానే లక్ష్మీపార్వతిని గైడ్‌గా నియమించారు. అంతేకాదు, ఆమెకు 'గైడ్ షిప్' కింద కొంత మొత్తం కూడా ఇప్పించారు. అయితే, ఆమె విశాఖపట్నం ఎప్పుడు వస్తారు?, మేము ఎప్పుడు ఆమె సలహాలు తీసుకుంటామంటూ పరిశోధనా విద్యార్థులు వాపోతున్నారు. దీంతో "మీకు అలాంటి భయం అవసరం లేదు. అంతా మేం చూసుకుంటాం" అని డీన్ జేమ్స్ స్టీఫెన్ భరోసా ఇవ్వడం విశేషం. వైసీపీకి అన్ని రకాలుగా సహకరించిన ఉద్యోగులు, వివిధ సంస్థల్లో పని చేస్తున్న వారికి పదోన్నతులకు అవసరమైన పీహెచ్‌డీలు ప్రదానం చేసేందుకే ఈ టీడీఆర్ హబ్‌ని ఏర్పాటు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. 'ఎగ్జిక్యూటివ్ పీహెచ్‌డీ' అనే కొత్త పదం వాడుకలోకి తెచ్చారు. ఈ హబ్ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తోంది. ఇక్కడ సుమారు 150 మందికిపైగా రీసెర్చి చేస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కామర్స్, మేనేజ్‌మెంట్ ఇలా అన్ని విభాగాల వారున్నారు. సాధారణంగా ఇలాంటి రీసెర్చి చేసేవారు సంబంధిత విభాగంతో అనుసంధానమై ఉండాలి. పరీక్షల నిర్వహణ కూడా ఆయా విభాగాల ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. కానీ, టీడీఆర్ హబ్ డీన్‌గా వ్యవహరిస్తున్న జేమ్స్ స్టీఫెన్ ఈ నిబంధనలు ఏపీ పాటించడం లేదు. లక్ష్మీపార్వతిలాగే ప్రైవేటుకు కాలేజీల్లో పని చేస్తున్న వారిని తీసుకువచ్చి ప్రొఫెసర్లుగా నియమించి.. 'గైడ్లు' అని ప్రచారం చేసి వారికి పరిశోధకులను అప్పగించారు. అలా రీసెర్చి చేస్తున్న వారికి అక్కడే పరీక్షలు నిర్వహించి, వారే వాటిని దిద్ది మార్కులు వేస్తున్నారు. ఈ విషయం తెలిసి ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ డీవీఆర్ మూర్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ పరీక్షలను తాము గుర్తించడం లేదన్నారు.

విచారణ చేయిస్తారా?

ఇప్పుడు కూడా వారికి పరీక్షలు నిర్వహించాల్సిన సమయం వచ్చింది. దీనికి వైస్ చాన్సలర్ ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం వీసీగా ఎవరూ లేకపోవడంతో సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఆర్ రాజు పరీక్షల నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే, టీడీఆర్ హబ్‌లో పరీక్షలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. టీడీఆర్ హబ్‌లో అడ్డగోలు వ్యవహారాలపై హిందీ విభాగాధిపతి సత్యనారాయణ ఏడాది క్రితమే విచారణ చేయాలని డిమాండ్ చేశారు.



డిగ్రీ అస్తవ్యస్తం

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని ఈ సర్కారు అమలు చేయడంతో డిగ్రీ అడ్మిషన్లు అస్తవ్యస్తంగా మారాయి. నేటి నుంచి విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉండగా బుధవారం రాత్రి వరకూ ఎన్ని కాలేజీలకు అఫిలియేషన్లు, అనుమతులు వచ్చాయనే లెక్క తేలలేదు. మరోవైపు కీలకమైన బీసీఏ, బీబీఏ కోర్సులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదే జరిగితే అడ్మిషన్లు ఇంకా గందరగోళంగా తయారయ్యే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ కొన్ని కోర్సులకు విడిగా కౌన్సెలింగ్ నిర్వహించలేదు. అయితే డిగ్రీలో అడ్మిషన్లు పెంచుతామనే ప్రకటనతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఈ గందరగోళం ఏర్పడింది. దాన్ని సమీక్షించి పొరపాట్లు సరిదిద్దాల్సి ఉండగా ఈ ప్రభుత్వం అవే నిర్ణయాలను కొనసాగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 3.5 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నాయి. కానీ.. వైసీపీ ప్రభుత్వంలో అడ్మిషన్ల సంఖ్య దారుణంగా పడిపోయింది. అంతకుముందు 2 లక్షలకు పైగా ఉన్న అడ్మిషన్లను 1.5 లక్షలకు తీసుకొచ్చింది. గతేడాది 1.7 లక్షల వరకూ విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందారు. డిగ్రీ అడ్మిషన్లు పడిపోవడంతో... ఈ ఏడాది ఇంజనీరింగ్‌తో సమాంతరంగా డిగ్రీ కౌన్సెలింగ్ చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. డిగ్రీ అడ్మిషన్లు ముందుగానే జరిగితే ఇంజనీరింగ్‌కు వెళ్లేవారు డిగ్రీలో చేరతారని భావించింది. ప్రభుత్వం మారాక తగిన సమయం లేక కూటమి సర్కారు కూడా దానినే కొనసాగిస్తోంది. అయితే కౌన్సెలింగ్‌ను ముందుకు జరపడం, అఫిలియేషన్లు, అనుమతుల లెక్క తేలకపోవడంతో అసలు దరఖాస్తుల సంఖ్యే భారీగా పడిపోయింది. ఏటా తొలి విడత కౌన్సెలింగ్‌కు 1.8 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటుంటే బుధవారం రాత్రి వరకూ 1,11,433 మందే దరఖాస్తు చేసుకున్నారు.

ఆ కోర్సుల పరిస్థితేంటి?

డిగ్రీలో ప్రస్తుతం బీసీఏ, బీబీఏ కోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది. కాగా ఈ కోర్సులకు కౌన్సెలింగ్ ఎప్పుడు అనేదానిపై అస్పష్టత నెలకొంది. ఈ రెండు కోర్సులకు తర్వాత విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఉన్నత విద్యాశాఖ కాలేజీల యాజమాన్యాలకు చెబుతోంది. అలాచేస్తే ఆప్షన్ల ఎంపిక తలనొప్పిగా మారుతుంది. విద్యార్థులు ఒకేసారి వారికి అర్హత ఉన్న కోర్సులకు వరుసగా ఆప్షన్లు ఇస్తూ వస్తారు. కానీ ఇప్పుడు బీకాం, బీఎస్సీ, బీఏ లాంటి కోర్సులకు ఆప్షన్లు ఇచ్చుకుని బీసీఏ, బీబీఏలకు తర్వాత పెట్టుకోవాల్సి ఉంటుంది. కానీ షెడ్యూలు ప్రకారం ఈలోపే విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. ఆ తర్వాత రెండో విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకుని ఆప్షన్లు పెట్టుకోవాలి. కాగా, అద్దె భవనాల్లో కొనసాగే డిగ్రీ భవనాలకు ఒకేసారి 30 ఏళ్లకు లీజు గడువు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఐదేళ్ల కాలానికే లీజు గడువు విధానం ఉంది.



మీడియాతో మాట్లాడుతున్న యూటీఎఫ్ నేతలు

501 బడుల్లో ఒక్కొక్కరే విద్యార్థి

» జీవో 117తో ప్రాథమిక విద్య అస్తవ్యస్తం

» కొత్త ప్రభుత్వం వ్యవస్థను సరిదిద్దాలి.. యూటీఎఫ్ నేతల విజ్ఞప్తి

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జీవో 117 తీసుకొచ్చి ప్రాథమిక విద్యను అస్తవ్యస్తం చేసిందని యూటీఎఫ్ ఆరోపించింది. ఆ ఒక్క జీవో కారణంగా 4,457 ప్రాథమిక పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపింది. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సవరించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను సరిదిద్దాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్‌లు కోరారు. బుధవారం వారు విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాలల్లో విలీనం పేరుతో 3, 4, 5 తరగతులను తరలించడం వల్ల 7500 ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క కొత్త అడ్మిషన్ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 20వేల పాఠశాలల్లో 10 నుంచి 20 మంది విద్యార్థులే మిగిలారన్నారు. ఈ ఏడాది నుంచి పిల్లలందరికీ తల్లికి వందనం పేరుతో ఏటా రూ.15 వేలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని అడ్డుపెట్టుకుని గుర్తింపు లేని పాఠశాలలు సైతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుంచి తరలించుకు పోతున్నాయన్నారు. పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ కొనసాగించే విషయాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. కాగా 501 ప్రాథమిక పాఠశాలలు కేవలం ఒక్కొక్క విద్యార్థితోనే నడుస్తున్నాయని తెలిపారు. మొత్తంగా సింగిల్ టీచర్ పాఠశాలలు 12వేలు దాటాయన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మీడియం విధానంతో ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులంతా ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాయాల్సి వస్తోందన్నారు. వీటిని సమీక్షించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని లోకేశ్‌ను కోరినట్టు వారు తెలిపారు.

ఉన్నత విద్యామండలిలో నిధుల దుర్వినియోగంపై పిల్

» ముఖ్యకార్యదర్శి, కార్యదర్శి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌కు నోటీసులు

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో నిధుల దుర్వినియోగం, చట్టవిరుద్ధ నియామకాలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై హైకోర్టు స్పందించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ఉన్నతవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీ ఉన్నత విద్యమండలి కార్యదర్శి, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఉన్నత విద్యామండలిలో ఆర్థిక అక్రమాలకు పాల్పడిన మాజీ చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ రామ్మోహనరావు, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ కర్నూలు జిల్లాకు చెందిన బల్లిపోగు శ్రీరాములు, బంటుపల్లి నాగరాజు ఈ పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎంఆర్‌కే చక్రవర్తి వాదనలు వినిపించారు.

ట్రిపుల్ ఐటీలో గంజాయిపై లోకేశ్ సీరియస్

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో గంజాయి కలకలంపై మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ సీరియస్ అయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి రావడంతో వెంటనే సమగ్ర విచారణ జరిపి, దీనిని ప్రోత్సహించే స్థానిక రాజకీయ నేతలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సింగిల్ మేజర్‌తో డిగ్రీ గందరగోళం

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కొత్తగా తీసుకొచ్చిన సింగిల్ మేజర్ డిగ్రీ విధానం వల్ల డిగ్రీ విద్య గందరగోళంగా మారిందని ఎస్ఎఫ్ఐ విమర్శించింది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి ఎస్ఎఫ్ఐ నేతలు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ బుధవారం సచివాలయంలో ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్‌కు వినతి పత్రం అందజేశారు. జీవో 77ను రద్దుచేసి పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని, యూనివర్సిటీల్లో 5వేల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అలీం బాషా బదిలీ

● మంగళగిరి - తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పోస్టింగ్



ఆంధ్రజ్యోతి, విజయవాడ: రాజధాని అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) అదనపు కమిషనర్ అ లీం బాషా మంగళవా రం బదిలీ అయ్యారు. ఆ యన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్‌కు అలీం బాషాను కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో అలీం బాషా సీఆర్‌డీఏకు అదనపు కమిషనర్‌గా వచ్చారు. చాలా సౌమ్యుడిగా, వివాదరహితుడిగా ఆయనకు పేరుంది. ఆయన సేవలను మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్‌కు అవసరమని గుర్తించిన ప్రభుత్వం కమిషనర్‌గా నియమించింది.

దుర్గమ్మకు సారె సమర్పణ

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను ఆషాఢమాస సారె సమర్పణల్లో భాగంగా ఐదోరోజైన బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 350 మంది భక్తులు సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పూజలు నిర్వహించి ఆశీస్సులు అందజేశారు. మరోవైపు వారాహీ నవరాత్ర పూజలు వేదోక్తంగా నిర్వహిస్తున్నారు.

'కిడ్నీ' ఆరోపణల్లో వాస్తవం లేదు

విజయవాడ: కిడ్నీ మార్పిడికి సంబంధించి డాక్టర్ శరత్‌పై వస్తున్న ఆరోపణలు అవాస్తమని ఆయన వద్ద వైద్యం పొందిన రోగులు తెలిపారు. నగరంలో బుధవారం రామకృష్ణ, జయశ్రీ, నాగరాజు, ఫణి మీ డియాతో మాట్లాడారు. తాము డాక్టర్ శరత్ వద్ద ఆ పరేషన్లు చేయించుకుని ఆరోగ్యంగా ఉన్నామన్నారు. ఆయనపై ఇప్పటి వరకు ఎలాంటి ఆరోపణలు రాలేదన్నారు. ఆయన అన్ని అనుమతులు ఉన్న తర్వాతే కిడ్నీ మార్పిడి చేస్తారన్నారు.

బీసీ స్టడీ సర్కిల్స్‌లో ప్రవేశానికి ప్రతిపాదనలు

కృష్ణలంక: రాష్ట్రంలోని 13 జిల్లా కేంద్రాల్లో బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేసి ఉన్నాయని, వాటి ద్వారా నిరుద్యోగ విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు ఎ.కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారం వివిధ కేటగిరిలకు చెందిన విద్యార్థులకు స్టడీసర్కిళ్లలో ప్రవేశాలు కల్పించడం జరుగుతుందని, బీసీలకు 66శాతం, ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 14శాతం మేర కోటా ఉందన్నారు. ఇటీవల 103వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఇ.డబ్ల్యు.ఎస్ కేటగిరీకి చెందిన విద్యార్థులకు 10శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. ఇ. డబ్ల్యు.ఎస్ కేటగిరి విద్యార్థుల నుంచి వచ్చిన వినతులను దృష్టిలో ఉంచుకొని బీసీస్టడీ సర్కిళ్లలో 10శాతం రిజర్వేషన్‌ను సూపర్ న్యూమరరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించడానికి ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని మంత్రి ఎస్.సవిత ఆదేశించినట్టు తెలిపారు. ప్రభుత్వం పరిశీలించి తగు ఆదేశాలను జారీ చేశారని ఆయన తెలిపారు.

సీఎస్‌ఐటీఏ ఆస్తులకు రక్షణ కల్పించండి

● జిల్లా అధికారులకు సీఎస్‌ఐటీఏ విజ్ఞప్తి

వన్‌టౌన్: చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ఆస్తులకు రక్షణ కల్పించాలని జిల్లా అధికారులను కోరుతూ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ (సీఎస్‌ఐటీఏ) విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బుధవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో తీర్మానించారు. అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సీఎస్‌ఐటీఏ లండన్ సంస్థ ఈ దేశం నుంచి వెళ్లిపోతూ వందలాది ఆస్తులను ఇక్కడి సీఎస్‌ఐటీఏకు బదిలీ చేసిందన్నారు. వాటిలో ఒకటైన జి.కొండూరు మండలం పినపాక విద్యానగర్‌లోని 62.88 ఎకరాల భూమి పరిరక్షణకు తాము చేస్తున్న ప్రయత్నాలకు ప్రభుత్వ అధికారులు సహకరించాలన్నారు. నగరానికి చెందిన కోగంటి సత్యనారాయణ (సత్యం) సదరు భూముల్లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. భూమిలోకి ఇతరుల ప్రవేశాన్ని అడ్డుకోవడానికి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈమేరకు ఎమ్మార్వో సెక్షన్ 145 మేరకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సహకరించాలని కోరారు. అసోసియేషన్ బాధ్యులు ఎల్ అలెగ్జాండర్, భూ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ సుధీర్‌దత్, సహాయ కార్యదర్శి జి.ఇమ్మాన్యుయేల్, ఎంఆర్ జేజే ప్రకాష్, సభ్యులు కామా దేవరాజు, చిన్నంభాస్కరరావు, ప్రభాకర్, జగదీష్ పాల్గొన్నారు.

వెలంపల్లి అనుచరుడిపై అట్రాసిటీ కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్: తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సెంట్రల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం జైపాల్‌ను కులం పేరుతో దూషించిన మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అనుచరుడు పల్లపోతు మురళీకృష్ణ అలియాస్ కొండపల్లి బుజ్జిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈనెల 7న బెజ్జం జైపాల్ అతడి స్నేహితుడు బాషా తో కలిసి ద్విచక్రవాహనంపై పాయకాపురం నుంచి నగరంలోకి వెళ్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి కారులో వచ్చిన వైసీపీ నేత కొండపల్లి బుజ్జి వీరి వాహనాన్ని అడ్డగించాడు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మీకు బలుపు పెరిగిందంటూ కులం పేరు తో జైపాల్‌ను దూషించాడు. దీంతో బాధితుడు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

నేటితో ముగిసిన ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్

భారతీనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో బుధవారం ఏపీఈఏపీసెట్ -2024 కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ ఆఖరు రోజు ఆంగ్లో ఇండియన్స్ (విదేశి)విభాగంలో ఒకరు, పీహెచ్ కేటగిరిలో 178 మంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 56 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారంతా సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకున్నట్టు పాలిసెట్ జిల్లా కో-ఆర్డినేటర్, ప్రిన్సిపల్ ఎం.విజయసారథి తెలిపారు.

టీడీపీ ప్రశ్నల హోరు.. వైసీపీ బేజారు..!

ప్రతిపక్షం ప్రశ్న వేయకుండానే అధికార పక్షం కార్పొరేటర్ల అడ్డగింతలు.. సమాధానం చెప్పే అధికారులకు అడ్డంకులు.. అరుపులు, కేకలు.. అజెండాలోని అంశాలపై అభ్యంతరాలను చెప్పనివ్వని గందరగోళ పరిస్థితి. ఇప్పటి వరకు వీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కనిపించిన సీన్ ఇది. ఈ సీన్ బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో రివర్స్ అయింది. అధికారపక్ష కార్పొరేటర్లు వెనక్కి తగ్గారు. ప్రతిపక్షంలోని టీడీపీ కార్పొరేటర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులతో సమాధానం చెప్పించారు.

● తిరగబడిన సంప్రదాయం
● హాజరుకాని ఎంపీ, ఎమ్మెల్యేలు
● ఆహ్వానం అందలేదంటున్న టీడీపీ
● పంపామన్న మేయర్

చిట్టినగర్, జూలై 10: వీఎంసీ కౌన్సిల్ సమావేశం కౌన్సిల్ హాలులో మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగింది. సభ ప్రారంభమైన వెంటనే టీడీపీ, సీపీఎం కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను అనుమతించాలని పట్టుపట్టారు. దీంతో కొద్దిసేపు వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. అధికారులు ఇటీవల మృతి చెందిన మాజీ కార్పొరేటర్లకు సంబంధించి సంతాప తీర్మానం పెట్టకపోవడంపై టీడీపీ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేయ్యటంతో మేయర్ సభను 3 నిమిషాలు వాయిదా వేసి అనంతరం సంతాప తీర్మానం పెట్టారు.

మంచినీటి కలుషితంపై వాడివేడిగా..

నగరంలో మంచినీటి కలుషితంపై వాడివేడిగా చర్చ జరిగింది. కలుషిత నీరు తాగి మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలని టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్.బాలస్వామి ప్రతిపాదన పెట్టారు. పైపులైన్లు మార్చాలని పలువురు సభ్యులు మేయర్‌ను కోరారు. వీఎంసీలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు తోపుడు బండ్లు, పుష్‌కాట్‌లు, లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 34వ డివిజన్‌లో జాతీయస్థాయిలో పేరొందిన మ్యాంగో మార్కెట్ తరలింపు ప్రతిపాదనపై స్థానిక కార్పొరేటర్ పుణ్యశీల, టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన డివిజన్ సమస్యపై మీ జోక్యం ఏంటని పుణ్యశీల అనడంతో ఈ వాదన జరిగింది.



మీడియాను అనుమతించాలని మేయర్‌కు కోరుతున్న టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి

నగరంలో మూడు సర్కిళ్లతోపాటు రూరల్ ఏరియాలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించాలని, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కోరింది. దీనికి సంబంధించి వీఎంసీ సుమారు రూ.3.కోట్లు వీఎంసీ 2024-25 బడ్జెట్‌లో ఆమోదించి జనరల్ నిధులు నుంచి తీసుకునేందుకు మేయర్ నుంచి ముందస్తు చర్యను ర్యాటీపై చేయడానికి కౌన్సిల్ ప్రతిపాదన పెట్టగా టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ వీఎంసీ నిధులు ట్రాఫిక్ సిగ్నలింగ్ ఏర్పాటుకు కేటాయించడం ఏంటని, వెంటనే దాన్ని ప్రభుత్వం నుంచి తీసుకునేలా తీర్మానాన్ని మార్పు చేయాలని పట్టుపట్టడంతో కొద్దిసేపు మేయర్‌కు, ప్రసాద్‌కు వివాదం జరిగింది. మేయర్ తీర్మానాన్ని మార్పుచేసి పంపిస్తానని చెప్పడంతో గొడవ సర్దుమణిగింది. నగరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, అరికట్టాలని పలువురు కార్పొరేటర్లు మేయర్‌ను కోరారు. ఆవులను వీధుల్లో వదిలేతే వాటిని కార్పొరేషన్ స్వాధీనం చేసుకొని, విడిపించుకోవడానికి వచ్చిన యజమానుల నుంచి భారీ పెనాల్టీలు వసూలు చేసి రోడ్లపై ఆవులను వదలకుండా కట్టడి చేయాలన్నారు.

హాజరుకాని ప్రజాప్రతినిధులు..

నగరంలోని ప్రజాప్రతినిధులు కౌన్సిల్ సమావేశానికి హాజరుకాలేదు. ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి హాజరుకాలేదు. వారికి సమావేశపు ఆహ్వానాలు అందలేదని కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఆహ్వానాలు పంపామని మేయర్ వెల్లడించారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



పెనమలూరు, జూలై 10: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలూ పూర్తిగా నాశనమయ్యాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. బుధవారం ఆయన పెనమలూరు సమీపంలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షకు వెళుతూ పోరంకిలోని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయంలో కాసేపు ఆగి స్థానిక నేతలు, విలేకరులతో మాట్లాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చేసిన సమీక్షల్లో ప్రతిశాఖలో సరాసరి రూ.20 నుంచి రూ.30 వేల కోట్ల మేర అప్పులు పేరుకుపోయినట్టు గమనించామన్నారు. పెన్షన్లు, జీతాలకు ప్రతి నెల 1వ తేదీకల్లా రూ.10వేల కోట్లు సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏ శాఖలోనూ రూపాయి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తన డీలర్లకు 20 నుంచి 30 శాతం నిధులిచ్చి ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలిచ్చే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేంద్ర పథకాలకు 10శాతం మ్యాచింగ్ గ్రాంటు ఇస్తే 90 శాతం నిధులు పొందే అవకాశం ఉన్నా జగన్ ప్రభుత్వం తెచ్చుకోలేక చతికిల పడిందన్నారు. వచ్చే 2, 3 నెలల్లో పరిస్థితులు ఒక కొలిక్కి రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

దుర్గగుడి సెక్యూరిటీ బలోపేతంపై ముగిసిన సమీక్ష



వన్‌టౌన్, జూలై 10: దుర్గగుడిలో సెక్యూరిటీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం 2వ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈలు, ఇంజనీరింగ్ అధికారులు, పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపారు. అనంతరం సెక్యూరిటీ ఆడిట్ మేరకు ఏఏ ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈవో రామారావు ప్రస్తుత సెక్యూరిటీ పరిస్థితిని వివరించారు. అన్నింటినీ పరిశీలించి ఆయా విభాగాల అధికారులు దేవస్థానానికి నివేదిక ఇవ్వనున్నారు. సీఎస్‌డబ్ల్యు, డీసీపీ ఏబీటీఎస్ ఉదయరాణి, ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవి, వెస్ట్‌జోన్ డీసీపీ హరికృష్ణ, వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, ఇంటిలిజెన్స్ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ట్రాఫిక్, అగ్నిమాపక, రహదారులు, భవనాల శాఖ, మునిసిపల్ కార్పొరేషన్, విద్యుత్ తదితరాల విభాగాల అధికారులతో పాటు వన్‌టౌన్ సీఐ, ఎస్‌పీఎఫ్, ఎగిల్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

12న నగరంలో జగన్నాథ్ రథయాత్ర



రామలింగేశ్వరనగర్, జూలై 10: దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద జగన్నాథ్ రథయాత్ర ఈ నెల 12న నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు చక్రధారి దాస్ తెలిపారు. రామలింగేశ్వరనగర్‌లోని ఇస్కాన్ మందిరంలో బుధవారం రథయాత్ర వాల్‌పోస్టర్, వలంటీర్ల టీషర్టులను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నగరంలో ప్రతి ఏడాది వైభవంగా రథ యాత్ర నిర్వహిస్తున్నామని, ఈ రథయాత్ర దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద రథ యాత్రగా రికార్డ్ నెలకొల్పిందన్నారు. ఈ ఏడాది కూడా ఘనంగా ఈ నెల 12న మధ్యాహ్నం 1గంట నుంచి బందర్‌రోడ్డులోని డీ అడ్రస్ మాల్ నుంచి రథయాత్ర ప్రారంభమైతుందన్నారు. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారన్నారు. 12నుంచి మూడు రోజుల పాటు మందిరం ఆవరణలో వేడుకలు జరుగుతాయని, పూరిలో 9రోజుల పాటు జరిగేలా ఇక్కడ మూడు రోజులు నిర్వహిస్తామన్నారు. ఈ మూడు రోజుల పాటు స్వామికి ప్రత్యేక పూజలతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలని కోరారు. వేణుధారి దాస్, బలరామ గోవిందదాస్, సోనార గోవిందదాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోను కలిసిన ఆరోగ్యమిత్ర ఉద్యోగులు

పాయకాపురం: ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈ వో లక్ష్మీని ఆరోగ్యమిత్ర ఉద్యోగులు బుధవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్ర ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ ఆరోగ్యమిత్ర ఉద్యోగుల ప్రధాన సమస్యలను ట్రస్ట్ సీఈవో లక్ష్మీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. సీఈవోను కలిసిన వారిలో నాగరాజు, గురవయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

కృష్ణాడెల్టా ఇక సస్యశ్యామలం

● నీటిని వదిలిన మంత్రి నిమ్మలకు అభినందన



వన్‌టౌన్, జూలై 10: కృష్ణా బ్యారేజీ నుంచి బుధవారం కృష్ణా తూర్పు డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుకు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర తినేత ఆళ్ల గోపాలకృష్ణారావు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తన కార్యాలయం నుంచి మాట్లాడుతూ 2015లో పట్టిసీమ నుంచి నీళ్లు అందించినందుకు కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందన్నారు. 13 లక్షల ఎకరాల్లోని వరి, చేపల చెరువులు, రొయ్యల చెరువుల్లో ఉత్పత్తి బాగా పెరిగి రూ.45వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. దీంతో దేశ జీడీపీలో కృష్ణాజిల్లా 2వ స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఇలాంటి పట్టిసీమను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని, పులిచింతల్లో నీరు నిల్వ ఉంచకుండా అసమర్థ నీటి యాజమాన్య చర్యలు తీసుకోవడంతో డెల్టాను ఎండబెట్టారన్నారు. చంద్రబాబు వచ్చాక పట్టిసీమ పైపులను బాగు చేయించి ఈ నెల 3న పోలవరం కుడి ప్రధాన కాలువకు, బుధవారం కృష్ణాడెల్టాకు నీరు విడుదల చేయడంపై సీఎంను, మంత్రిని అభినందిస్తున్నామన్నారు. కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వినతి




గన్నవరం, జూలై 10: నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సచివాలయంలో సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు నియోజకవర్గంలోని సమస్యల పై వినతి పత్రం ఇచ్చారు. పోలవరం కాలువ పరివాహక ప్రాంతంలో రైతులకు తాగునీరు అందించేందుకు పోలవరం కాలువపై 96 మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరారు. టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే ప్రక్రియను ప్రభుత్వం పక్కనపెట్టిందన్నారు. వెంటనే పనులను ప్రారంభించాలని కోరారు. ఏలూరు కాలువపై నియోజకవర్గంలో 3చోట్ల వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. వెంకట్రావు విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్‌లో హేపీవ్యాలీ విద్యార్థుల సత్తా

విజయవాడ స్పోర్ట్సు: విశాఖలో ఈనెల 7న ఆర్‌ఆర్ ఆక్వా స్పోర్ట్సు క్లబ్‌లో జరిగిన రాష్ట్ర స్విమ్మింగ్ పోటీల్లో ఆగిరిపల్లిలోని డాక్టర్ కేకేఆర్స్ హ్యాపీవ్యాలీ స్కూల్ విద్యార్థులు పతకాలతో మెరిశారు. ఫ్రీస్టయిల్ 50 మీటర్ల విభాగంలో శ్రీ చందన (స్వర్ణం), బ్యాక్‌స్ట్రోక్‌లో కాంస్యం, 50 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో ఎం.జస్మిత (రజతం) బటర్‌ఫ్లైలో కాంస్యం వశం చేసుకున్నారు. గ్రూప్-1 కేటగిరిలో ఫిన్ స్విమ్మింగ్ 50 మీటర్ల విభాగంలో రక్షిత్ కాంస్యం, గ్రూప్-2 ఫిన్ స్విమ్మింగ్‌లో రుషిల్ కుమార్ కాంస్యం సాధించారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ కేకేఆర్, డైరెక్టర్లు కె.అవినాష్, తేజ, ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, కోచ్ వీ అశోక్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

హజ్ యాత్రికులకు మంత్రి ఫరూక్ స్వాగతం



గన్నవరం, జూలై 10: హజ్ యాత్రను ముగించుకుని రాష్ట్రానికి తిరిగొచ్చిన హజ్ యాత్రికులకు బుధవారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. మంత్రి ఎన్ఎం డి ఫరూక్ హజ్ యాత్రికులకు స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ హజ్ యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుం డా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించిందన్నారు. ఈయాత్రను విజయవంతంగా ముగించుకుని తిరిగిరావటం అభినందనీయమన్నారు. హజ్ యాత్రికులు మాట్లాడుతూ తమకెలాంటి కష్టం లేకుండా సౌకర్యాలు కల్పించి తగిన చర్య లు ప్రభుత్వం తీసుకుందన్నారు. మంత్రి ఫరూక్‌తో పాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, హజ్ కమిటీ సీఈవో అబ్దుల్ ఖాదర్, టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతుల్లా, మౌలానా హుస్సేన్, ముఫ్తి ఫారూఖ్, టీడీపీ అధికార ప్రతినిధి రఫీ పాల్గొన్నారు.

వైసీపీ నేతల కోసం ప్రభుత్వ ఆదాయానికి గండి

● వల్లభనేని వంశీ లేఖతో మద్యం దుకాణం తరలింపు ● వైరల్ అవుతున్న లేఖ

గన్నవరం, జూలై 10: బార్ అండ్ రెస్టారెంట్ యజమానుల వ్యాపారం కోసం ప్రభుత్వ మద్యం దుకాణాన్ని మార్చి ప్రభుత్వాదాయాన్ని గండికొట్టారు. నియోజకవర్గంలో ఎక్కువ సేల్ ఉండే ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తరలించి పలువురు వైసీపీ నేతలకు మేలు చేశారు. ఊరు చివర ఉండే మద్యం షాపును ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్ సమీపంలో ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అధికారాన్ని ఉపయోగించి బేవరేజెస్ ఎండీకి ఏకంగా లేఖ రాశారు. అప్పటి లేఖ ఇప్పుడు వైరల్ అవుతుంది. మండలంలోని సూరంపల్లి శివారులో ఆర్‌అండ్‌బీ రహదారికి దగ్గరలో ప్రైవేటు మద్యం షాపు ఉండేది. 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే అక్కడే ప్రభుత్వ వైన్ షాపును ఏర్పాటు చేశారు. రోజుకు రూ.5లక్షలు వ్యాపారం ఉండేది. ఆ షాపును నాలుగైదు కిలోమీటర్ల దూరంలోని ముస్తాబాద గ్రామానికి మార్చాలని వంశీ లేఖ సిఫారసుతో ఎక్సైజ్ అధికారులు మార్చారు. దీని వెనుక బార్ అండ్ రెస్టారెంట్ యజమాని ఉన్నారు. భారీగా డబ్బులు చేతులు మారాయని ఆరోపణలు వచ్చాయి. సూరంపల్లిలో ప్రభుత్వ మద్యం దుకాణం వల్ల ఇబ్బందులున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని, మార్చకపోతే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉంటుందని లేఖలో వంశీ పేర్కొన్నారు. అయితే, సూరంపల్లిలోని షాపును తమ గ్రామానికి తరలించడాన్ని సహించేదిలేదని ముస్తాబాద మహిళలు ఎదురు తిరిగారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆందోళన కూడా జరిగింది. గతంలో అదేషాపును సూరంపల్లి గ్రామంలోకి మార్చేందుకు ప్రయత్నించగా, అక్కడి స్థానికులు వ్యతిరేకించారు. దీంతో ఆ షాపును నాలుగైదు కిలోమీటర్ల దూరంలోని ముస్తాబాద గ్రామానికి ఎక్సైజ్ అధికారులు తరలించారు. ఈ మద్యం దుకాణానికి సమీపంలోనే జడ్పీహెచ్ పాఠశాల, మరో ప్రైవేటు పాఠశాల ఉన్నాయి. అలాంటపుడు అక్కడ షాపును ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించినా లెక్క చేయలేదు. షాపు ఏర్పాటు చేసే ప్రదేశంలోనే బస్టాప్ ఉందని, అక్కడ బస్సు దిగి స్కూళ్లకు వెళ్లాలన్నా, ఇళ్లకు రావాలన్నా బస్టాప్‌కు రావాల్సి ఉంటుందన్నారు.

ఈ నేపథ్యంలో మందుబాబులతో ఇబ్బందులు తలెత్తుతాయనే భయాందోళన వ్యక్తం చేసిన వంశీ సిఫారసులతో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ముస్తాబాదలో రోజుకు రూ.2లక్షల సేల్ ఉండటం లేదు. బార్‌కు మాత్రం ఆదాయం వస్తుంది. వైసీపీ నేతలు ప్రైవేటు స్థలాన్ని నెలకు రూ.10వేలకు అద్దెకు తీసుకుని ప్రభుత్వం దగ్గర మాత్రం రూ.30వేలకు పైగా తీసుకుంటున్నారని చెబుతున్నారు. వంశీ లేఖతో వైసీపీ నేతలకు కాసుల వర్షం ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడింది.



ఉత్తమ పొగాకు రైతు అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న పురందేశ్వరి, మహేష్‌కుమార్ యాదవ్

13 మంది పొగాకు రైతులకు టీఐఐ అవార్డులు

▸▸ మరో ముగ్గురు శాస్త్రవేత్తలకూ పురస్కారాలు

దేవరపల్లి, జూలై 10: 'ప్రపంచంలోనే అత్యధిక పొగాకు ఎగుమతులు చేసేది భారతదేశమే. అదే విధంగా మన దేశంలో అత్యంత పొగాకు పండించే రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రపంచ మార్కెట్‌లో మన దేశంలో పండించే పొగాకు ఉత్పత్తులకు చాలా డిమాండు ఉందని' బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం జరిగిన టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) 24వ అవార్డు కార్యక్రమంలో ఆమె పాల్గొని పొగాకు శాస్త్రవేత్తలు, రైతులను సత్కరించారు. రాష్ట్రస్థాయిలో మొత్తం 16 మంది అవార్డులకు ఎంపికకాగా, ఇందులో 13 మంది రైతులకు, ముగ్గురు శాస్త్రవేత్తలకు పురస్కారాలు దక్కించుకున్నారు. రైతులకు ఇచ్చిన అవార్డుల్లో రెండు లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు, అయిదు బెస్ట్ ఫార్మర్ అవార్డులు, రెండు సస్టైనబిలిటీ అవార్డులు, నాలుగు రికగ్నైజేషన్ అవార్డులు నాలుగు ఉన్నాయి. పొగాకు సాగులో ఆధునిక సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, పొగాకు పంట పరిశోధన, అభివృద్ధిలో నిమగ్నమైన అభ్యుదయ రైతుల వ్యవసాయ క్షేత్రాలను ఎంపిక చేసి వారికి ఈ అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ ఈ అవార్డులకు రైతులతోపాటు శాస్త్రవేత్తలను ఎంపిక చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రైతులు పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పంటసాగు చేయాలని సూచించారు. ఈ ఏడాది అకాల వర్షాలకు పొగాకు పంట దెబ్బతిందన్నారు. రైతుల కోరిక మేరకు పరిమితి మించి జరిగిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీని రద్దుచేయాలని వాణిజ్యశాఖ మంత్రి పియూష్‌గోయల్‌తో మాట్లాడాననిని, త్వరలోనే నిర్ణయం వస్తుందన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని, పొగాకుకు, పామాయిల్ పంటకు రైతుల తరపున తాము సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన ఉన్నతాధికారులు

జిల్లా కేంద్రాల్లో ఆక్వా హబ్‌లు!

▸▸ మత్స్యకారుల పడవలకు శాటిలైట్ సిస్టమ్‌ల ఏర్పాటు

▸▸ ఉత్పత్తులు, ఎగుమతుల పెంపునకు ప్రణాళికలు

▸▸ పాత పథకాల పునరుద్ధరణకు చర్యలు: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ సాగర తీరం ఉన్న ఏపీలో మత్స్య ఉత్పత్తుల, ఎగుమతుల వృద్ధికి, పరిశ్రమల సామర్థ్యం పెంపునకు ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడలో మత్స్యశాఖపై సమీక్షలో మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులందరికీ జాతీయ మత్స్యకార దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'గత ప్రభుత్వంలో మత్స్యకారుల డీజిల్ రాయితీకి సంబంధించి ఉన్న రూ.10కోట్ల బకాయిని వెంటనే చెల్లించాలి. కేరళ, గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కార్యక్రమాలపై అధ్యయనం చేయాలి. మత్స్యకార భరోసా పరిహారం, లబ్ధిదారులపై రీసర్వే చేసి, 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలి. విజయవాడ, కలిదిండిలో మాదిరిగా జిల్లా కేంద్రాల్లో ఆక్వా హబ్‌ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలి. విపత్తుల సమయంలో మత్స్యకారులను అప్రమత్తం చేయడంతో పాటు వారు సురక్షితంగా ఒడ్డుకు చేరేలా వేటకు వెళ్లే పడవలకు శాటిలైట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి. 2014-19 మధ్య మత్స్యశాఖలో టీడీపీ ప్రభుత్వం అమలుచేసిన పథకాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి' అని అధికారులను మంత్రి ఆదేశించారు. మత్స్యశాఖ ఆర్థిక పరిస్థితులపై నివేదికలిస్తే.. బడ్జెట్ సమావేశాల్లో పెట్టి, ఆమోదం లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో మత్స్యశాఖ పరిస్థితి చూస్తుంటే చాలా బాధ కలుగుతోందని చెప్పారు. బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, ఓడరేవు, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ల పరిస్థితులపై నివేదిక కోరారు. సమావేశంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఆక్వా, ఫిషరీస్‌శాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు, కమిషనర్ సూర్యకుమారి, అదనపు డైరెక్టర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు న్యాయం చేస్తాం..

గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ అగ్ని ప్రమాదంలో పసుపు నిల్వలు నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. విజయవాడలోని ఏపీ మార్క్‌ఫెడ్ ప్రధాన కార్యాలయంలో బాధిత రైతులతో మంత్రి బుధవారం మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 19న అగ్నిప్రమాదంలో 104 వేల బస్తాల పసుపు కాలిపోయిందని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో బాధిత రైతులు, బీమా కంపెనీ ప్రతినిధులు, కోల్డ్‌స్టోరేజీ యాజమాన్యంతో చర్చించి సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్, మార్క్‌ఫెడ్ ఎండీ శేఖర్‌బాబు పాల్గొన్నారు. కాగా, జగన్ సర్కార్ తెచ్చిన కౌలు రైతుల చట్టాన్ని రద్దు చేయాలని కౌలురైతుల సంఘ నేతలు మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ ఎన్జీవో నేతలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

తుఫానుకు రైతులు అల్లాడుతుంటే.. జగన్‌కు రెడ్ కార్పెట్ పరుస్తారా?

▸▸ బాపట్ల జిల్లా వ్యవసాయాధికారిని నిలదీసిన పరుచూరు ఎమ్మెల్యే

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతుల పరామర్శకు అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి బాపట్లకు వచ్చినప్పుడు రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలకాలనే ఇన్నోవేషన్ ఐడియా ఎవరిది..? మూడు లక్షల ఎకరాల్లో పంట నష్టపోయి రైతులు లబోదిబోమంటుంటే రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలికారంటే ఏమనాలి' అని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారిని టీడీపీ పరుచూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రశ్నించారు. అప్పట్లో ఆ ఏర్పాట్లు చేసిందెవరో కనుక్కొని చెప్పాలని ఆదేశించారు. బుధవారమిక్కడ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అధికారులతో పరిచయ కార్యక్రమం, వివిధ అంశాలపై సమీక్ష సమావేశం జరిగింది. జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు బాపట్ల ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అనగాని మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయం మీద వైసీపీ పెట్టిన శ్రద్ధ బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణంపై పెట్టలేదని విమర్శించారు. మారిటైమ్ బోర్డులను కూడా తనఖాపెట్టి రుణాలను తెచ్చిన ఘనత గత ప్రభుత్వానిదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కేవలం ఇసుక తవ్వుకోవడానికే అనే విధంగా వైసీపీ ప్రభుత్వం మార్చేసిందని గొట్టిపాటి మండిపడ్డారు. ఆ ప్రాజెక్టుకు తక్షణం గేట్లు పెట్టాల్సిన అవసరముందన్నారు. సీపీడబ్ల్యూ స్కీములను రాజకీయ నిరుద్యోగులకు కాంట్రాక్టులివ్వడానికే అనే విధంగా చేసి మొత్తం తాగునీటి వ్యవస్థనే అధోగతి పట్టించారని విమర్శించారు.

పైన వంకాయలు...అడుగున ఎర్ర దుంగలు

▸▸ గుట్టురట్టు చేసిన పోలీసులు



తడ, జూలై 10: వంకాయల మాటున ఎర్రచందనం రవాణా చేస్తున్న గుట్టును పోలీసులు రట్టుచేశారు. తిరుపతి జిల్లా తడ మీదుగా చెన్నైకి ఒక ట్రక్కు ఆటోలో ఎర్రచందనం రవాణా అవుతున్నట్టు పోలీసులకు మంగళవారం రాత్రి సమాచారం అందింది. దీంతో భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన ఓ ట్రక్కును ఆపగా వంకాయల బస్తాలతో చెన్నై మార్కెట్‌కు వెళుతున్నట్టు డ్రైవర్ చెప్పాడు. అయితే పరిశీలించిన పోలీసులు వంకాయల అడుగుభాగాన ఎర్రచందనాన్ని గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనంలో సుమారు రూ. 30లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు, 40 బస్తాల వంకాయలు గుర్తించారు. పోలీసుల విచారణలో డ్రైవరును కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన కత్తి వెంకటసుబ్బయ్యగా గుర్తించారు. అక్కడి నుంచే చెన్నైకి ఎర్రచందనాన్ని తరలిస్తున్నట్టుగా అనుమానిస్తున్నారు.

అసెంబ్లీలో సీఎఫ్ఎంఎస్‌పై కాగ్ నివేదిక

- వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థ నిర్వీర్యం
- నిబంధనలు ఉల్లంఘించి అస్మదీయులకు బిల్లులు
- అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం
- ఆర్థిక శాఖపై శ్వేతపత్రం 18న!
- ఇంకా పూర్తిగా అందని సమాచారం

అమరావతి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీ నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన సీఎఫ్ఎంఎస్‌పై కాగ్ ఇచ్చిన నివేదికను ప్రవేశ పెట్టనున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎఫ్ఎంఎస్‌లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అంతకుముందు టీడీపీ హయాంలో అత్యంత పకడ్బందీగా రాష్ట్ర చెల్లింపుల వ్యవస్థను తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ, ఇతర రాష్ట్రాలు ఈ వ్యవస్థను ప్రశంసించాయి. పలు అవార్డులు కూడా వచ్చాయి. కానీ జగన్ సీఎం అయ్యాక సీఎఫ్ఎంఎస్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. మొదట వచ్చిన బిల్లును మొదట చెల్లించాలన్న నిబంధన ఆధారంగా ఫిఫోను ఈ వ్యవస్థలో ప్రవేశపెట్టారు. కానీ వైసీపీ హయాంలో ఫిఫోను పూర్తిగా విస్మరించారు. ముందుగా వచ్చిన బిల్లులను పక్కనపడేసి వైసీపీ అస్మదీయుల బిల్లులను మాత్రమే చెల్లించారు. పెండింగ్ బిల్లులు ఫిఫో ప్రకారం చెల్లింపులు జరపాలని కోరుతూ హైకోర్టులో ఏకంగా 4 లక్షల పిటిషన్లు పడ్డాయి. గత ప్రభుత్వంలో ఫిఫో ఉల్లంఘనలు సీఎఫ్ఎంఎస్‌లో రికార్డు కాకుండా పలు మార్పులు కూడా చేశారు. పూర్తిస్థాయిలో సీఎఫ్ఎంఎస్‌ను పక్కనపెట్టి మరో వ్యవస్థ హెర్బ్‌ను తీసుకొచ్చారు. హెర్బ్ విఫలమవడంతో తిరిగి సీఎఫ్ఎంఎస్ బాటపట్టారు. మొత్తం రాష్ట్రంలో చెల్లింపులను గందరగోళం చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే కాగ్ నివేదికలో ఈ అక్రమాలు బయటపడే అవకాశం ఉంది.

18న ఆర్థిక శ్వేతపత్రం

ఈ నెల 12వ తేదీన ఆర్థిక శాఖపై శ్వేతపత్రం విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించినా... పెండింగ్ బిల్లుల వివరాలు, ఇతర కార్పొరేషన్ల అప్పుల వివరాలపై ఇంకా సమాచారం రాకపోవడంతో సాధ్యం కాకపోవచ్చని ఆర్థిక శాఖ భావిస్తోంది. మరోవారం సమయం ఇస్తే అంటే.. జూలై 18వ తేదీన పూర్తి వివరాలతో విడుదల చేసేందుకు వీలుంటుందన్న అభిప్రాయం ఆర్థిక శాఖ వ్యక్తం చేసింది.

చంద్రబాబు- రేవంత్ భేటీ పాలనాపరమైనదే

- టీడీపీ నేత తిరునగరి జ్యోత్స్న

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు- రేవంత్ రెడ్డిల భేటీ పాలనాపరమైనదని టీడీపీ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న అన్నారు. తెలంగాణ రాజకీయ ముఖచిత్రంపై టీడీపీ ఏదో కొత్తగా వచ్చేస్తుందని, విస్తరిస్తుందని మాట్లాడుతున్నవారు వాస్తవాలను తెలుసుకోవాలని ఆమె అన్నారు. ఈమేరకు ఆమె హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు-రేవంత్‌లది విభజన సమస్యలపై పాలనపరమైన భేటీనే తప్ప రాజకీయ భేటీ కాదని స్పష్టం చేశారు. ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ ఇకనైనా చిల్లర, సెంటిమెంట్ రాజకీయాలను వదిలేయాలని సూచించారు. నిరంజన్ రెడ్డి మాటలు మతిలేని వారు మాట్లాడే మాటల్లా ఉన్నాయన్నారు. తెలుగు ప్రజల కోసం టీడీపీ ఎప్పటికీ పని చేస్తూనే ఉంటుందన్నారు. పది మందికి అన్నం పెడుతున్న ఎన్టీఆర్ భవన్‌ను కూల్చేయాలని మాట్లాడే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని జ్యోత్స్న హెచ్చరించారు.

పోలీసులు గుర్తు పట్టకుండా ప్లాస్టిక్ సర్జరీలు

- అరెస్టుల నుంచి తప్పించుకొనేందుకు ఫిలిప్పీన్స్‌లో నేరగాళ్ల కొత్త ఎత్తులు

న్యూఢిల్లీ, జూలై 10: పోలీసులు తమను గుర్తుపట్టకుండా ఫిలిప్పీన్స్‌లో నేరగాళ్లు ప్లాస్టిక్ సర్జరీలు చేసుకుంటున్నారు. ఇలాంటి వారికోసమని ఆ దేశంలో కొన్ని రహస్య ఆస్పత్రులు కూడా వెలిశాయి. మే నెలలో అధికారులు ఓ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించిన సమయంలో ఈ విషయం వెల్లడైంది. తాజాగా, మరో రహస్య ఆస్పత్రిని గుర్తించారు. ఈ హాస్పిటళ్లలో హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ పరికరాలు, దంత నమూనాలు, శరీరం రంగును మార్చే ద్రావణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో ఒక మనిషి రూపురేఖలను పూర్తిగా మార్చవచ్చని అధికారులు తెలిపారు. ఈ రహస్య ఆస్పత్రుల క్లయింట్లంతా నిబంధనలకు విరుద్ధంగా ఫిలిప్పీన్స్‌లో ఉంటున్నవారు, క్యాసినో ఆడేవారు, గ్యాంబ్లర్లు, కరడుగట్టిన నేరస్థులేనని వివరించారు. ఈ వ్యవహారంలో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు వియత్నాం, ఒకరు చైనాకు చెందినవారు. ఈ రెండు ఆస్పత్రులను శాశ్వతంగా మూసివేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పంజాబ్, గోవా ఎన్నికల కోసం ఆప్ రూ.100 కోట్లు డిమాండ్: ఈడీ

న్యూఢిల్లీ, జూలై 10: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేతలు పంజాబ్, గోవా ఎన్నికల ఖర్చుల కోసం అదనంగా రూ.100 కోట్లను డిమాండ్ చేసినట్లు ఈడీ ఆరోపించింది. మంగళవారం ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ-37గా ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఏ-38గా పేర్కొన్న ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లకు వ్యతిరేకంగా అభియోగాలు మోపింది. వినోద్ చౌహాన్ ద్వారా కేజ్రీవాల్ తమను రూ.100 కోట్ల మేర అదనపు డబ్బులను డిమాండ్ చేశారని, పంజాబ్, గోవా ఎన్నికల ఖర్చుల కోసం ఆ మేరకు అందజేయాలని సూచించారని ఈ కేసులో అప్రూవర్‌గా మారిన అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్‌రెడ్డి వాంగ్మూలాన్ని ఉటంకించారు. ఢిల్లీ జల్ బోర్డు(డీజేబీ) పోస్టింగుల్లోనూ వినోద్ చౌహాన్ కీలకంగా వ్యవహరించారని, నేరుగా కేజ్రీవాల్ ద్వారా వ్యవహారాలు నెరిపారని పేర్కొన్నట్లు ప్రస్తావించారు. అయితే.. తనకు శరత్‌రెడ్డి ఎవరో తెలియదని కేజ్రీవాల్ తన వాంగ్మూలంలో చెప్పారు. కాగా, కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను సవాలు చేస్తూ ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై మంగళవారమే కేజ్రీవాల్‌కు నోటీసులు ఇచ్చామని, ఆయన స్పందన రాత్రికి వస్తుందని, ఆ తర్వాత కౌంటర్ సమర్పించాలని న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సాల్.. ఈడీ తరఫున వాదనలు వినిపిస్తున్న ఏఎస్జీ రాజుకు సూచించింది.

సరిహద్దుల్లో శాంతిస్థాపనకు కలిసి పని చేద్దాం!

- అజిత్ దోభాల్‌కు చైనా విదేశాంగ మంత్రి సందేశం

బీజింగ్, జూలై 10: భారత, చైనా సరిహద్దుల్లో శాంతి స్థాపనకు, సమస్యల పరిష్కారానికి భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్‌తో కలిసి పని చేసేందుకు చైనా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి వాంగ్‌ఈ సంసిద్ధత తెలియజేశారు. అజిత్ దోభాల్‌ను భారత జాతీయ భద్రత సలహాదారుగా, భారత్, చైనా సరిహద్దు వివాదాలపై ప్రత్యేక ప్రతినిధిగా ప్రభుత్వం ఇటీవల తిరిగి నియమించింది. ఈ నేపథ్యంలో అజిత్ దోభాల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ వాంగ్‌ఈ మంగళవారం ఓ సందేశాన్ని పంపారు. భారత్, చైనా సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సామరస్యత కోసం ఇరుదేశాల నేతలు ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయాలను అమలు చేసే అంశంలో దోభాల్‌తో కలిసి పని చేసేందుకు తాను సిద్ధమని వాంగ్‌ఈ ఆ సందేశంలో పేర్కొన్నారు. ఈ మేరకు చైనా అధికారిక మీడియాలో బుధవారం వార్తలు వెలువడ్డాయి. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌ఈ కజకిస్థాన్‌లో ఇటీవల జరిగిన ఓ సదస్సులో భాగంగా భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో అజిత్ దోభాల్‌తో కలిసి పని చేస్తానంటూ వాంగ్‌ఈ అనడం ప్రాధాన్యం సంతరించుకుంది.



అమరావతిలో జంగిల్ క్లియరెన్స్

- 36.50 కోట్ల అంచనాతో సీఆర్‌డీఏ టెండర్లు
- 15న కాంట్రాక్టు సంస్థలతో ప్రీబిడ్ మీటింగ్
- 22 నుంచి 25 వరకు బిడ్ల స్వీకరణ
- గత ప్రభుత్వంలో విధ్వంసంతో డబుల్ ఖర్చు

విజయవాడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ చర్యల కారణంగా అమరావతి రాజధాని విధ్వంసంతో భారీ నష్టం సంభవించటంతో పాటు నష్ట నివారణ కోసం ఏ పని చేయాలన్నా రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రాజధాని వ్యాప్తంగా కమ్మేసిన పిచ్చిచెట్లు, భారీగా పెరిగిన ముళ్ల కంపలను తొలగించటానికి సీఆర్‌డీఏ రూ.36 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. అమరావతి రాజధాని పనులకు సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది. సీఎం పర్యటన సందర్భంగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో పిచ్చిచెట్లు, కంపలను కొంత మేర తొలగించినా.. రాజధాని వ్యాప్తంగా వీటిని తొలగించటం సీఆర్‌డీఏకు పెను సవాల్‌గా మారింది. దీంతో భారీఎత్తున యంత్ర సామగ్రిని ఉపయోగించి వీటిని తొలగించటానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలవాల్సి వచ్చింది. అమరావతి రాజధానిలో జంగిల్ క్లియరెన్స్ చేయటం కోసం రూ.36.50 కోట్ల అంచనా వ్యయంతో సీఆర్‌డీఏ అధికారులు మంగళవారం టెండర్లు పిలిచారు. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి బిడ్ డాక్యుమెంట్‌ను ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ నెల 15వ తేదీన కాంట్రాక్టర్లతో ప్రీ బిడ్ మీటింగ్ నిర్వహిస్తారు. 22వ తేదీన క్లారిఫికేషన్స్ కోసం కాంట్రాక్టర్లతో సమావేశమౌతారు. అదేరోజు నుంచి బిడ్లను సమర్పించుకునే అవకాశం కల్పిస్తారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3 గంటలతో బిడ్ల సమర్పణకు గడువు ముగుస్తుంది. కాంట్రాక్టు సంస్థలు కన్సార్టియంగా కానీ జాయింట్ వెంచర్‌గా కానీ ఏర్పడి టెండర్లలో పాల్గొనేలా అవకాశం కల్పించారు. అంతిమంగా అర్హతల ప్రాతిపదికన, అతి తక్కువగా కోట్ చేసిన సంస్థకు పనులు అప్పగిస్తారు. రాజధాని వ్యాప్తంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడానికి నిర్దేశిత గడువు, స్కోప్ ఆఫ్ వర్క్స్ గురించి కాంట్రాక్టు సంస్థలతో నిర్వహించే ప్రీ బిడ్ సమావేశంలో తెలియజేస్తారు. రాజధానిలో ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణాలు జరిపే చోట, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా జోన్లు, ట్రంక్ ఇన్‌ఫ్రా ప్రాంతాల్లో దట్టంగా అడవిలా పెరిగిపోయిన చెట్లను, ముళ్ల కంపలను తొలగించనున్నారు. దాదాపుగా రాజధాని ప్రాంతం అంతా పెరిగిపోయిన కంప వనాన్ని తొలగించటానికి ఎంత లేదన్నా నెల రోజులకుపైగా సమయం పడుతుందని తెలుస్తోంది.



మళ్లీ సీఆర్‌డీఏలోకి రావాలని..!

- గత ప్రభుత్వంలో పనిచేసిన ఓ అధికారి యత్నం
- ఆయనతో రాజధాని రైతులకు క్షోభ!

విజయవాడ, జూలై 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో అంటకాగుతూ రాజధాని విధ్వంసానికి తమ వంతు తోడ్పాటు అందించిన అధికారులు మళ్లీ సీఆర్‌డీఏలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సీఆర్‌డీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా తిరిగి రావటానికి గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారి లాబీయింగ్ చేస్తున్నారు. గతంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా రాజధానికి చెందిన అన్ని వర్గాల రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేశారు. వైసీపీ ప్రభుత్వం అమరావతి రాజధానిని విధ్వంసం చేసిన క్రమంలో స్థానికంగా భూములు త్యాగం చేసిన రైతులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. రాజధాని నిర్మాణ పనులు ఎటూ లేవు. కనీసం తమ సమస్యలను పరిష్కరించాలని వచ్చే రైతులకు ఈ అధికారి చూపిన నరకం అంతా ఇంతా కాదు. గత సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ గత ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకున్నారు. కమిషనర్ చెప్పిన ఆజ్ఞలను ఈ అధికారి జవదాటేవారు కాదు. రాజధాని నిర్మాణం ఎటూ లేదు. కనీసం వారి త్యాగాన్ని గుర్తించైనా రైతుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాల్సిన ఈ అధికారి పెడ చెవిన పెట్టేవారు. ఎన్నికల ముందు బదిలీపై వెళ్లిన ఈ అధికారి ప్రభుత్వం మారాక మళ్లీ సీఆర్‌డీఏకు రావటానికి చేయని ప్రయత్నం లేదు. అయితే, రైతులు వ్యతిరేకిస్తున్నారు.

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

- పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు
- లావణ్యపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు
- రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ
- నార్సింగ్ రాణాలో లావణ్య మరో ఫిర్యాదు



బంజారాహిల్స్, నార్సింగ్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబాదరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం రాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు రాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్ట విరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు.

సవతి కుమారుడు నన్ను రేప్ చేశాడు

- యూపీ పోలీసులకు రిటైర్డ్ ఐఏఎస్ భార్య ఫిర్యాదు

లఖ్‌నవూ, జూలై 10: తన భర్త మొదటి భార్య కుమారుడు తనపై అత్యాచారం చేశాడని ఓ మాజీ ఐఏఎస్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. యూపీలోని ఘజియాబాద్‌కు చెందిన 40 ఏళ్ల అనాథ మహిళ 2020లో జమ్మూకశ్మీర్‌కు చెందిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని పెళ్లి చేసుకున్నారు. పెళ్లైనప్పటి నుంచి తన భర్త కుటుంబం తనను పరిపరివిధాలుగా వేధింపులకు గురిచేస్తోందని ఆమె బుధవారం పోలీసులను ఆశ్రయించారు. తన భర్త మొదటి భార్య, ఆమె కుమారుడు, కుమార్తె తనను వరకట్న వేధింపులకు గురిచేశారన్నారు. అంతేకాకుండా తన సవతి కుమారుడు అతడి సహాయకులు తనపై అత్యాచారం చేశారని, భోజనం కూడా పెట్టకుండా గదిలో బంధించారని ఆరోపించారు. ఎంతో బతిమలాడిన తర్వాత ఈ విషయాలను బయటకు చెప్పనని రాతపూర్వకంగా హామీ తీసుకుని తనను వదిలేశారని.. ఒక వేళ చెప్తే చంపేస్తామని బెదిరించారని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైడెన్‌కు బీమా పాలసీగా కమలా హ్యారిస్: డొనాల్డ్ ట్రంప్ విమర్శ

- గోల్ఫ్ మ్యాచ్ ఆడాలని బైడెన్‌కు సవాల్

వాషింగ్టన్, జూలై 10: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్(81), ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్(78) విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కమలా హ్యారిస్‌ను జోబైడెన్‌కు బీమా పాలసీగా అభివర్ణించారు. నవంబరు 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థి మార్పిడిపై డెమోక్రటిక్ పార్టీలో చర్చ తీవ్రమవుతోంది. జోబైడెన్ తీరు పట్ల ఆ పార్టీలోనే వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ట్రంప్ తన విమర్శలకు పదును పెడుతున్నారు. జోబైడెన్.. కమలాహ్యారిస్‌ను ఉపాధ్యక్షురాలిగా ఎంపిక చేసుకోవడం అద్భుతమైన నిర్ణయం అని, అదే ఆయనకు అత్యుత్తమ బీమా పాలసీ కావొచ్చు అని ఫ్లోరిడాలో ట్రంప్ అన్నారు. హ్యారిస్‌కు సరిహద్దు భద్రతా బాధ్యతలు అప్పగించినా ఒక్కసారైనా ఆమె అక్కడకు వెళ్లలేదని చెప్పారు. ఇదిలా ఉండగా.. జోబైడెన్‌కు డొనాల్డ్ ట్రంప్ రెండు సవాళ్లు విసిరారు. గోల్ఫ్ ఆడటానికి సిద్ధమా అంటూ ఫ్లోరిడాలో నిర్వహించిన సభలో సవాల్ చేశారు. అలాగే ఈ వారంలో మరో చర్చకు సిద్ధం కావాలన్నారు.

కర్ణాటకలో 'ముడా' స్కాం కలకలం

- ముఖ్యమంత్రి సతీమణి ప్రమేయంపై ఆరోపణలు
- ఆమెతో పాటు మరో ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు
- ఖజానాకు 4000 కోట్ల నష్టం వాటిల్లిందని బీజేపీ విమర్శ
- సీబీఐ దర్యాప్తునకు డిమాండ్

బెంగళూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) కుంభకోణం వ్యవహారం కలకలం రేపుతోంది. ఇందులో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన సతీమణి పార్వతితో పాటు మరో ఇద్దరి ప్రమేయం ఉందంటూ విజయనగర పోలీసులకు ఫిర్యాదు అందింది. సిద్దరామయ్య, పార్వతి, ముడా అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఆయన ఫిర్యాదును స్వీకరించలేదు. ఇప్పటికే ముడాలో అక్రమాల ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. పార్వతికి ఆమె సోదరుడు 1998లో ఇచ్చిన భూమికి నష్టపరిహారం లభించిందని ముఖ్యమంత్రి చెబుతుండగా.. ఆ భూమిని మల్లికార్జున 2004లో కొనుగోలు చేసి 2010లో పార్వతికి బహుమతిగా ఇచ్చారని స్నేహమయి కృష్ణ చెబుతున్నారు. ఈ భూమి అప్పటికే డీనోటిఫై చేసినా వ్యవసాయ భూమిగా తప్పుగా చూపారని ఆరోపించారు. ఆ తర్వాత ఆ భూమిని ముడా సేకరించిందని.. అందుకు పరిహారంగా 2021లో దక్షిణ మైసూరులో అత్యంత ఖరీదైన 38,283 చదరపు గజాల స్థలాన్ని పార్వతి పొందారని తెలిపారు.



అయితే ప్రభుత్వం, రెవెన్యూ అధికారుల సహాయంతో ఫోర్జరీ పత్రాలతో మల్లికార్జున ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారని స్నేహమయి కృష్ణ ఆరోపించారు. 1998లోనే ఆ భూమి కొనుగోలు చేసినట్టుగా చూపి, 2014లో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పార్వతి లబ్ధి పొందారని తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. ముడాలో అక్రమాలు జరిగాయని ముఖ్యమంత్రి సతీమణి పార్వతి భూకేటాయింపు ద్వారా అనుచిత లబ్ధి పొందారని ఇప్పటికే బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ముడా లేఔట్ అభివృద్ధికి సేకరించిన భూమికి పరిహారంగా ప్రస్తుత ముఖ్యమంత్రి సతీమణి సహా పలువురు ప్రముఖులు మైసూరులో ఖరీదైన భూములను పొందారనేది ప్రధాన ఆరోపణ. ముడా సేకరించిన భూమి కంటే పరిహారంగా చెల్లించిన భూమి అనేక రెట్లు విలువైనదని.. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు రూ.4000 కోట్లు నష్టం వాటిల్లిందని కమలనాథులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని శాసనసభలో ప్రతిపక్ష నేత ఆర్.అశోక డిమాండ్ చేశారు. మరోవైపు ఈ వ్యవహారంపై కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత కుమారస్వామి స్పందిస్తూ.. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే ముడా కుంభకోణం తెరపైకి వచ్చిందని తెలిపారు. ఈ వివాదంపై సిద్దరామయ్య స్పందించారు. 'నా భార్యకు ముడా కేటాయించిన ఇంటి స్థలాల విషయంలో బీజేపీ రాజకీయం చేస్తోంది. శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తే సమాధానం చెబుతా' అని ఆయన అన్నారు. మైసూరులో బుధవారం మాట్లాడిన సిద్దరామయ్య.. ఒకే విషయాన్ని ఎన్నిసార్లు ప్రశ్నిస్తారని మీడియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముడా నుంచి 50:50 నిష్పత్తిలో 2019లో బీజేపీ హయాంలోనే ఇంటి స్థలాలు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు.

మీ కాళ్లు పట్టుకుంటా... తొందరగా రోడ్డు పని చేయండి!

- ప్రైవేటు కంపెనీ ప్రతినిధితో బిహార్ సీఎం నీతీశ్ కుమార్

పట్నా, జూలై 10: బిహార్ సీఎం నీతీశ్ కుమార్ తన చేష్టలతో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. తాజాగా తమ రాష్ట్రంలో రోడ్డు పని త్వరగా పూర్తిచేయాలని ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధిని కోరుతూ... మీ కాళ్లు పట్టుకోమన్నా పట్టుకుంటా... అని ఆశ్చర్యపరిచారు. పట్నాలో ట్రాఫిక్ సమస్యలు తీర్చేందుకు నిర్మిస్తోన్న 'జేపీ గంగా పాత్' రహదారిలో కొంత భాగాన్ని బుధవారం ప్రారంభించారు. సదరు ప్రాజెక్టుపై దాన్ని నిర్మిస్తోన్న ప్రైవేటు కంపెనీ ఓ నివేదిక సమర్పించింది. దానిపై అసంతృప్తి చెందిన సీఎం నీతీశ్ ఈ ఏడాది చివరికి పని పూర్తిచేయాలని ఆ కంపెనీ ప్రతినిధిని కోరారు. అంతటితో ఆగక లేచి నిలబడి "కావాలంటే మీ కాళ్లు పట్టుకుంటా..." అని అన్నారు. దీంతో భీతిల్లిన సదరు కంపెనీ ప్రతినిధి వెంటనే వెనక్కి జరిగి... అలాంటి పని చేయవద్దని వేడుకున్నారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ఈ వీడియోని షేర్ చేస్తూ... ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం నీతీశ్ 'లచార్'(అధికారం లేని వ్యక్తి) అని పేర్కొన్నారు. అందుకే అందరి కాళ్ల మీద పడేందుకు తయారుగా ఉంటారని ఎద్దేవా చేశారు. వారం క్రితం కూడా నీతీశ్ భూ వివాదాలు సత్వరం పరిష్కరించాలని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని కోరుతూ అవసరమైతే ఆయన కాళ్లు పట్టుకుంటానన్నారు.



అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఇంజెక్షన్ వికటించి 23 మందికి అస్వస్థత

- నక్కపల్లి ఆస్పత్రిలో ఘటన.. డ్యూటీ డాక్టర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు

నక్కపల్లి, జూలై 10: అనకాపల్లి జిల్లా నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మంగళవారం రాత్రి సిబ్బంది ఇచ్చిన ఇంజెక్షన్లు వికటించాయి. సుమారు 23 మందికి జ్వరం తీవ్రం కావడంతో పాటు వాంతులు అవ్వడంతో డ్యూటీ డాక్టర్ జయలక్ష్మి గుర్తించి నిమిషాల వ్యవధిలో ఎవిల్, డెక్రడాన్ ఇంజెక్షన్లు ఇవ్వడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం అందరినీ ప్రత్యేక అంబులెన్సుల్లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని నక్కపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష చెప్పారు.



రియాక్షన్ వచ్చిన ఇంజెక్షన్ సిఫోటాక్షిమ్

నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలోని జనరల్ వార్డులో మంగళవారం రాత్రి సుమారు 30 మంది ఇన్‌పేషెంట్లుగా ఉన్నారు. యథావిధిగా జ్వరం, నీరసం తగ్గేందుకు సిబ్బంది యాంటీ బయాటిక్ ఇంజెక్షన్ సిఫోటాక్షిమ్ సహా మెట్రోజల్, సిప్రోఫ్లాక్సిన్ ఇచ్చారు. ఇంజెక్షన్లు చేసిన వెంటనే మొదట ఆరుగురికి జ్వరం తీవ్రం కావడంతో పాటు వాంతులు అయ్యాయి. ఆ తరువాత కాసేపటికి మిగిలిన రోగులలో కూడా ఈ లక్షణాలు కన్పించాయి. సిఫోటాక్షిమ్ ఇంజెక్షన్ వల్లే రియాక్షన్ వచ్చినట్టు ప్రాథమికంగా వైద్యాధికారులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే పలువురు నాయకులు నక్కపల్లి ఆస్పత్రికి చేరుకున్నారు. హోంమంత్రి వంగలపూడి అనితకు మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిసెట్టి బుజ్జి ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే హోం మంత్రి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించి, సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. రోగులను కాపాడేందుకు ఎవిల్, డెక్రడాన్ ఇంజెక్షన్లు చేసిన అనంతరం అంబులెన్స్‌ల్లో వారిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇతర వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన బుచ్చిరాజుపేటకు చెందిన సింహాద్రి అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్యాధికారులు చెప్పారు.

ఆల్మట్టికి 84 వేల క్యూసెక్కుల వరద

- రెండ్రోజుల్లో దిగువకు నీటిని వదిలే చాన్స్
- తుంగభద్రకు 27 వేల క్యూసెక్కులు..

హైదరాబాద్/గద్వాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. బుధవారం కృష్ణా బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 84 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. జలాశయం పూర్తి నీటినిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా... 81.44 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం నిండితే తెలంగాణ కీలక ప్రాజెక్టులకు నీరు విడుదల కానుంది. రెండ్రోజుల్లో ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక తుంగభద్ర ప్రాజెక్టుకు 27,544 క్యూసెక్కుల వరద వచ్చింది. తుంగభద్ర నీటి నిల్వ సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 25.17 టీఎంసీల నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 2,256 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గోదావరి బేసిన్‌లోని మేడిగడ్డ బ్యారేజీకి 41 వేల క్యూసెక్కులు, తుపాకులగూడెం(సమ్మక్కసాగర్) బ్యారేజీకి 64 వేల క్యూసెక్కులు, దుమ్ముగూడెం(సీతమ్మసాగర్)కు 66 వేల క్యూసెక్కులు, అన్నారం బ్యారేజీకి 650 క్యూసెక్కులు, సుందిళ్లకు 956 క్యూసెక్కుల వరద రాగా.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదిలిపెడుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లికి 396 క్యూసెక్కులు, కడెం 464 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1,852 క్యూసెక్కులు, సింగూరులకు 300 క్యూసెక్కుల వరద రికార్డయింది.

వ్యాజ్యాన్ని ధర్మాసనం ముందు ఉంచండి

- ఎమ్మెల్సీ రఘురాజు పిటిషన్‌పై రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 10(ఆంధ్రజ్యోతి): తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎమ్మెల్సీ రఘురాజు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి అనుమతితో విచారణ నిమిత్తం ధర్మాసనం ముందు ఉంచాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి బుధవారం ఆదేశాలిచ్చారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి చైర్మన్ ఈ నెల 4న ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మాజీ ఎమ్మెల్సీ రఘురాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండలి చైర్మన్ ఉత్తర్వుల అమలును నిలుపుదల చేయాలని కోరారు. స్థానిక సంస్థల కోటా కింద తన స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంటూ ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా ఈసీని ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా రఘురాజుపై అనర్హత వేటు నేపథ్యంలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు నోటిఫై చేస్తూ ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయవద్దని ఈసీని హైకోర్టు ఆదేశించింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపిస్తూ... ప్రస్తుత వ్యాజ్యం ధర్మాసనం ముందు విచారణకు రావాలన్నారు. అనర్హత సంబంధిత పిటిషన్లను ధర్మాసనమే విచారించాలని గతంలో ఓ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అందుకు సంబంధించి వివరాలను కోర్టు ముందు ఉంచారు. ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనలకు అనుగుణంగా ఖాళీ అయిన స్థానానికి 6 నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని, ఈ నేపథ్యంలో అనర్హత ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏదైనా పిటిషన్ దాఖలైతే 8 వారాల్లోగా దానిని పరిష్కరించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

జడ్జి, కుటుంబ సభ్యుల పేర్లు ఎలా రాస్తారు?

- మీడియా తీరుపై టీ హైకోర్టు అభ్యంతరం

హైదరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో హైకోర్టు జడ్జి, కుటుంబ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రచురించడంపై టీ హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసును రిపోర్టింగ్ చేసేటప్పుడు సంయమనం పాటించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సూచించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాయకులు, ప్రముఖులు, వ్యాపారులతోపాటు హైకోర్టు జడ్జి ఫోన్‌ను సైతం ట్యాప్ చేశారని వచ్చిన వార్తలను హైకోర్టు సూమోటోగా స్వీకరించి, విచారిస్తోంది. ఈ పిటిషన్‌పై సీజే జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ ఆధారంగా పలు పత్రికల్లో (ఆంధ్రజ్యోతి కాదు) హైకోర్టు జడ్జి, వారి కుటుంబసభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రచురితం అయ్యాయి. దీనిపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని కౌంటర్ దాఖలు చేసినందున ప్రస్తుతానికి ఎలాంటి ఆదేశాలు ఇవ్వడం లేదని.. మీడియా సంయమనం పాటిస్తుందని విశ్వసిస్తున్నామని పేర్కొంది. తదుపరి విచారణ 23కు వాయిదా వేసింది.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● గురువారం 11 జూలై 2024

diksuchi@andhrajyothy.com

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్



పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బైపీసీ స్ట్రీమ్

ఈ స్ట్రీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఏ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపి, పులివెందుల)క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధృవీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధృవీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** బైపీసీ స్ట్రీమ్‌నకు జనరల్ అభ్యర్థులు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.500 చెల్లించాలి. ఎన్ఆర్ఐ, స్పాన్సర్డ్ కోటాలకు జనరల్ అభ్యర్థులు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.750 చెల్లించాలి.
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **చిరునామా:** రిజిస్ట్రార్, డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, వెంకటరామన్నగూడెం - 534101, పశ్చిమగోదావరి జిల్లా
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

జాబ్ కార్నర్

యూకో బ్యాంకులో అప్రెంటిస్‌లు


కోల్‌కతాలోని యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్, ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం.. దేశవ్యాప్తంగా యూకో బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 544

పోస్టు: అప్రెంటిస్
ఖాళీలు: 544(ఏపీలో 7, తెలంగాణలో 8 ఖాళీలు ఉన్నాయి)
అర్హత: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత
వయసు: 2024 జూలై 16 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
స్టయిపెండ్: నెలకు రూ.15,000
శిక్షణ వ్యవధి: ఏడాది
ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా **చివరి తేదీ:** జూలై 16
వెబ్‌సైట్: https://ucobank.com/en/



లిటిల్స్




తెలివైన కళాకారుడు


జయపురాన్ని పాలించే రాజు గోవింద వర్మకు కళలు అంటే ఎంతో ప్రీతి. తన రాజ్యంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన కళాకారులకు విలువైన బహుమతులు ఇచ్చి సన్మానిస్తూ ఉండేవాడు. ఒక రోజు గోవింద వర్మ తన కొలువులో ఒక సవాలు విసిరాడు. కుంచె మరియు రంగులు లేకుండా బొమ్మగీయగల చిత్రకారుడికి ఘనమైన సన్మానంతో పాటు వెయ్యి బంగారు నాణాలు బహుమతిగా ప్రకటించాడు. కానీ అతని ఆస్థానంలో చిత్రకారులంతా 'కుంచె, రంగులు లేకుండా చిత్రం ఎవరైనా ఎలా



గీయగలరు?' అనుకుని మౌనంగా ఉండిపోయారు. ఒక మారుమూల గ్రామంలో నివసించే కోటయ్య అనే పేద కళాకారుడికి మాత్రం ఎలాగైనా ఈ సవాలుకు జవాబు చెప్పి రాజు గారి మెప్పు పొందాలి అనిపించేది. అతను ఇలా ఆలోచిస్తూ ఉండగా అతని ఇంట్లో ఉన్న దీపం గూట్లో పైన ఉన్న తెల్లని గోడకు నల్లగా మసి పట్టడంగమనించాడు. ఆ మర్నాడ అతను కుంచె, రంగులు లేకుండానే బొమ్మ గీయగలనని రాజు గారి దర్శనానికి అనుమతి కోరాడు. అనుమతి లభించి రాజుగారి ఎదుటికి వెళ్లి, తన చేతి సంచీలోనుంచి ఒక దీపం మరియు తెల్ల కాగితం తీసి ఆ కాగితం నిండా దీపపు మసి పట్టేటట్లు చేసి, తర్వాత ఆ కాగితం మీద నేర్పుగా తన వేళ్లతో రాజుగారి చిత్రం గీశాడు. అతని సమయస్ఫూర్తికి రాజుగారు మెచ్చి, ఇచ్చిన మాట ప్రకారం ఘనమైన సన్మానంతో పాటు వెయ్యి బంగారు నాణాలు కానుకగా ఇచ్చి పంపాడు.

6 తేడాలు గుర్తించండి!






దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు

తెలుగు

1. ఆరు ఇంద్రగణాలు, రెండు సూర్య గణాలు ప్రతి పాదము నందు గలది
   1. తేటగీతి 2. ఆటవెలది 3. కందము 4. సీసము
2. ఈ కిందివాటిలో అలంకారాలను గుర్తించండి
   ఎ. బాసర కీర్తి పాలసముద్రం
   బి. బాసర కీర్తి పాలసముద్రం వలె అనంత వినీలాకాశంలో విహరించుచున్నది
   సి. బాసర కీర్తికి బాసర కీర్తియే సాటి
   1. రూపకం, లుప్తోపమాలంకారం, అనన్వయం
   2. రూపకం, పూర్ణోపమా, అనన్వయాలంకారం
   3. అనన్వయాలంకారం, ఉపమాలంకారం, రూపకాలంకారం
   4. స్వభావోక్తి, రూపకాలంకారం, ఉపమాలంకారం
3. శ్రీకృష్ణ దేవరాయలు తన పరాక్రమంతో రాజ్యాన్ని విస్తరింప చేశాడు. మహామంత్రి తిమ్మరుసు వలన మరింత బలోపేతుడయ్యాడు. ఈ వాక్యాలలోని 'తో', 'వలన' వంటి వాటిని ఇలా పిలుస్తారు.
   1. క్రియలు 2. అన్యదేశ్యాలు
   3. విభక్తి ప్రత్యయాలు
   4. ద్రుత ప్రకృతికములు
4. సమప్రాధాన్యం గల వాక్యాలు కలిపి ఒక వాక్యంగా ఏర్పడితే అది?
   1. అప్రధాన వాక్యం 2. సామాన్య వాక్యం
   3. సంయుక్త వాక్యం 4. సంశ్లిష్ట వాక్యం
5. ద్విపాద మకుటం గల శతకం
   1. దాశరథి 2. ఆంధ్రనాయక
   3. వేమన 4. తెలుగు బాల
6. రామాయణాన్ని జనప్రియ రామాయణం పేరుతో రచించింది?
   1. వావికొలను సుబ్బారావు
   2. గుడిపాటి వెంకటాచలం
   3. పుట్టపర్తి నారాయణాచార్యులు
   4. యథావాక్కుల అన్నమయ్య
7. 'ఖేదము' వ్యతిరేక పదము
   1. క్రోదము 2. చోదము 3. మోదము 4. శోధము
8. శివ తన జీవిత లక్ష్యం రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉందని అన్నాడు. (ప్రత్యక్ష కథనం/పరోక్ష కథనం)
   1. శివ "నా జీవిత లక్ష్యం రెండు వేల కిలోమీటర్ల దూరంలో ఉంది" అని అన్నాడు.
   2. శివ "తన జీవిత లక్ష్యం రెండువేల కిలోమీటర్లు ఉంది"అన్నాడు
   3. శివ "నా జీవితం రెండు వేల కిలోమీటర్లు అన్నాడు"
   4. తన జీవిత లక్ష్యం రెండువేల కిలోమీటర్లు అన్నాడు శివ
9. మంచి పుస్తకాలు కొనే అలవాటు చేసుకోండి. ఇది ఏ వాక్యం?



   1. ప్రేరణార్థక వాక్యం 2. సామర్థ్యార్థక వాక్యం
   3. ఆత్మార్థక వాక్యం 4. విధ్యర్థక వాక్యం
10. తెల్లని పొలంలో నల్లని విత్తనాలు చేతితో చల్లుతారు. నోటితో ఏరుతారు?(ప్రహేళిక)
    1. అక్షరాలు 2. అన్నం
    3. మినుములు 4. సీతాఫలం
11. బాలసాహిత్యంలో విశేష కృషి చేసినవారికి అమెరికన్ లైబ్రరీ అసోసియేషన్ వారు ఇచ్చే న్యూబెరి మెడల్ అనే విశిష్ఠ పురస్కారం అందుకున్న ఏకైక భారతీయుడు?
    1. గోనబుద్దారెడ్డి 2. ధనగోపాల్ ముఖర్జీ
    3. పరవస్తు చిన్నయసూరి
    4. బహుజనపల్లి సీతారామాచార్యులు
12. వర్తమాన అసమాపక క్రియతో కూడిన సంశ్లిష్ట వాక్యానికి ఉదాహరణ
    1. శ్రీనివాస్ ఏడ్చి పరిగెత్తుతున్నాడు
    2. శ్రీనివాస్ ఏడుస్తూ పరిగెత్తుతున్నాడు
    3. శ్రీనివాస్ ఏడ్వలేక పరిగెత్తుతున్నాడు
    4. శ్రీనివాస్ ఏడ్వాలనుకొని పరిగెత్తుతున్నాడు.
13. కిందివానిలో దాశరథి కృష్ణమాచార్యులు రచించిన 'తిమిరంతో సమరం'ను వరించిన పురస్కారం?
    1. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు
    2. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు
    3. ఉత్తమ అనువాద పురస్కారం 4. పైవన్నీ
14. "లాకృతి" అనే పదము ఉదాహరణ గల సంధి?
    1. గుణ సంధి 2. సవర్ణ దీర్ఘ సంధి
    3. యణాదేశ సంధి 4. లులనల సంధి
15. 'ఎ టైమ్‌లెస్ స్ప్రింగ్'ను 'అనాది సోతస్సు' పేరుతో తెలుగులోకి అనువదించింది?
    1. జిడ్డు కృష్ణమూర్తి 2. అనంతమాత్యుడు
    3. అరుణ్‌మోహన్ 4. భద్రిరాజు
16. బుర్రకథకు పితామహుడు
    1. మునిపల్లె సుబ్రహ్మణ్య స్వామి
    2. ఆదిభట్ల నారాయణదాసు
    3. షేక్ నాజర్ 4. మంగరాజు
17. 'సులభ గ్రాహ్యమగుట' అనే అర్థంలో వాడే జాతీయం?
    1. అందెవేసిన చెయ్యి 2. అల్లారు ముద్దుగా
    3. కాకతాళీయం 4. కరతలామలకం
18. నేను వారితో చెప్పాను ఇప్పుడు మీతో చెప్తున్నానులో పురుషులు...
    1. ఉత్తమ, ప్రథమ, మధ్యమ
    2. ఉత్తమ, మధ్యమ, ప్రథమ
    3. మధ్యమ, ఉత్తమ, ప్రథమ
    4. ప్రథమ, ఉత్తమ, మధ్యమ

సమాధానాలు

1) 4 2) 4 3) 3 4) 3 5) 2 6) 3 7) 3
8) 1 9) 4 10) 1 11) 2 12) 2 13) 2
14) 3 15) 3 16) 3 17) 1 18) 1

ENGLISH

There are about two hundred and forty different kinds of snakes in India. There are very small snakes, like the blind snakes and big ones like Pythons and Cobras. All snakes are not poisonous; only a few snakes like the Cobra, the Krait and the Viper are poisonous. Even some of the poisonous snakes willhurt us only if we hurt them.

Some of the nonpoisonous snakes are the blind snakes, the Vine snakes and the Cat snakes. These are commonly seen by people. Sometimes, blind snakes can be seen near water taps and they cause a lot of fear in people. These snakes mainly eat ants. The Vine snakes have a smooth deep green color. They are usually about a meter in length. The Cat snakes are brown in color. These have large eye and long thin bodies.

These nonpoisonous snakes are useful to man as they eat rats and other harmful animals.

1. **In India there are ....**
   1. More than five hundred different kinds of snakes
   2. About two hundred and forty different kinds of snakes
   3. About fifty different kinds of snakes
   4. A hundred and forty different kinds of snakes
2. **The poisonous snakes hurt us only when ....**
   1. They are hungry 2. We hurt them
   3. They are caught and put in a cage
   4. We hate them
3. **These snakes mainly eat ants. In this sentence 'these' refers to ....**
   1. All nonpoisonous snakes
   2. All poisonous snakes
   3. Blind snakes 4. Vine snakes
4. **The Cat snakes have ....**
   1. Bodies like the Vine snakes
   2. Eyes like the blind snakes
   3. Color like the Vine snakes
   4. Have a smooth deep green color
5. **............. of the snakes are not poisonous**
   1. A few 2. Some 3. Most 4. Any
6. **In the following sentence a wrong article is used. It is underlined. Replace it with the correct article from the choices given.**
   This is a news I hate to hear
   1. One 2. An 3. The 4. No article
7. **Smoking is injurious to health.**
   1. Adverb 2. Verb
   3. Adjective 4. Noun
8. **In which of the following sentences are all prepositions used correctly?**
   1. I am not sure if I can accept of the post, as I am still looking at a house to live in
   2. I am not sure if I can accept the post, as I am still looking for a house to live in
   3. I am not sure if I can accept of the post, as I am still looking for a house to live on
   4. I am not sure if I can accept of the post, as I am still looking out a house to live by
9. **They had completed the work without much delay. (Choose the passive form)**
   1. The work was completed by the them without much delay
   2. The work was been completed by them without much delay
   3. The work was being completed by them without much delay
   4. The work had been completed by them without much delay.
10. **In the following sentence, the under lined parts use the wrong tense form of the verb. Replace it with the correct choice from the forms given.**
    It was crazy to drive that: you would kill somebody.
    1. Could kill 2. Would have killed
    3. Can have killed
    4. Could have killed
11. **Tick the correct sentence?**
    1. He learns English on Sundays
    2. He is learning English on Sundays
    3. He has learnt English on Sundays.
    4. He was been learning English on Sunday.
12. **Which of the following statement is not a complex**
    1. As soon as he completed the work, he went out for a walk
    2. No sooner had he completed the work than he went out for a walk
    3. If he had completed his work, he would have gone out for a walk
    4. He had not only completed his work but also went for a walk.
13. **Which of the following sentences are rightly punctuated.**
    1. He said to me " What are you doing?"
    2. He said to me, "What are you doing?"
    3. He said to me,"what are you doing"?
    4. He said to me "What are you doing"?
14. **This small table /(A) will collapse /(B) if you will stand (C)/ on it (D).**
    1. A 2. B 3. C 4. D
15. **The priest said ,"God is omni present."(change into reported speech.)**
    1. The priest said that God is omnipresent
    2. The priest said that God was omnipresent
    3. The priest said that God has been omnipresent
    4. The priest said that God had been omnipresent
16. **Find out the correct meaning of the following PHRASAL VERBS which are underlined.**
    I can't make out what you are saying.
    1. Underline 2. Understand
    3. Explain 4. Prepare
17. **The ascused was not found guilty and was___**
    1. Removed 2. Dismissed
    3. Punished 4. Discharged
18. **Formal language is used in ____**
    1. Letters to relative 2. Official letters
    3. Friendly letters 4. All are correct

సమాధానాలు

1) 2 2) 2 3) 3 4) 1 5) 3 6) 3 7) 3
8) 2 9) 4 10) 4 11) 1 12) 4 13) 2
14) 3 15) 1 16) 2 17) 4 18) 2

ప్రశ్న పత్రాన్ని హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శీలం దేవేందర్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

డైలీ సుడోకు - 355

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 354 సమాధానం

7	8	3	1	9	6	5	4	2
1	5	6	4	2	7	3	8	9
4	2	9	5	3	8	7	1	6
5	3	1	8	4	9	6	2	7
8	6	2	7	5	1	4	9	3
9	7	4	2	6	3	1	5	8
6	4	5	9	7	2	8	3	1
3	9	8	6	1	5	2	7	4
2	1	7	3	8	4	9	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.